ఆదివారం
29-12-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 98
పేజీలు : 8, వెల : రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

స్పెయిన్‌లో పడవ ప్రమాదం: 69 మంది మృతి

బమాకో (మాలి): స్పెయిన్‌కు వెళుతున్న బోటు బోల్తా పడి 69 మంది మరణించారని మాలి అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు పడవలో 80మంది ప్రయాణిస్తున్నారన్నారు. పశ్చిమాఫ్రికా నుంచి స్పెయిన్‌లోని కేనరీ దీవులకు వెళుతుండగా దుర్ఘటన జరిగిందని, 11మంది సురక్షితమని మాలి విదేశాంగ శాఖ ఒక ప్రకటన చేసింది. మృతుల్లో 25మంది మాలి జాతీయులు ఉన్నట్లు తెలిపింది. అయితే ఈ నెల 19న ఈ దుర్ఘటన జరిగిందని తెలిపింది. మారిటానియా నిర్మాణ రంగ పరిశ్రమలో పనిచేసేందుకు ఏడు నెలల కిందట వీరందరూ వెళ్లినట్లు మారెనా నగర మేయర్ తెలిపారు.

రేపు నల్లగొండలో
వందేళ్ల వసంతం

సీపీఐ సమరశీల పోరాటాలకు 99 ఏళ్లు పూర్తి

విశాలాంధ్ర-హైదరాబాద్: సీపీఐ వంద వసంతాల ఉత్సవాలను ఈ నెల 30న నల్లగొండలో నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ ప్రముఖులు తెలిపారు. సమసమాజ స్థాపనే లక్ష్యంగా అనేక సమరశీల పోరాటాలు నిర్వహించి 99 వసంతాలు పూర్తి చేసుకుని శతాబ్దిలోకి అడుగు పెట్టిన కమ్యూనిస్టు పార్టీ ... దేశ స్వాతంత్ర్యం, అభివృద్ధికి ఎనలేని కృషి చేసిందన్నారు. నైజాం అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్ర బిందువుగా సాగించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నాలుగువేల మంది కమ్యూనిస్టు యోధులు సమిధలు కావడమే కాకుండా దేశమే గర్వించ దగ్గ కమ్యూనిస్టు నేతలు రావి నారాయణరెడ్డి, ధర్మబిక్షం, ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి వంటి ఎంతో మంది గొప్ప నాయకులను అందించి ఈ గడ్డ నుంచే శతాబ్ది ఉత్సవాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. నాగార్జున కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు వారు

- మిగతా 2 లో

ఉద్యోగుల మెడపై కత్తి

19 వేల మంది తొలగింపునకు బీఎస్ఎన్ఎల్ సిద్ధం

న్యూదిల్లీ: ప్రభుత్వ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ వేలాది ఉద్యోగులను ఇంటికి పంపేందుకు సిద్ధమైంది. ఈ మేరకు కొత్త స్వచ్ఛంద పదవీ విరమణ ప్రణాళిక వీఆర్ఎస్ 2.0 ప్రతిపాదించింది. సంస్థ ఆర్థిక సమతుల్యతను మెరుగుపరుచుకోవడానికి ఉద్యోగుల తగ్గింపును ప్రకటించింది. బీఎస్ఎన్ఎల్ తొలగింపులు దాదాపు 18 వేల నుండి 19 వేల మంది ఉద్యోగులపై ప్రభావం చూపుతాయని తెలుస్తోంది. దేశంలోని ప్రధాన నగరాలు, పట్టణాలు, గ్రామాలలో 4జీ, 5జీ వంటి అధునాతన నెట్‌వర్క్ టెక్నాలజీ విస్తరిస్తున్న వేళ బీఎస్ఎన్ఎల్ ఖర్చులు తగ్గించుకోవడంపైనా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా ఉద్యోగుల కొత్త స్వచ్ఛంద పదవీ విరమణ ప్రణాళికను ప్రతిపాదించింది. ఖర్చులు తగ్గించుకోవడానికి శ్రామిక శక్తి తగ్గింపు కోసం టెలికమ్యూనికేషన్ విభాగం ఆమోదం కోరింది. వీఆర్ఎస్ 2.0 కోసం రూ.1,500 కోట్లను ఆమోదించాలని విజ్ఞప్తి చేసింది. తాజా తొలగింపులు బీఎస్ఎన్ఎల్ వర్క్‌ఫోర్స్ మేనేజ్‌మెంట్‌పై ప్రభుత్వ ఖర్చులో 38 శాతం వరకు తగ్గించడంలో సహాయపడతాయి. ఈ ప్రక్రియలో బ్యాలెన్స్ షీట్ ఆరోగ్యవంతంగా ఉంటుంది. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ శ్రామిక శక్తి నిర్వహణ కోసం సుమారు రూ.7,500 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ ప్రతిపాదన కంపెనీ

- మిగతా 2 లో

31నే పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : సామాజిక పింఛన్లు (ఎన్‌టీఆర్ భరోసా పథకం) ఈ నెల 31వ తేదీన పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 1వ తేదీ నూతన సంవత్సరం కావడంతో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఒక రోజు ముందుగానే పింఛన్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఈనెల 31న పింఛన్ల

- మిగతా 2 లో

నాణ్యత లేని 111 మందులు

న్యూదిల్లీ: నాణ్యత ప్రమాణాల పరీక్షల్లో 111 మందులు విఫలమయ్యాయి.నవంబరులో జరిగిన పరీక్షల్లో ఈ మేరకు తేలింది. ది సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) పరీక్షించిన 41 నమూనాల్లో 'ఎన్ఎస్‌క్యూ' నిర్దేశించిన స్థాయి నాణ్యత లేదని నిర్ధారణ జరిగింది. అలాగే రాష్ట్ర మందుల పరీక్ష ల్యాబ్‌లో నవంబరులో పరీక్షించిన 70 నమూనాల్లోనూ ఎన్ఎస్‌క్యూ

- మిగతా 2 లో

ఇక సెలవు

- మన్మోహన్‌కు అంతిమ వీడ్కోలు పలికిన ప్రముఖులు
- అధికార లాంఛనాలతో మాజీ ప్రధాని అంత్యక్రియలు
- పాడె మోసిన రాహుల్... చితికి నిప్పు పెట్టిన పెద్ద కుమార్తె

న్యూదిల్లీ: మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కర్త డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు భారత్ అంతిమ వీడ్కోలు పలికింది. అధికార లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు దిల్లీలో శనివారం జరిగాయి. నిగంబోధ్ ఘాట్ శ్మాశానవాటికలో ఉదయం 11.30 గంటలప్పుడు మన్మోహన్ సింగ్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలు, సిక్కు సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. ఆయన చితికి పెద్ద కుమార్తె నిప్పు పెట్టారు. అంతకుముందు ప్రార్థనలు నిర్వహించారు. గురు గ్రంథ్ సాహెబ్‌లోని వాక్యాలను సిక్కు మతపెద్దలు, కుటుంబ సభ్యులు చదివారు. 21సార్లు గాల్లోకి కాల్పులు జరిపి మాజీ ప్రధానికి సైనికులు గన్ సెల్యూట్ ఇచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ... మన్మోహన్ పాడె

- మిగతా 2 లో

సాంకేతికతతో మెరుగైన వైద్యం

- ఏఐ సేవల సద్వినియోగానికి ప్రణాళికలు
- 108, 104 సేవలకు సింగిల్ సర్వీస్ ప్రొవైడర్
- ప్రతి మండలంలో జన ఔషధి స్టోర్లు
- వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో ఏపీ సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సమస్య ఉన్న ప్రతి ఒక్కరూ ఆసుపత్రికి వచ్చే అవసరం లేకుండా సాంకేతికత ద్వారా వైద్య సాయం పొందే పరిస్థితి తీసుకురావాలని సీఎం చంద్రబాబు అన్నారు. వైద్యంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సేవను సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు రచించాలని సూచించారు. ఉండవల్లిలోని తన నివాసంలో వైద్య ఆరోగ్య శాఖపై శనివారం సీఎం సమీక్ష చేశారు. వైద్య శాఖలో పేరుకుపోయిన సమస్యలు, తీసుకురానున్న సంస్కరణలపై చర్చించారు. ప్రివెంటివ్ హెల్త్ కేర్‌పై వైద్య ఆరోగ్య శాఖ దృష్టిపెట్టాలని సీఎం సూచించారు. 104 సర్వీసుల ద్వారా రక్త పరీక్షలు సహా ఇతర పరీక్షలు చేసి ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకునే విధానాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని సీఎం నిర్ణయించారు. ప్రజల ఆరోగ్య నివేదికలు రూపొందించడం,

- మిగతా 2 లో

31లోగా దలేవాల్‌ను ఆసుపత్రిలో చేర్చండి

న్యూదిల్లీ: అన్నదాతల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నెలరోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జిత్ సింగ్ దలేవాల్ ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుండటాన్ని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. ఆయనను ఆసుపత్రికి తీసుకెళ్లనివ్వని రైతుల తీరును ఆక్షేపించింది. మీరు ఆయనకు శ్రేయోభిలాషులా లేక ఆత్మహత్యను ప్రేరేపించే నేరస్తులా అంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈనెల 31వ తేదీలోగా ఆయనను ఆసుపత్రికి తరలించాలని పంజాబ్ ప్రభుత్వానికి స్పష్టం

- మిగతా 2 లో

సమానత్వం, పేదల అభ్యున్నతే ధ్యేయం

శతాబ్ది ఉత్సవాల్లో కూనంనేని

విశాలాంధ్ర-పినపాక: దేశంలో ప్రజల మధ్య సమానత్వం, నిరుపేదల అభ్యున్నతికి అనేక ఉద్యమాలు చేసిన ఏకైక పార్టీ సీపీఐ అని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మణుగూరు మండలం రామానుజరంలో శనివారం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుల్లోజు అయోధ్య అధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.అమరవీరుల స్మారక స్థూపం వద్ద కూనంనేని సీపీఐ జెండా ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. కూనంనేని మాట్లాడుతూ పేదోడి కోసమే సీపీఐ పుట్టిందని, పేదల హక్కుల సాధనకు ఎంతోమంది అమరులయ్యారని చారిత్రక ఘట్టాలు చెబుతున్నాయన్నారు. ఊపిరి ఉన్నంతవరకు పేదల హక్కుల కోసం పోరాడుతామన్నారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీపీఐ అంటేనే పేద ప్రజల హక్కుల కోసం పోరాడే పార్టీ అన్నారు. రాజకీయ వనమాలు ఈ పార్టీ నుంచే నేర్చుకున్నానని స్పష్టం చేశారు. విద్యార్థి దశలోనే పార్టీలో చేరి అనేక ఉద్యమాలు నిర్వహించి ఎంతో మంది విద్యార్థులకు న్యాయం చేశానని గుర్తు చేశారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలంటే తనకు ఎంతగానో గౌరవమన్నారు. ఎస్కే సాబీర్ పాషా, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పిరినకి నవీన్, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నృత్యంతో నూతన ఉత్తేజం

విశాలాంధ్ర-హైదరాబాద్: సీపీఐ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో జరిగిన బహిరంగ సభ వేదికపై పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు నృత్యం చేస్తూ కార్యకర్తలను ఉత్తేజ పరిచారు.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ఉత్సాహపూరితమైన వాతావరణంలో ఉత్సవాలు జరుగుతున్నాయని, పార్టీ శ్రేణులలో నూతన ఉత్తేజాన్ని నింపుతుందని కూనంనేని అన్నారు. జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబిర్ పాషా పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఈడీ నోటీసులు

విశాలాంధ్ర-హైదరాబాద్: ఫార్ములా ఈ-రేసు కేసులో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు శనివారం ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి ఏడో తేదీన విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌కు, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డికి కూడా ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి రెండు, మూడో తేదీన విచారణకు రావాలని వీరికిచ్చిన నోటీసుల్లో తెలిపారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా పీఎంఎల్ఏ కింద ఈడీ విచారణ చేపడుతోంది.

పేదల పక్షపాతి పీజేఆర్ రేవంత్ రెడ్డి

2లో

ఇదీ లోకం!

పేదల బియ్యంతో కమ్మగా వండిన బిర్యానీ, బాగా మెక్కండి!

తెలుగు భాషను కాపాడుకుందాం

- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఏపీలో ఏర్పాటు చేయాలి
- మాజీ సీజేఐ ఎన్వీ రమణ
- విజయవాడలో 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

విశాలాంధ్ర-విజయవాడ: తెలుగు భాషను కాపాడుకుందామని వక్తలు పిలుపునిచ్చారు. 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు స్థానిక కేబీఎన్ కళాశాల ఆవరణలో శనివారం ప్రారంభమయ్యాయి. అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాంగణంలో తెలుగు సాహితీ సౌరభాలు గుభాళించాయి. ఆంగ్ల పదాలు వాడకుండా రోజు గడవని పరిస్థితి ఎందుకు వచ్చింది? మన మాతృభాషని పరిరక్షించుకోవటం ఎలా? అనే అనే అంశాలను భాషాకోవిదులు విశ్లేషించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ మహాసభలను ప్రారంభించారు. మహాసభల గౌరవాధ్యక్షుడు మండలి బుద్ధ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ఎన్వీ రమణ మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడేవారి సంఖ్య దేశంలో 3వ

- మిగతా 2 లో

శతవసంతాల అరుణపథం

విప్లవ కార్యాచరణ కుట్ర అయిన వేళ

దేశంలో కమ్యూనిస్టు భావజాలం త్వరితంగా విస్తరిస్తున్న సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం గజగజలాడి పోయింది. 1908 నుంచి 1933 మధ్య అనేక కుట్ర కేసులు మోపింది. నిజానికి ఈ కుట్ర కేసులు ఇరవయ్యవ శతాబ్ద ఆరంభం నుంచే కనిపిస్తాయి. 1908లో ముజఫ్ఫర్ పూర్ కుట్ర కేసు, 1912లో ఢిల్లీ కుట్ర కేసు, 1922 లో పెషావర్ కుట్ర కేసు, 1924 లో కాన్పూర్ బోల్షెవిక్ కుట్ర కేసు, 1925లో కకోరీ కుట్ర కేసు మోపారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

భారతీయులకు 10 లక్షలకుపైగా అమెరికా వీసాలు

వాషింగ్టన్: భారతీయులు అమెరికాకు క్యూ కడుతున్నారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకే కాక సందర్శనార్థం వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. నాలుగేళ్లలో భారత్ నుంచి అమెరికాకు వెళ్లే వారి సంఖ్యలో ఐదు రెట్లు పెంపుదల నమోదైంది. ఈ పరిస్థితుల దృష్ట్యా భారతీయులకు 10 లక్షల కంటే ఎక్కువ 'నాన్ ఇమ్మిగ్రేషన్ వీసా'లను అమెరికా వరుసగా రెండో ఏడాది జారీ చేసింది. వీటిలో ఎక్కువ భాగం విజిటర్ వీసాలు ఉన్నట్లు సమాచారం. హెచ్-1బీ వీసాల రెన్యువల్‌కు రిపార్ట్మెంట్ ఆఫ్ స్టేట్ కూడా అమలు చేసింది. దీని వల్ల భారతీయులు ప్రయోజనం పొందే అవకాశం ఉంది. 2024 మొదటి 11 నెలల్లో 20లక్షల కంటే ఎక్కువ మంది వెళ్లారు. 2023తో పోలిస్తే ఇది 26 శాతం ఎక్కువ. ఇప్పటికే 50 లక్షల కంటే ఎక్కువ మంది నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాను కలిగి ఉన్నట్లు తెలిసింది. ఇలాంటి వీసాలను రోజూ జారీ చేస్తున్నట్లు రాయబార కార్యాలయం వెల్లడించింది. 2008-09లో అమెరికాకు ఎక్కువ మంది విద్యార్థులను పంపిన దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. 3,31,000 మంది భారతీయులు అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్నట్లు సమాచారం. ఇక ఎక్స్‌ఛేంజ్ విజిటల్ వీసాల విషయానికొస్తే వీటిని పొందిన భారతీయులు కూడా అమెరికా ఉండగలుగుతున్నారు. రెండేళ్లు ఉండవచ్చు కాబట్టి ఇది వారి కెరీర్, విద్యను కొనసాగించదానికి అనుకూలమైంది. ఎక్స్‌ఛేంజ్ విజిటర్స్ స్కిల్స్ లిస్ట్ నుంచి భారత్‌ను తొలగించడం వల్ల నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాలున్న వారికి సౌలభ్యం లభించింది.

ఉ.కొరియా సైనికులకు రష్యా రక్షణ లేదు: జెలెన్‌స్కీ

కీవ్: రష్యాకు మద్దతుగా యుద్ధంలో పోరాడుతున్న ఉత్తర కొరియా సైన్యానికి పుతిన్ సర్కార్ కనీస రక్షణ కల్పించడం లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. రక్షణ సౌకర్యాలు కల్పించకుండా యుద్ధంలోకి దించిందన్నారు. 'మాపై యుద్ధంలో పాల్గొన్న ఉత్తర కొరియా సైనికులకు సంబంధించిన నివేదికలు అందాయి. గాయపడిన సైనికులను మా దళాలు బంధించాయి. తీవ్రంగా గాయపడిన కారణంగా వారిని కాపాడలేకపోయాం' అని జెలెన్‌స్కీ తెలిపారు. కీవ్‌పై యుద్ధంలో పాల్గొన్న ఉత్తర కొరియా సైనికులను ఉక్రెయిన్ బంధించినట్లు దక్షిణ కొరియా నిఘా వర్గం శుక్రవారమే ఓ ప్రకటన చేసింది. జెలెన్‌స్కీ శనివారం ఇదే విషయాన్ని తెలిపారు. దక్షిణ కొరియా ప్రకటనపై అమెరికా స్పందించింది. 'ఉత్తర కొరియా సైనికులు ఉక్రెయిన్ దళాలకు లొంగిపోకుండా తమ ప్రాణాలను తీసుకుంటున్నట్లు నివేదికలు అందాయి. వారి కుటుంబాలపై ప్రతీకారం తీర్చుకుంటారనే భయంతోనే వారు ఇలా చేసివుండవచ్చు' అని అమెరికా జాతీయ భద్రతా అధికార ప్రతినిధి జాన్ కిర్బీ వెల్లడించారు.

పార్కర్ సోలార్ ప్రోబ్ రికార్డు

వాషింగ్టన్: అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ-నాసాకు చెందిన 'పార్కర్ సోలార్ ప్రోబ్' వ్యోమనౌక చరిత్ర సృష్టించింది. సూర్యుడికి అత్యంత చేరువగా వెళ్లి, అక్కడి నుంచి సురక్షితంగా వెలుపలికి వచ్చింది. ఈ ఘనత సాధించిన తొలి వ్యోమనౌకగా రికార్డు సృష్టించింది. ఈ యాత్రలో భానుడికి సంబంధించిన అనేక వివరాలను తనలో నిక్షిప్తం చేసుకుంది. సూర్యుడిపై పరిశోధనల కోసం పార్కర్ సోలార్ ప్రోబ్‌ను 2018లో నాసా ప్రయోగించింది. అంతరిక్ష వాతావరణం, సౌర తుపాన్లు, సౌర జ్వాలల గురించి తెలుసుకోవడం దీని ఉద్దేశం. భూ కక్ష్యలోని ఉపగ్రహాలు, పుడమిపైనున్న విద్యుత్ గ్రిడ్‌లు, ఎలక్ట్రానిక్ సాధనాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలపై వీటి ప్రభావం పడుతుంది. ఈ పోకడలపై లోతైన పరిశోధనల ద్వారా విపత్తుల గురించి ముందస్తు హెచ్చరికలకు వీలు కలుగుతుంది. ఏడేళ్లు పనిచేసేలా ఈ వ్యోమనౌకను రూపొందించారు.

ఇక సెలవు

(మొదటిపేజీ తరువాయి)

మోశారు. త్రివిధ దళాలు మన్మోహన్ సింగ్‌కు నివాళు లర్పించి, గౌరవ వందనం చేశాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ అగ్రనేతలు శ్రద్ధాంజలి ఘటించారు. అంతిమ సంస్కారాలకు హాజరయ్యారు. భూటాన్ రాజు జిగ్మేర్ కేసర్ వాంగ్‌చుక్‌తో పాటు విదేశీ ప్రముఖులు హాజరై మన్మోహన్ సింగ్‌కు అంజలి ఘటించారు. తొలుత ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం మన్మోహన్ సింగ్ భౌతిక కాయాన్ని ఏఐసీసీ కార్యాలయంలో ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు ఉంచారు. మన్మోహన్ భార్య గురుశరణ్ సింగ్, ఆయన కుమార్తెలతో పాటు కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక, మల్లికార్జున ఖడ్గే తదితరులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం అక్కడ నుంచి నిగమ్‌బోధ్ ఘాట్ వరకు అంతిమ యాత్ర సాగింది. కాంగ్రెస్ నాయకులు, వందలాది మంది కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులు యాత్రలో పాల్గొన్నారు. బంధువులతో పాటు రాహుల్ గాంధీ వెళ్లారు. 'విశ్వంలో సూర్యుడు, చంద్రుడు ఉన్నంత కాలం మీ పేరు సజీవం' అన్న నినాదాలతో అంతిమ యాత్ర మార్మోగింది. మాజీ ప్రధాని అంతిమ సంస్కారాలకు హాజరైన వారిలో హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు నాయకులు జేపీ నడ్డా, కిరణ్ రిజుజు, ఓం బిర్లా, కర్నాటక, తెలంగాణ, హిమాచల్, దిల్లీ ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు, కాంగ్రెస్ అగ్ర నాయకులు ఉన్నారు. విదేశీ ప్రతినిధులు ఉన్నారు. శ్లోకాల ఉచ్చరణ నడుమ నిగంబోధ్ ఘాట్‌లో మన్మోహన్ సింగ్ చితికి ఆయన పెద్ద కుమార్తె ఉపిందర్ సింగ్ నిప్పుపెట్టారు. మన్మోహన్ సింగ్‌కు సంతాప సూచితంగా దేశవ్యాప్తంగా ప్రధాన భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ పతాకాన్ని అవనతం చేశారు. ఏడు రోజుల పాటు సంతాప దినాలను ప్రకటించారు. మన్మోహన్ సింగ్ స్మారకం కోసం స్థలాన్ని కేటాయిస్తూ కేంద్ర హోంశాఖ ప్రకటన చేసింది. కేబినెట్ భేటీ తర్వాత కాంగ్రెస్ అధ్యక్షుడు ఖడ్గేతో మాట్లాడినట్లు వెల్లడించింది. ఇదిలావుంటే, మన్మోహన్ సింగ్ మృతికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతాపం ప్రకటించారు.ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈమేరకు శ్వేతసౌధం ఒక ప్రకటన చేసింది.

ఉద్యోగుల మెడపై కత్తి

(మొదటిపేజీ తరువాయి)

సంవత్సరానికి రూ.5,000 కోట్ల వరకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. బీఎస్ఎన్ఎల్ లేఆఫ్ అభ్యర్థనకు కేబినెట్, ఆర్థిక మంత్రిత్వ శాఖ నుండి అనుమతి రావాల్సి ఉంది. 2024 ఆర్థిక సంవత్సరంలో బీఎస్ఎన్ఎల్ ఆదాయం రూ.21,302 కోట్లుగా ఉంది. గతేడాది రూ.20,699 కోట్లతో పోలిస్తే ఇది కాస్త మెరుగు. ప్రస్తుతం సంస్థలో మొత్తం 55 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 25 వేల మంది ఎగ్జిక్యూటివ్ స్థాయి ఉద్యోగులు కాగా 30 వేల మంది నాన్ ఎగ్జిక్యూటివ్‌లు. 2019లో భారత ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ ఉద్యోగుల కోసం రూ.69 వేల కోట్ల పునరుద్ధరణ ప్రణాళికను ఆమోదించింది.

పేదల పక్షపాతి పీజేఆర్ రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: పేద ప్రజలకు అన్ని వేళలా అండగా నిలిచిన వ్యక్తి మాజీ మంత్రి దివంగత పి.జనార్దన్ రెడ్డి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. పీజేఆర్ వర్థంతిని పురస్కరించుకొని శనివారం ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. 1994 నుంచి 1999 వరకు సీఎల్పీ నేతగా పని చేసిన ఆయన ... నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడారని, తెలంగాణ వాదానికి బలమైన గొంతుకగా నిలిచారని సీఎం పేర్కొన్నారు.

రైతులతో తక్షణమే చర్చలు జరపాలి

కేంద్రానికి సీపీఎం డిమాండ్

న్యూదిల్లీ: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం పోరాడుతున్న రైతు సంఘాల నాయకులతో వెంటనే చర్చలు జరపాలని కేంద్రప్రభుత్వాన్ని సీపీఎం డిమాండ్ చేసింది. ఆమరణ దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ ఆరోగ్యంపై చింతన వ్యక్తం చేసింది. నవంబరు 26 నుంచి దలేవాల్ దీక్ష చేస్తున్న విషయం విదితమే. 'సీనియర్ రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దలేవాల్ నవంబరు 26వ తేదీ నుంచి నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆయన ఆరోగ్యం విషమిస్తోంది. ఎంఎస్‌పీకి చట్టబద్ధత, రుణ మాఫీ వంటి న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్నారు' అని సీపీఎం పొలిట్ బ్యూరో ప్రకటన పేర్కొంది.

తెలుగు భాషను కాపాడుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

స్థానంలో ఉందన్నారు. వాడుక భాష ప్రజలకు మరింత చేరువైతే ప్రభుత్వాలు ఆలోచిస్తాయని చెప్పారు. భాష కోసం ప్రజలు రోడ్లపైకి వస్తే భాష పరిరక్షణకు ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటాయని స్పష్టం చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఆంధ్ర ప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే జీవో 85ను రద్దు చేసి పూర్వపు విద్యావిధానాన్ని అమలు చేయాలన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 40 ద్వారా తెలుగు ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలని అన్నారు. మాతృభాషలో విద్యాభ్యాసం చేసే దక్షిణ కొరియా, జపాన్ వంటి దేశాలు నూతన ఆవిష్కరణలు చేస్తున్నాయని చెప్పారు. తెలుగులో చదువుకుని తరువాత 14 భాషలు నేర్చుకున్న వ్యక్తి నేడు ఐక్యరాజ్య సమితిలో దౌత్యవేత్తగా ఉన్నారని అన్నారు. సామాన్యులు కూడా కవితా ధోరణిలో మాట్లాడగలిగే తెలుగు భాషను వ్యాపార, రాజకీయాల కోసం వేరే భాష, సంస్కృతులు వచ్చి కొల్లగొట్టాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించరాదన్నారు. ఈ సందర్భంగా తెలుగు రచయితలు శ్రీశ్రీ, ఆరుద్ర, విశ్వనాథ సత్యనారాయణ, తెలుగు భాష కోసం కృషి చేసిన ఎన్టీ రామారావు, చెరుకూరి రామోజీరావును స్మరించుకున్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు వై.సుజనాచౌదరి మాట్లాడుతూ సాంకేతికతను వినియోగించుకుని తెలుగు నేర్చుకోవాలని సూచించారు. తెలుగు భాషాభివృద్ధికి ప్రపంచ తెలుగు రచయితల సంఘం సంస్థాగతంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. దానికి కావాల్సిన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రచయితల సంఘం రూపొందించిన 'మార్పు' గ్రంథాన్ని సుజనా చౌదరి ఆవిష్కరించారు. హోసూరు (తమిళనాడు) పార్లమెంటు సభ్యుడు కె.గోపీనాథ్ మాట్లాడుతూ పొరుగు రాష్ట్రాల్లో ఉన్న తెలుగు రచయితలను ఆదరించాలని కోరారు. దేశ రాజధాని దిల్లీ, ఇతర రాష్ట్రాల రాజధానుల్లో తెలుగు పత్రికలను ఏర్పాటు చేయాలన్నారు. మహాసభల ప్రారంభ సభలో జ్యోతి ప్రజ్వలన చేసిన మార్గదర్శి మేనేజింగ్ డైరెక్టర్ శైలజాకిరణ్ మాట్లాడుతూ మనది అనుకునే వాటిని ఎలా కాపాడుకుంటామో మన భాషను కూడా అలాగే కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. రామోజీరావు తన ఇంట్లో వారంతా తెలుగు మాట్లాడటం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారని తెలిపారు. తెలుగు భాషావృద్ధికి మనమంతా కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత తులసిరెడ్డి, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకటన్న, సినీ గేయ రచయిత భువన చంద్ర, పవర్ మెక్ ప్రాజెక్టు అధినేత సజ్జా కిషోర్‌బాబు, కేబీఎన్ కళాశాల పాలకవర్గ కార్యదర్శి డాక్టర్ తూగుంట్ల శ్రీనివాస్, చందన గ్రాండ్ సంస్థల నేత చందన కేదారేశ్, ప్రపంచ తెలుగు రచయితల మహాసభల అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం జరిగిన సభల్లో తెలుగు భాషాకోవిదులు, అభిమానులు తెలుగు భాష చరిత్ర, ప్రస్తుత పరిస్థితిని వివరించారు. ప్రధాన వేదిక చెరుకూరి రామోజీరావు సభావేదికపై 'తెలుగు వెలుగులు' సభ జరిగింది. ఈ సభలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రచయితలు నగ్నముని, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, గజల్ శ్రీనివాస్, అనంత శ్రీరామ్, వీణాపాణి హాస్యబ్రహ్మ శంకర నారాయణ హాజరయ్యారు. అనంతరం శాస్త్ర సాంకేతికరంగ ప్రతినిధుల సదస్సు జరిగింది. భారత రక్షణ మంత్రిత్వ శాఖ ముఖ్య సలహాదారు డాక్టర్ జి.సతీశ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తరువాత పత్రికలు, ప్రచురణలు, ప్రసార రంగాల సదస్సులో ఈనాడు సంపాదకుడు ఎం.నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదకులు యాబలూరి సీతారామశర్మ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రైతు నేస్తం సంపాదకులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, ఎమెస్కో సంస్థ అధినేత దూపాటి విజయకుమార్, అండమాన్ ఆకాశవాణి కేంద్రం నుంచి మోహితా కౌండిన్య పాల్గొన్నారు. ప్రసార మాధ్యమాల్లో వస్తున్న భాషా పోకడలను వివరించారు. అనంతరం వరుసగా మహిళా ప్రతినిధుల సదస్సు, సాంస్కృతిక రంగ ప్రతినిధుల సదస్సు జరిగాయి. రెండవ వేదికపై కవితా సదస్సు, విద్యారంగ ప్రతినిధుల సదస్సు, సాహిత్య సదస్సు, యువకళాల సమ్మేళనం జరిగింది. మూడవ వేదికపై మూడు కవితా సమ్మేళనాలు జరిగాయి. ప్రధాన వేదికపై ఆచార్య ముసుగు శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు, పుస్తక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తెలుగు భాషాభిమానులతో, కవులు, రచయితలతో కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.

కమ్యూనిస్టులే నిజమైన దేశభక్తులు

శత వసంతోత్సవాల ర్యాలీలో తక్కళ్లపల్లి

విశాలాంధ్ర-వరంగల్: దేశంలో కమ్యూనిస్టులే నిజమైన దేశ భక్తులని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంత ఉత్సవాల సందర్భంగా నగరంలోని రైల్వే స్టేషను నుంచి చౌరస్తా వరకు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు.

ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి మాట్లాడుతూ దేశంలో మతాలు, కులాల మధ్య విభేదాలు సృష్టిస్తున్న మతోన్మాదులు దేశ ద్రోహులని అన్నారు. సమసమాజ స్థాపనే సీపీఐ ధ్యేయం అన్నారు. అంతరాలు లేని సమాజం కోసం కమ్యూనిస్టులు పోరాటం చేస్తున్నారన్నారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్వహించి వేలాది ఎకరాల భూములను పేదలకు ఘనత సీపీఐకే దక్కిందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పనిచేసిన ఏకైక పార్టీ అని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టులదే కీలక పాత్ర అని, నిలువ నీడలేని ఎంతో మంది పేదలకు భూములు ఇళ్ల స్థలాలు ఇప్పించారన్నారు. వరంగల్ జిల్లాలో వేలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించినట్టు వివరించారు. వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాషు మియా, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు దండు లక్ష్మణ్, బుస్సా రవీందర్, తోట చంద్రకళ, అక్కపల్లి రమేష్, వీరగోని శంకరయ్య, కందిక చెన్నకేశవులు, గడ్డం యాకయ్య, ఓర్సు రాజు, ఎండీ అక్బర్, మేడిది అశోక్, తాళ్లపల్లి జాన్ పాల్, పరికరాల రమేష్, జన్ను రవి, ఆరె రాజు, శరత్, మస్క సుధీర్, చింత కింది కుమారస్వామి, అయిత యాకుబ్, పాలక కవిత, గోవర్ధనాచారి పాల్గొన్నారు.

31లోగా దలేవాల్‌ను ఆసుపత్రిలో చేర్చండి

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. లేనిపక్షంలో కోర్టు ధిక్కరణ చర్యలకు సిద్ధంగా ఉండండని హెచ్చరించింది. దలేవాల్‌కు వైద్యం అందించాలన్న తన సూచనలను బేఖారుతు చేస్తూ... పరిస్థితి చేయి దాటే వరకు ఎలా ఊరుకున్నారని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ సుధాంశు ధులియాతో కూడిన ద్విసభ్య వకేషన్ బెంచ్ మొట్టికాయలు వేసింది. న్యాయపరమైన ఆదేశాలను ఎలా బేఖాతరు చేస్తారని నిలదీసింది. దీంతో తమ నిస్సహాయతను కోర్టుకు పంజాబ్ ప్రభుత్వం మొర పెట్టుకున్నది. దలేవాల్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లకుండా రైతులు అడ్డుకుంటున్నారని తెలిపింది. పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మిందర్ సింగ్ వాదనలు వినిపించారు. 'నిరసన శిబిరానికి వెళ్లిన నిపుణుల బృందం ఆసుపత్రిలో చేరితే వైద్య సాయం అందుతుందని దలేవాల్‌కు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు కానీ దలేవాల్ వినలేదు. ఎలాంటి వైద్య సాయం వద్దన్నారు. ఐవీ డ్రిప్స్ (సెలైన్) కూడా నిరాకరించారు. వైద్యం తీసుకుంటే తన లక్ష్యం నెరవేరదని, ఇప్పటివరకు చేసినదంతా వృథా అవుతుందని చెబుతున్నారు' అని సింగ్ చెప్పడం ధర్మాసనానికి కోపం తెప్పించింది. తోటి రైతులను మృత్యువు ఒడికి చేర్చాలనుకునే వీరు నాయకులా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. పరిస్థితిని అదుపు చేయడం చేతకాదా అంటూ పంజాబ్ ప్రభుత్వాన్ని గదమాయించింది. దలేవాల్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లనివ్వని రైతు నాయకులు ఆయన శ్రేయోభిలాషులు ఎలా అవుతారు... ఆత్మహత్యకు ప్రేరేపించిన నేరస్తులు అవుతారని దుయ్యబట్టింది. వారికి కావాల్సినది ఆయన ప్రాణమా లేక మృత్యుతా అని ప్రశ్నించింది. 'వారి (రైతులు) ప్రవర్తనపై ఇంకేం మాట్లాడం. రాష్ట్రంలోని అగ్రస్థాయి రైతు నాయకుల్లో దలేవాల్ ఒకరు. ఆయనను ఎలాగోలా ఒప్పించి ఆసుపత్రికి తరలించండి. దీక్ష విరమింపజేయొద్దు. ఈసారైనా చెప్పింది చేయండి' అని పంజాబ్ ప్రభుత్వానికి సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. అవసరమైన కేంద్ర సహకారం తీసుకోవాలని సూచించింది. కావాలంటే వారెంట్లు జారీ చేయండని ఆదేశించింది. 'మీరు ఏం చేస్తారో తెలియదు. దలేవాల్‌ను ఒప్పించండి. ఆయనను 31వ తేదీలోగా ఆసుపత్రికి తరలించండి' అని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

నాణ్యత లేని 111 మందులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం నాణ్యతా ప్రమాణాలు లేవని తేలిందని అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు రెండు నకిలీ మందులను గుర్తించినట్లు పేర్కొన్నాయి. ఈ రెండు నమూనాల్లో ఒకటి బీహార్ మందుల నియంత్రణ యంత్రాంగం, మరొకటి గాజియాబాద్ సీడీఎస్‌సీఓ సేకరించాయి. ఇతర కంపెనీల బ్రాండ్‌ల పేర్లతో గుర్తు తెలియని ఉత్పత్తిదారులు అనధికారికంగా మందులు తయారు చేశాయని వెల్లడైంది.

సన్నిహితుల చేతుల్లో బందీగా నితీశ్: తేజస్వీ

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ స్వతంత్రంగా పనిచేయలేకపోతున్నారని, ఆయన తన సన్నిహితుల చేతుల్లో బందీగా ఉన్నారని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ వ్యాఖ్యానించారు. నితీశ్ మరోసారి కూటమి మారతారన్న ఊహాగానాలపై శనివారం విలేకరుల ప్రశ్నలకు బదులిస్తూ అవన్నీ నిరాధారమని కొట్టిపారేశారు. రాష్ట్ర పరిపాలనకు సంబంధించి సొంతంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితిలో నితీశ్ లేరన్నారు. తన పార్టీలోని నలుగురు నేతల చేతిలో ఆయన బందీగా మారారని వ్యాఖ్యానించారు. ఈ నలుగురిలో ఇద్దరు దిల్లీలో... మరో ఇద్దరు బీహార్‌లో నితీశ్ పక్కనే ఉన్నారన్నారు. తన వాదనకు బలం చేకూర్చేందుకు దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ లేఖకు నితీశ్ తరఫున వచ్చిన స్పందనను ఉదహరించారు. 'రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యల నేపథ్యంలో బీజేపీకి మద్దతు ఇవ్వడంపై పునరాలోచించాలని కోరుతూ నితీశ్‌కు కేజ్రీవాల్ లేఖ రాశారు. బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధ్యక్షుడి హోదాలో ఉన్న నితీశ్ కుమార్‌నుద్దేశించిన రాసిన లేఖకు సంజయ్ ఝా (జేడీయూ నేత) నుంచి సమాధానం వచ్చింది. ముఖ్యమంత్రికి రాసిన లేఖకు సమాధానం ఇవ్వడానికి ఆయన ఎవరు?' అని తేజస్వీ ప్రశ్నించారు. అమిత్‌షాను సమర్థిస్తూ, కేజ్రీవాల్‌ను విమర్శిస్తూ ఝా సమాధానం పంపారు. దీన్నిబట్టి ముఖ్యమంత్రి పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చని అన్నారు. తాజా పరిణామాల దృష్ట్యా రాష్ట్రం ఎవరి చేతుల్లో ఉందో ప్రజలు తెలుసుకోవాలని సూచించారు. నితీశ్ పాలనలో బీహార్ ప్రజలు ఇంకెన్ని ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వస్తుందో అంటూ తేజస్వీ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు.

రేపు నల్లగొండలో వందేళ్ల వసంతం

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. హిమాయత్‌నగర్‌లోని మగ్దూంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మధ్యాహ్నం రెండు గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, కందిమళ్ల ప్రతాపరెడ్డి, ఎం.కె.మొహినుద్దీన్, దొడ్డ నారాయణరావులను సన్మానించనున్నట్లు తెలిపారు. ప్రధాన వక్తలుగా జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, పశ్యపద్మ, కలవేణ శంకర్, ఎం.బాలనరసింహా, బాగం హేమంతరావు, ఇ.టి.నరసింహా, జాతీయ చలన చిత్ర అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ హాజరు కానున్నారని పేర్కొన్నారు. తొలుత మన్మోహన్ సింగ్, ప్రముఖ సినీ దర్శకులు శ్యామ్ బెనగల్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అంతరాలు లేని సమాజమే లక్ష్యం: చాడ వెంకటరెడ్డి

దేశ స్వాతంత్రోద్యం మొదలు అంతరాలు లేని సమాజమే లక్ష్యంగా సీపీఐ అనేక సమరశీల పోరాటాలు చేసిందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి తెలిపారు. శతాబ్ది ఉత్సవాల స్ఫూర్తితో తాడిత, పీడిత, అట్టడుగు వర్గాల ప్రజలకు మరింత చెరువకావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సీపీఐ నేతలపై అనేక అక్రమ కేసులు బనాయించి జైళ్లలో నిర్బంధించినప్పటికీ మొక్కవోని ధైర్యంతో నేటికి పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్టు చెప్పారు.

మన్మోహన్‌కు సముచిత స్థానం కల్పించని కేంద్రం: అజీజ్ పాషా

దేశానికి ఏనలేని సేవలందించిన మన్మోహన్‌సింగ్ అంత్యక్రియలను బోధ్ ఘాట్ వద్ద నిర్వహించడం ఆక్షేపణీయమని, మరణానంతరం ఆయనకు కేంద్ర ప్రభుత్వం సముచితస్థానం కల్పించకపోవడం విచారకరమని జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. శతాబ్ది ఉత్సవాలు నల్లగొండలో ప్రారంభం కానుండగా 2025, డిసెంబరు 26 జాతీయ ఉత్సవాలు ఖమ్మంలో బహిరంగ సభతో ముగుస్తాయన్నారు.

కమ్యూనిజం బలహీనపడలేదు: పల్లా వెంకటరెడ్డి

భారత దేశంలో కమ్యూనిజం బలహీన పడలేదని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి తెలిపారు. దేశంలో సంకీర్ణ రాజకీయ శకం ప్రారంభమైందన్నారు. కాంగ్రెస్‌కుగాని, బీజేపీకి కాని ఒంటిరిగా ప్రభుత్వాలను ఏర్పాటు చేసే పరిస్థితి నేడు లేదన్నారు. చీలిపోయిన కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకంకావాలని పిలుపునిచ్చారు.

సాంకేతికతతో మెరుగైన వైద్యం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వపరంగా ఆరోగ్య పరీక్షలు చేసి హెల్త్ కార్డ్ ఇచ్చే విధానాలు అమలు చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని సీఎం అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం, 108, 104 సేవలు, ఎన్టీఆర్ వైద్య సేవను బీమా విధానంలో తీసుకువచ్చి నాణ్యమైన వైద్యసేవలు అందించే విషయంపైనా అధికారులతో సీఎం చర్చించారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 108, 104 సర్వీసులకు విడివిడిగా ఆపరేటర్లు ఉండేవారు. 2020 తరువాత కాల్ సెంటర్‌తో కలిపి ముగ్గురు ఆపరేటర్ల ద్వారా సేవలు అందించారు. ప్రభుత్వం మళ్లీ కొత్తగా టెండర్లకు వెళ్లనున్న నేపథ్యంలో సింగిల్ ఆపరేటర్ ద్వారా మూడు సేవలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న 108 సర్వీసులు అందిస్తున్న 190 అంబులెన్స్‌లు ఫిట్‌నెస్ కోల్పోయాయి. 2016లో కొనుగోలు చేసిన వీటిని మార్చాల్సి ఉంది. వీటన్నింటినీ పూర్తిగా మార్చి కొత్తవాహనాలు కొనుగోలు చేయాలనే ప్రతిపాదనకు సీఎం అంగీకారం తెలిపారు.

108 సిబ్బందికి అదనంగా రూ.4 వేలు

108 సర్వీసులో సిబ్బంది, డ్రైవర్ 12 గంటల పాటు డ్యూటీలో ఉండాల్సి ఉండడంతో, వీరికి జీతంతో కలిపి అదనంగా రూ.4 వేలు చెల్లించేవారు. అయితే గత ప్రభుత్వం రూ.2 వేలు మాత్రమే ఇచ్చింది. దీన్ని తిరిగి పెంచి... గతంలో ఇచ్చినట్లు ఇకపై జీతానికి అదనంగా రూ.4 వేలు ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఆసుపత్రుల్లో చనిపోయిన వారి మృతదేహాలు తరలించేందుకు మహాప్రస్థానం వాహనాలు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వాటి సంఖ్య పెంచాల్సి ఉందని అధికారులు తెలపగా సీఎం అంగీకరించారు. ఇందులో భాగంగా 58 మహాప్రస్థానం వాహనాలను సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా అందుబాటులోకి తేనున్నారు. దీనికి యేడాదికి రూ.9.45 కోట్లు అదనంగా ఖర్చు కానుంది. ఆసుపత్రుల వద్ద అంబులెన్స్ మాఫియా వంటి ముఠాల ఆగడాలు సాగడానికి వీల్లేదని సీఎం అధికారులకు స్పష్టంచేశారు. ఆత్మీయులను కోల్పోయి బాధల్లో ఉన్న ప్రజలను పీల్చుకుతినే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆరోగ్య బీమాతో నాణ్యమైన వైద్య సేవలు

ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా 1.43 కోట్ల కుటుంబాలకు చెందిన 4.30 కోట్లమందికి ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి. ఎన్టీఆర్ వైద్య సేవలో 3,257 రకాల జబ్బులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల మేర హెల్త్ కవరేజ్ ఉంటుంది. ట్రస్ట్ పద్ధతిలో ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్య సేవ కార్యక్రమం నిర్వహిస్తుండగా... ఈ కార్యక్రమాన్ని బీమా విధానంలో తీసుకొచ్చే అంశంపై చర్చించారు. ఆరోగ్య బీమా విధానం వల్ల మరింత మెరుగ్గా, నాణ్యమైన సేవలు అందించే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. రాష్ట్రాన్ని రెండు యూనిట్లుగా విభజించి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్న బీమా కంపెనీల ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ఎన్టీఆర్ వైద్య సేవ లబ్ధిదారులు అందరికీ ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధానాలను పరిశీలించి... అధికారులు చేసిన ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. జన్ ఔషధి మందుల షాపులను ప్రతి మండలంలో ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సమీక్షలో వైద్య, ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

31నే పింఛన్ల పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాలకు ఆదేశాలు అందాయి. ఇక ఎన్టీఆర్ భరోసా పథకం కింద అందించే సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరింత సరళీకృతం చేసింది. ఇకపై ఆరేడు నెలలకు ఒకసారి కొత్తగా పింఛన్లు మంజూరు చేసే ధోరణికి స్వస్తి పలికింది. ఇప్పటికే పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే వెంటనే భార్యకు ఏ నెలకు ఆ నెలే పింఛను ఇచ్చే విధానాన్ని అమలులోకి తెచ్చింది. దీన్నే స్పౌజ్ కేటగిరీగా గుర్తిస్తూ పింఛను మంజూరు చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గత నెల నవంబరు 1వ తేదీన శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా స్పౌజ్ కేటగిరీ కింద ఎప్పటికప్పుడు వితంతువులకు పింఛను మంజూరు చేస్తామని ప్రకటించారు. అందులో భాగంగానే నవంబరు 1 నుంచి డిసెంబరు 15వ తేదీ వరకు కొత్తగా 5,402 మందికి వితంతువు (ఇప్పటికే పింఛను తీసుకుంటున్న భర్త చనిపోయిన వారికి) కేటగిరీలో ప్రభుత్వం పింఛను మంజూరు చేసింది. వీరికి డిసెంబరు 31న రూ.4 వేల చొప్పున పింఛను పంపిణీ చేయనున్నారు. అలాగే గత మూడు నెలల వ్యవధిలో వివిధ రకాల కారణాలతో పింఛను తీసుకోకుండా ఉన్న 50 వేల మందికి సైతం రెండు, మూడు నెలల మొత్తాన్ని కలిపి ఒకేసారి డిసెంబరు 31న వారి చేతికి అందించనున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-వనపర్తి : ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం వీపనగండ్ల మండల కేంద్రంలోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఓపి రిజిస్టర్, డెలివరీలకు సంబంధించిన రిజిస్టర్, మందుల రిజిస్టర్ లను తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. వైద్యులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరగాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర మందుల నిల్వలు ఉన్నాయా లేదా చూసుకోవాలన్నారు. వైద్యుల హాజరుపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దృష్టి సాదించాలని సూచించారు. ఆస్పత్రికిలో కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని, ప్రసవాల సంఖ్య మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీపనగండ్ల మండలం పరిధిలోని కల్వరాల గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. లోడింగ్ జరిగి ధాన్యం మిల్లుకు పంపిన వెంటనే వాట్సాప్ ద్వారా ట్రక్ షీట్ తెప్పించుకొని రైతులకు వెంటనే నగదు పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీపనగండ్ల ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుర్గయ్య స్ఫూర్తితో పోరాటాలు బలోపేతం

విశాలాంధ్ర (మహబూబాబాద్) మరిపెడ: అమరజీవి పిట్టల దుర్గయ్య స్ఫూర్తితో మరిపెడ మండలంలో పోరాటాలు బలోపేతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అల్వాల వీరయ్య పిలుపునిచ్చారు. శనివారం మరిపెడ మండల పురుషోత్తమాయ గూడెంలోని దుర్గయ్య జ్ఞాపకార్థం నిర్మించిన స్థూపం వద్ద సీపీఎం మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ అధ్యక్షతన పిట్టల దుర్గయ్య 14వ వర్ధంతి సభ జరిగింది. దుర్గయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బాణాల రాజన్న, జిన్న లచ్చన్న,కందాల రమేష్, కొండ ఉప్పలయ్య,బోడపట్ల రాజశేఖర్,దొంతు మమత, నందిపాటి వెంకన్న,దొంతు సోమన్న,అల్లి శ్రీనివాస్ రెడ్డి, పాల్వాయి దుర్గయ్య, రామన్న,బయ్య సురేష్,ఎర్ర వెంకన్న,ఎల్లమ్మ,కుటుంబ సభ్యులు పిట్టల శ్రావణ్, సునీత,పద్మ,గ్రామ నాయకులు కంచుకంట్ల పిచ్చయ్య,అనసూయ,జయమ్మ,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌గేమ్ నిందితుడు అరెస్టు

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: ఆన్‌లైన్ గేమ్ పేరుతో మోసం చేసి రూ.1,36,96,290లు స్వాహా చేసిన నేరస్తుడు మహమ్మద్ అబ్దుల్ నయీంను సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఎస్.హెచ్.ఓ డీఎస్పీ యం.వెంకటరమణ, ఇన్స్పెక్టర్ జె. కృష్ణమూర్తిలు చాక చక్యంగా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు రామగుండం పోలీస్ కమీషనర్ ఐ.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడు అప్ ద్వారా డబ్బులు ఇన్వెస్ట్ చేస్తున్నానని చెప్పి ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించి మోసపోయిన వ్యక్తిని నమ్మించి తరచూ డబ్బులు వేయించు కొని వాటిని అతని అవసరాల కోసం వాడుకొన్నాడని తెలిపారు. ప్రజలు ఆన్‌లైన్ గేమ్స్,షేర్ మార్కెట్‌ను నమ్మి మోసాలకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు

ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలి : జేసీ

విశాలాంధ్ర, కొమరం భీం : జిల్లాలోని కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పనులను సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ కిరణ్‌లతో కలిసి పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రెండు పడక ఇళ్ల నిర్మాణం పనులలో పెండింగ్ ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సాధించి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కాగజ్ నగర్ మండలం కోసిని గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను పరిశీలించారు.

డిజిటల్ ల్యాబ్‌లు సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్

విశాలాంధ్ర,కొమురం భీం : గిరిజన విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లాలోని హట్టి ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటుచేసిన డిజిటల్ ల్యాబ్ ను సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ-ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్తా తో కలిసి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ఉపాధ్యాయులు తరగతులలో బోధించే పాఠ్యాంశాలతో పాటు డిజిటల్ ల్యాబ్ ల ద్వారా అర్థం కాని విషయాలను నేర్చుకుని వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు.

ఏసీబీ వలలో సర్వేయర్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: జిల్లాలోని ప్రభుత్వ అధికారుల్లో అవినీతి పెరిగిపోయిందా అన్నట్లుగా ఇటీవల కాలంలో ఏసీబీ దాడుల్లో లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోతున్నారు. ఈ మధ్యకాలంలోనే జిల్లా స్థాయి అధికారుల నుండి మండల స్థాయి అధికారులు కొందరు ఏసీబీకి చిక్కడం విశేషం. ఈ పరంపరలో భాగంగానే రూ. 50 వేలు లంచం తీసుకుంటూ దమ్మపేట మండలం రెవెన్యూ సర్వేయర్ మెరుగు వెంకటరత్నం ఏసీబి అధికారులకు శనివారం చిక్కారు. మారువేషంలో వచ్చిన ఏసీబీ అధికారులు సినీ పక్కీలో దాడి చేసి సర్వేయర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మ్మపేట, అశ్వరావుపేట రెవెన్యూ కార్యాలయాలు లంచావతారాలుగా మారాయని ఇటీవల కాలంలో ఆరోపణలు అధికమయ్యాయి. గతంలో ఇదే కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐ లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం మరువక ముందే మరొక లంచావతారి పట్టు పడటం విశేషం. గాంధీనగరంలో ఉన్న ఒక రైతుకు చెందిన 19 ఎకరాల భూమిని సర్వే చేసి, అధికారికంగా పత్రాలను ఇవ్వకుండా వెంకటరత్నం ఇబ్బందులు పెట్టాడు. పత్రాల కోసం రూ. లక్షన్నర లంచం డిమాండ్ చేస్తూ వచ్చాడు. ఇంత లంచం ఇచ్చుకోలేని ఆ రైతు విసిగి పోయి ఏసీబీ డీఎస్పీ రమేష్ ను ఆశ్రయించాడు. దింతో పగడ్బందీగా ఏసీబీ అధికారుల బృందం నేషనల్ హైవే రోడ్ లో ఇటుక బట్టీలు దగ్గర రైతు దగ్గర రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా సర్వేయర్ వెంకటరత్నం ను పట్టుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్పి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం ఇవ్వాలని డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు ఫోన్ చేయాలని కోరారు.

ఎమ్మెల్యే కూనంనేని సమక్షంలో

20 కుటుంబాలు సీపీఐలో చేరిక

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ప్రజల పక్షం నిలిచి చేసే పోరాటాలు, ప్రజలతో సంబంధాలు పార్టీ మనుగడకు దోహదపడతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రజలతో కలిసి సమిష్టి కృషితో నియోజకవర్గం లోని ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకున్నామని ఆయన నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని ఉమ్మడి రేగళ్ల గ్రామపంచాయతీకి చెందిన 20 కుటుంబాలు కూనంనేని సమక్షంలో సీపీఐలో చేరారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో జరిగిన సమావేశంలో పార్టీలో చేరిన కుటుంబాలకు ఎర్ర కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గంలో సీపీఐ పార్టీని జనం ఆదరిస్తున్నారని, ఇది ప్రజలకు పార్టీ నాయకులు కార్యకర్తలు అందిస్తున్న సేవల ఫలితమేనని అన్నారు. నూతనంగా చేరుతున్న నాయకులు పార్టీతో పాటు ప్రజాసంఘాల్లో బాధ్యతలు తీసుకొని సేవలందించడం ద్వారా సీపీఐని మరింత బలోపేతం చేయాలన్నారు. రేగళ్ల, పరిసర గ్రామాలను అన్నివిధాలా అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు తాను మొదటి ప్రాధాన్యత ఇచ్చి కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ రహదారులు, విద్యుత్, అంతర్గత రోడ్లు, త్రాగు, సాగు నీరు అందించేందుకు నిత్యం తాను కృషి జరుగుతోందన్నారు. మారినేని మాధవరావు, షేక్ పాషా, దళవాయి వినయ్, శెట్టుపల్లి శివాజీ, షేక్ అన్వర్ పాషా, వాసం శివకృష్ణ, పడిగ అభిలాష్, వట్టం హరి, గంగుల రమేష్, దడవాయి వెంకటేశ్వర్లు తదితరులు సిపిఐలో చేరినవారిలో వున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, సిపిఐ చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, కంటెం శ్రీనివాసరావు, వెంకటనర్సయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

30న వామపక్షాల నిరసనలు

విశాలాంధ్ర - కొత్తగూడెం : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కరుపై కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వామపక్షాల నాయకులు ఉద్యమాన్ని చేపట్టబోతున్నారు. ఈ మేరకు వామపక్షాల ఆధ్వర్యంలో కొత్తగూడెంలో డిసెంబర్ 30న నిరసన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో వామపక్షాల ఉమ్మడి సమావేశం జరిగింది. ఇందులో జిల్లా నాయకులు మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్ షా రాజ్యాంగ విధివిధానాలు అతిక్రమిస్తూ ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. అందులో భాగమే అంబేద్కర్ లాంటి మహనీయుడిని పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు ద్వారా రాజ్యాంగాన్ని అవహేళన చేశారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టాక మనువాదాన్ని, ఫాసిస్టు విధానాలను అమలు చేస్తూ దేశ ప్రజల మధ్య విచ్చిన్నానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. బిజెపి కుట్రోలో భాగమే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను అమిత్ షా అవమానించారని నాయకులు స్పష్టం చేశారు. జాతీయ వామపక్షాల పిలుపుమేరకు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన మచ్చ వెంకటేశ్వర్లును వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాష, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా నాయకులు ముత్యాల విశ్వనాథం, కంచర్ల జమలయ్య, సిపిఐ ఎమ్ ఎల్ నాయకులు బానోత్ ధర్మ, ఏదులాపురం గోపాలరావు, పెద్దబోయిన సతీష్, న్యూ డిమోక్రసీ జిల్లా నాయకులు అలీముద్దీన్, సిపిఎం నాయకులూ రేపాకులా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: అభివృద్ధి పనులపై ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి అధికారులతో శనివారం మెదక్ కలెక్టరేట్లో సమీక్షించారు. అదనపు కలెక్టర్ నగేష్, ముఖ్య ప్రణాళిక అధికారి బద్రీనాథ్, ఈ.ఈ పి.ఆర్ నర్సింలు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఎమ్మెల్సీ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో పటిష్ట కృషి చేస్తున్నామని తెలిపారు. 2021- 22, 2022- 23 సంవత్సరంకుగాను రూ.5 కోట్ల 60 లక్షల వ్యయంతో 94 పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో సీసీ రోడ్లు, భవన నిర్మాణాలు ఉన్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 55 పనులు పూర్తయ్యాయి. 24 పనులు వివిధ దశలో పురోగతిలో ఉన్నట్లు పేర్కొన్నారు. పెండింగ్ పనులను వేగం పెంచాలని, వివిధ దశలలో పురోగతిలో ఉన్న పనులను వచ్చే జనవరి 2025 నెలాఖరు వరకు పూర్తి అధికారులను ఆదేశించారు. 2023-24 సంవత్సరమునకు 3 కోట్లు మంజూరయ్యాయి. ప్రభుత్వ మార్గదర్శకాలు వచ్చిన వెంటనే ప్రతిపాదన సిద్ధం చేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో గ్రీన్ ఫండ్ కింద రూ. 62 లక్షల నిధులు మంజూరయ్యాయి. మెదక్ పట్టణం, కుల్చారం మండలంలో నవగ్రహ వనం, నక్షత్రవనం కార్యక్రమం అమలు చేయాలనే ఆలోచనతో ముందుకు పోతున్నామన్నారు. నవగ్రహ వనం అనగా 9 గ్రహాలకు సంబంధించి వివిధ చెట్లు నాటేందుకు ప్రణాళికలు రూపొందించాలని, 21 నక్షత్రాలకుగాను చెట్లు నాటి వాటి పేర్లు బోర్డులతో సహా ఏర్పాటు చేయాలని, వైకుంఠ రథాలు మంజూరు చేసేందుకు కూడా ఆలోచన చేస్తున్నామన్నారు.

వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలి : ఎస్ఐ

విశాలాంధ్ర కారేపల్లి: వాహనదారులు వాహనాన్ని నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొని వాహనాన్ని నియంత్రించుకునే విధంగా వాహనాన్ని నడిపి సురక్షితంగా ఇల్లు చేరుకోవాలని కారేపల్లి ఎస్ ఐ ఎన్ రాజారాం సూచించారు. శనివారం ఇటీవల కారేపల్లి ఇల్లందు ప్రధాన రహదారిలో జరిగిన రెండు వాహన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని రేడియం స్టిక్కరింగ్ కలిగిన స్టాపర్స్‌ను రోడ్డుపై అక్కడక్కడ ఉన్న మూల మలుపుల వద్ద ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ఈ రేడియం స్టాపర్స్‌ను తప్పకుండా గమనించి వాహనాన్ని నడిపి గమ్యస్థానం చేరుకోవాలన్నారు. వాహనానికి సంబం ధించిన అన్ని రకాల ధ్రువపత్రాలతో పాటు ఇన్సూరెన్స్ చెల్లుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ప్రయాణానికి బయలుదేరే ముందు తగు జాగ్రత్తలతో వాహనాన్ని పూర్తిస్థాయిలో కండిషన్లో ఉందా అని గమనించి ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానం చేరుకోవాలన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

విశాలాంధ్ర - చర్ల: మండల కేంద్రం చర్ల లో గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 60 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో ఆ సొసైటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చైర్మన్ జాకబ్ సేవలను అభినందించారు. వెనకబడిన ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆయన కోరారు. రానున్న నూతన సంవత్సరంలో పేద మహిళలు ,వృద్ధులు, వితంతువులు ,నూతన వస్త్రాలు ధరించి ఆనందంగా ఉండాలనే ఆకాంక్షతో దుస్తులను పంపిణీ చేస్తున్నట్టు ఆ సంస్థ చర్ల ఏరియా ప్రతినిధి పి. సోలోమన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారి లక్ష్మీనారాయణ ,రాజమ్మ, సీనియర్ జర్నలిస్టు దొడ్డ ప్రభుదాస్, ఏసుదాస్, డెవిల్ పాలరూతు, రిబుక,గాబ్రియల్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులు వినూత్న నిరసన

విశాలాంధ్ర ఖమ్మం : సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె 17వ రోజుకు చేరుకుంది. తమను రెగ్యులర్ చేస్తామంటూ ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలని తమకు కనీసం పే స్కేల్ ముందుగా అమలు జరపాలని డిమాండ్లతో సమగ్ర శిక్ష అభియాన్ పరిధిలోని ఉద్యోగులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. వారి డిమాండ్లను పరిష్కరించే విషయంలో ఇంకా రాష్ట్ర ప్రభుత్వం ఒక స్పష్టమైన హామీని ఇవ్వకపోవడంతో సమ్మెను కొనసాగిస్తున్నారు. శనివారం సమగ్ర శిక్ష ఉద్యోగులు మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి సంతాప సూచకంగా తెల్ల టోపీలు ధరించి మౌనం పాటిస్తూ వినూత్న రీతిలో తమ నిరసనను తెలియజేశారు. చాలీచాలని జీతాలతో ఈ సంఘం పరిధిలోని ఉద్యోగులు దాదాపు దశాబ్దాలుగా పనిచేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారని ,ఆయన తప్పనిసరిగా తమ డిమాండ్లను పరిష్కరిస్తారని విశ్వాసం వారిలో బలంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం నుంచి ఒక స్పష్టమైన హామీ రాకపోవడంతో సమ్మెను కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ ఉద్యోగుల సమ్మెకు అన్ని ఉపాధ్యాయ సంఘాల నుంచి మద్దతు లభిస్తోంది.ఈ అందోళనను ఒక ఉపాధ్యాయ సంఘం తమకు ఆపాదించుకునేలా వ్యవహరిస్తుందని ప్రచారం నేపథ్యంలో, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రెండు రోజుల క్రితం తమ సంఘం స్వతంత్రంగా ఈ ఉద్యమం చేస్తుందని ,ఈ ఉద్యమానికి అనేక ఉపాధ్యాయ సంఘాలు ప్రజా సంఘాలు విద్యార్థి యువజన సంఘాలు తమ సంపూర్ణ మద్దతునిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే ఒక ఉపాధ్యాయ సంఘం ఈ పోరాటం మొత్తానికి తామే వెనకుండి నడిపిస్తున్నామనే భావన కల్పించే ప్రయత్నం చేస్తుందనే ప్రచారంపై ఆ సంఘం నాయకులు స్పందిస్తూ అటువంటివి జరగనీయమని, ఇది తమ సొంత పోరాటం అని అందరూ మద్దతును కోరుకుంటున్నామని పేర్కొన్నారు. అలా ఏదైనా సంఘం క్రెడిట్ తాము పొందేందుకు ప్రయత్నాలు చేస్తే అది తమ పోరాటానికి విఘాతం కలిగిస్తుందని , అటువంటి పోకడలను తమ సంఘం తీవ్రంగా ఖండిస్తుందంటూ వారు ఒక వెబ్ ఛానల్‌లో ప్రచురితమైన కథనానికి స్పందిస్తూ ,సమాధానం ఇచ్చిన విషయం కూడా తెలిసిందే. మొన్నటి వరకు ఒకపక్క నిరవధిక సమ్మె జరుగుతున్నప్పటికీ తమ విద్యార్థులు రక్షణ కోసం రాత్రి డ్యూటీలు కూడా చేస్తూ వచ్చారు. కానీ ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటుండడంతో ఇకపై రాత్రి డ్యూటీలు కూడా మానివేసి పూర్తిస్థాయిలో ఉద్యమాన్ని బలంగా చేయాలని ఆ సంఘం నిర్ణయించినట్లు సమాచారం. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిపించి తమ న్యాయమైన డిమాండ్ అయిన పే స్కేల్ ను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వీరస్వామి, అదనపు ప్రధాన కార్యదర్శి అనిల్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిర్మల, కార్యదర్శి కృష్ణ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్ ,సాంబశివరావు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే కోరం

విశాలాంధ్ర - ఇల్లందు : దేశ మాజీ ప్రధాని, దివంగత మన్మోహన్ సింగ్ తన జీవితకాలంలో దేశానికి చేసిన సేవలు చిరస్థాయిగా మిగిలిపోతాయని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం ఇల్లందు పట్టణలోని కొత్త బస్టాండ్ వద్ద డాక్టర్ మన్మోహన్ సింగ్ సంతాప సభ 1,2,3, వార్డుల కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ల కమిటీల ఆధ్వర్యంలో జరిగింది. ఇల్లందు పార్టీ అధ్యక్షులు దొడ్డ డేనియల్ సమక్షంలో జరిగిన ఈ సంతాప సభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి దేశ జీడీపీని రెండింతలు చేసిన ఘనత మన్మోహన్ కే దక్కుతుం దన్నారు. ఇదే క్రమంలో అనేక ఆమోదయోగ్యమైన సంస్కరణలు చెప్పట్టి దానికి సమాంతరంగా పేద, దళిత గిరిజన, మైనారిటీ, రైతాంగానికి కూడా మేలు జరిగేలా అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిన గొప్ప మేధావి, దేశ ప్రేమికుడు, దార్శనికుడని మన్మోహన్ చేసిన భిన్నమైన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇల్లందు పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎండి జాఫర్, నాయకులు మడుగు సామమూర్తి, బోళ్ళ సూర్యం, చల్లా శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎదలపల్లి అనసూర్య, కౌన్సిలర్లు నాగేశ్వరావు, వార రవి, జే వెంకటేశ్వర్లు, వచ్చా వెంకన్న, జెట్టి కిషోర్, ఎస్కె. పాషా, మేకల శ్యామ్ మాదిగ, మహిళా అధ్యక్షురాలు గాలిపల్లి స్వరూప, చల్ల భారతి, వరలక్ష్మి, నిర్మల, అనిత తదితరులు పాల్గొన్నారు.

బియ్యంపై సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: సీఎంఆర్ బియ్యం డెలివేరి వేగం పెంచాలని అదనపు కలెక్టర్ నగేష్ రైస్ మిల్లర్స్‌ను ఆదేశించారు. శనివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సిఎంఆర్ బియ్యం డెలివేరి పురోగతిపై జిల్లాలని రైస్ మిల్లర్స్‌తో అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఉన్న మిల్లర్లు వానాకాలం 2023-24 బియ్యం డెలవరిని ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపల 100 శాతం పూర్తి చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. యాసంగి 2023-24 సీజన్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి 2,52,013 మెట్రిక్ టన్నుల ధాన్యం జిల్లాలోని 67 రైస్ మిల్లులకు కేటాయించగా 1,70,856 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి అందజేయాల్సి ఉందని తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు 99,339 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి మిల్లర్లు అందజేశారని, ఇప్పటికే 58 శాతం టార్గెట్ పూర్తి చేశారని, మిగిలిన 42 శాతం టార్గెట్ పూర్తి చేయటానికి 71,517 మెట్రిక్ టన్నుల బియ్యం గడువులోపల ప్రభుత్వానికి అందజేయాలని రైస్ మిల్లర్లకు ఆదేశించారు. ఇందుకు గాను ప్రభుత్వం 25 జనవరి, 2025 నాటికి 100 శాతం టార్గెట్ పూర్తి చేయాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశం లో రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు చంద్రపాల్, జిల్లా మేనేజర్ పౌర సరఫరాల హరికృష్ణ, డిఎస్ఓ సురేశ్ రెడ్డి, జిల్లా రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

బీమా మార్కెట్‌కు మరింత ఆదరణ పెరుగుతుంది

ముంబయి : భారతదేశ వినియోగదారులకు శాశ్వత విలువను అందించే రంగాల్లో బీమా రంగం ముందువరుసలో ఉందని ఎడిల్‌వైస్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈఓ సుమిత్ రాయ్ తెలిపారు. 2024లో గణనీయమైన పరిశ్రమ అభివృద్ధి, వినియోగదారుడి అవసరాలను నెరవేర్చుటకు స్థిరమైన నిబద్ధత అధారితమైన భారతీయ బీమా రంగం నిరంతరం పరివర్తన చెందుతోందని, ప్రపంచవ్యాప్త బీమా రంగం ఆకస్మిక మార్పులు ఎదుర్కొంటుండగా, భారతదేశంలో ఈ రంగం స్థితిస్థాపకంగా నిలిచింది. గుర్తించదగిన డైనమిజం చూపిందన్నారు. ఇది ప్రపంచములోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నవాటిల్లో ఒకటి. దేశపు బీమా మార్కెట్ రాబోయే దశాబ్దంలో, కొత్త అవకాశాలను ఆవిష్కరిస్తూ, దేశీయ బీమా మార్కెట్ తన ప్రస్తుత పరిమాణం కంటే 3-5 రెట్లు పెరుగుతుందని తెలిపారు. ఈ అభివృద్ధి ప్రగతిశీల నియంత్రణ పాలసీలు, పరిశ్రమ సమకాలీనికుల మధ్య సహకారం, పంపిణీ, సాంకేతిక సామర్థ్యాలను మెరుగుపరచడంపై దృఢమైన ప్రాధాన్యతల ఆధారితమై ఉంటుందన్నారు. ప్రగతిశీల సంస్కరణలు, డిజిటల్ పరివర్తనకు నిబద్ధతలు భారతదేశం తన ప్రాంతీయ భాగస్వామ్య గ్రూపులను అధిగమించిందన్నారు. ఈ ఆర్థిక బలము బీమా రంగానికి ఒక ఫలవంతమైన పునాదిని వేసిందని అభిప్రాయపడ్డారు.

ఓసి క్లబ్ కాదు.. ముమ్మాటికి ప్రభుత్వ క్లబ్..

సీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారధిరెడ్డి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబుబాబాద్: జిల్లా కేంద్రంలో ఉన్న ఓసి క్లబ్ ముమ్మాటికి ప్రభుత్వ క్లబ్బేనని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారధిరెడ్డి అన్నారు. శనివారం సీపీఐ నేతలు కార్యకర్తలతో కలిసి మహబూబాబాద్ ప్రభుత్వ క్లబ్ ప్రభుత్వ స్వాధీనంకై తెల్ల జెండాలు పాతి నిరసన చేశారు. ఈ సందర్భంగా రూ.50 కోట్ల విలువ చేసే రెండు ఎకరాల భూమి ప్రభుత్వ క్లబ్ అని ఆధారాలతో సహా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం , స్థానిక ఎమ్మెల్యే -ఎంపీలు చొరవ చూపి ప్రభుత్వ క్లబ్బుగా మార్చాలని అన్నారు. అక్టోబర్ 27 1930 రోజున శంకుస్థాపన ఫౌండేషన్ చేసినారన్నారు. మేజర్ గ్రామపంచాయతీగా మానుకోట తాలూకా కేంద్రంగా ఉన్న సమయంలో అప్పుడున్న రాజకీయ పరిస్థితులు పూర్వ రంగంలో నాటి రాజకీయ ఆర్థిక పలుకుబడి కలిగిన కొందరు మహబూబాద్ క్లబ్‌ను ఆఫీసర్ ఓసి క్లబ్‌గా చలామానంలోకి తీసుకొచ్చారన్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్ వాకిట కరుణ, శివలింగయ్య కలెక్టర్‌గా ఉన్న సందర్భంలో ఆధారాలతో కూడిన వినతి పత్రాలు, సమాచార హక్కు చట్టం నుండి సేకరించిన సాక్షాధారాలతో సమర్పించిన ఎక్కడ ఏసిన గొంగళి అక్కడే ఉండిపోయిందన్నారు. రోడ్డు వెడల్పులో భాగంగా అక్కడ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారు కూడా నష్టపోయారని వారికి మున్సిపల్ వారే వేరే చోట వ్యాపారాలు చేసుకునే వెలుసు పాటు కల్పించాలని డిమాండ్ చేశారు. మహబూబాద్ నడిబొడ్డున ఉన్న సుమారు రెండు ఎకరాల విశాలమైన సుమారు 50 కోట్ల రూపాయలు విలువచేసే ఈ స్థలాన్ని కొన్ని శక్తులు హస్తగతం చేసుకునే చర్యలు పూనుకున్నాయని, వీరికి అండగా నాటి ముగ్గురు కీలక టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ముఖ్య ప్రజా ప్రతినిధులు, మున్సిపాలిటీ బిఆర్ఎస్ పాలకపక్ష ప్రధాన ప్రతినిధులు ఇద్దరూ కను సన్నల్లో చాప క్రింద నీరులా లోపల యంత్రాంగం నడిపి భారీ స్కెచ్ వీసారన్నారు. పోరాటాలు చేయడం ద్వారా అనంతరం వారు తప్పుకున్నారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ జీవో నెంబర్ 34 ప్రకటించిన 50 కోట్ల అభివృద్ధి పనిలో భాగంగా ఈ క్లబ్ స్థలాన్ని ఎంపిక చేయకుండా ప్రస్తుత మహబూబాద్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని కళాక్షేత్ర నిర్మాణానికి ఎంపిక చేసే టెండర్లు పిలిచినారు అన్నారు. ఆ నిధులు రాలేదన్నారు. ప్రభుత్వానికి క్లబ్ స్వాధీనం అయ్యేంతవరకు పోరాటం ఆగదని బి అజయ్ సారధి రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ల సాంబలక్ష్మి వీరవెల్లి రవి, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్ ,ఎండి ఫాతిమా, కేదాసు రమేష్, మేక వీరన్న ,ఎండి మహమూద్, వంకాయలపాటి చిరంజీవి, మాలోతు రవీందర్ ,తోట రాజకుమారి, ఎర్రోజు పద్మ ,పురం భాగ్యమ్మ ,మంద శంకర్ ,తండా శ్రీనాథ్, నక్క నాగార్జున, మిరియాల మల్లికార్జున్ ,తోట రమేష్, బల్లెం శ్రీకాంత్, మెతుకు కుమార్, కొండమీది రవి, హర్షవర్ధన్ ,వికాస్, ముదుసు రాణి ,కొండమీది రవి దొనికిని రమేష్ ,నటరాజు, జానీ ,బోల్ల భద్రయ్య, గార రవిచంద్రబోస్ ,తండ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

వేడెక్కిన ఢిల్లీ రాజకీయం

ఢిల్లీ శాసనసభ గడువు 2025 ఫిబ్రవరి 15న ముగియనుంది. అంటే ఆ లోగా శాసనసభ ఎన్నికలు జరగాలి. పదిహేనేళ్లపాటు ఢిల్లీ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కాంగ్రెస్ నాయకురాలు షీలా దీక్షిత్‌ను ఓడించి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి అయ్యారు. ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో ఆయన వరసగా అనూహ్యమైన విజయం సాధిస్తున్నారు. కానీ పదేళ్లకు పైగా ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నందువల్ల సహజంగానే ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఈ అసంతృప్తి ఆసరాగా ఢిల్లీ ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. దేశంలో చాలా భాగంలో మోదీ గాలి వీస్తున్నా ఢిల్లీలో మాత్రం ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో కొనసాగడం బీజేపీకి సుతరామూ ఇష్టంలేదు. అలాగని కేజ్రీవాల్‌ను ఓడించడం బీజేపీకి సునాయాసమైన అంశం ఏమీ కాదు. కాంగ్రెస్‌ది అదే పరిస్థితి. ఇటీవలి కాలంలో తమ పార్టీని బలోపేతం చేయడానికి కాంగ్రెస్ న్యాయయాత్ర చేపట్టింది. 2024 సార్వత్రిక ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకుని పోటీచేశాయి. అయితే ఢిల్లీలోని మొత్తం ఏడు స్థానాలూ బీజేపీ వశమైనాయి. దీన్నిబట్టి శాసనసభ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపిస్తున్న ప్రజలు లోకసభ ఎన్నికల దగ్గరకు వచ్చేటప్పటికి ఆ పార్టీని గెలిపించడం లేదు. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ కలిసి పోటీ చేసినా లోకసభ ఎన్నికలలో ఫలితం కనిపించలేదు. లోకసభ ఎన్నికలలో కాంగ్రెస్ ఓట్లు ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థులకు బదిలీ అయినా ఆమ్ ఆద్మీ ఓట్లు కాంగ్రెస్‌కు బదిలీ కాలేదంటున్నారు. ఢిల్లీలో తమకు తిరుగులేని బలం ఉందని భావిస్తున్న కేజ్రీవాల్ శాసనసభ ఎన్నికలలో ఒంటరిగానే పోటీ చేస్తామంటున్నారు. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీకి ప్రధాన శత్రువు బీజేపీనే. కానీ రెండు పార్టీలు విడివిడిగా పోటీ చేయడంవల్ల బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోయే అవకాశం మెండుగా ఉంది. ఈ ప్రమాదాన్ని రెండు పార్టీలూ గుర్తిస్తున్నట్టు లేదు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతిపక్ష "ఇండియా" ఐక్య సంఘటనలో భాగమైనప్పటికీ అంటీ ముట్టనట్టే ఉంటోంది. ఇది "ఇండియా" ఐక్య సంఘటనను బలహీనం చేయడానికే ఉపకరిస్తుంది. ఢిల్లీ శాసనసభ ఎన్నికల దగ్గరకొచ్చేసరికి ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత తమకు అపారమైన బలంఉందని నమ్ముతున్నారు కానీ ప్రతిపక్షాల ఓట్లు చీలడంవల్ల అంతిమంగా బీజేపీ లాభపడ్తుందని గ్రహించడం లేదు. దఫ దఫాలుగా ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ ఢిల్లీ శాసనసభకు పోటీచేసే అభ్యర్థుల పేర్లు ప్రకటించాయి. ఢిల్లీలో మీరిన కాలుష్యానికి, ద్రవ్యోల్బణానికి, నిరుద్యోగానికి, అవినీతికి, చెత్త కుప్పలు పేరుకు పోవడానికి ఆమ్ ఆద్మీ పార్టీనే కారణం అంటోంది. ఆమ్ ఆద్మీ పార్టీకి ఎంత బలం ఉందనుకున్నా గత అయిదేళ్ల కాలంలో ఆ పార్టీ అనేకానేక వివాదాల్లో చిక్కుకుంది. కేజ్రీవాల్‌తో సహా సత్యేంద్ర జైన్, మనీశ్ సిసోడియా అరెస్టు కావడం ఆ పార్టీ మీద నీలినీడలు వ్యాపించాయి. ముఖ్యమంత్రి పదవిలో ఉండగా అరెస్టయిన మొదటి వ్యక్తి అరవింద్ కేజ్రీవాల్ మాత్రమే. ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వానికి, లెఫ్టినెంట్ గవర్నర్ కు ఎన్నడూ పొసగలేదు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న అరవింద్ కేజ్రీవాల్ కు అడుగడుగునా ఆటంకాలు కలిగించడానికి బీజేపీ చేయని ప్రయత్నంలేదు. ఢిల్లీ ప్రభుత్వాన్ని దాని మానాన దాన్ని పనిచేయనివ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించినా మోదీ ప్రభుత్వం ఏకంగా చట్టాన్నే మార్చేసి కేజ్రీవాల్ కు పక్కలో బల్లెంలా తయారైంది. ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి వచ్చిన తరవాత విద్యా విధానం మెరుగు పడింది. బస్తీ దవాఖానాలు ఉపయుక్తంగా తయారయ్యాయి. చాలా మందికి ఉచితంగా మంచి నీళ్లు, విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. రాజకీయ పార్టీలు ఉచితాలను ఈసడిస్తున్నట్టు కనిపించినా పరిపాలన దగ్గరకొచ్చేటప్పటికి తాయిలాల మీదే ఆధారపడతారు. రేవడి (తాయిలాల) సంస్కృతిని ఎద్దేవా చేసే మోదీ కూడా ఉచితాలనే ఆశ్రయిస్తారు.

ఢిల్లీ జన జీవితాన్ని కేజ్రీవాల్ కొంతలో కొంత మెరుగు పరచి ఉండొచ్చు. కానీ ఉచితాలకు అలవాటు పడ్డ జనం ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఏ పార్టీ ఎక్కువ ఉచితాలను ప్రకటిస్తుందోనని ఎదురు చూస్తారు. ఉచితాలు ఊరట కల్గించవచ్చు కానీ ఉపాధి కల్పనకు ఉపకరించవు. తాత్కాలిక ఉపశమన చర్యలు ఏ సమస్యనూ శాశ్వతంగా పరిష్కరించలేదు. ఢిల్లీ పరిసర ప్రాంతాలలో ఉన్న గూర్గావ్, నోయిడా అభివృద్ధి చెందుతున్నంత వేగంగా ఢిల్లీ అభివృద్ధి చెందడం లేదన్న అభిప్రాయం జనంలో బలంగానే ఉంది. మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ఇతర నాయకులలాగే కేజ్రీవాల్ సైతం పెద్దగా చేసిందేమీ లేదు. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ ప్రజలు షీలా దీక్షిత్ అధికారంలో ఉన్న రోజులను గుర్తు చేసుకుంటున్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఎటూ కేంద్ర ప్రభుత్వ చేతిలోని మనిషే కనక ఆయనను ఉపయోగించుకుని మోదీ ప్రభుత్వం ఢిల్లీ శాసనసభలో పాగా వేయాలని చూస్తోంది. తాజాగా ఆమ్ ఆద్మీ పార్టీ చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలపై విచారణ చేయాలని ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, పోలీసు కమిషనర్ ను ఆదేశించారు. ఈ సంక్షేమ పథకాలకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకుడు సందీప్ దీక్షిత్ చేసిన ఫిర్యాదు ఆధారంగా లెఫ్టినెంట్ గవర్నర్ దర్యాప్తుకు ఆదేశించారు. బీజేపీ కూడా ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలపై ఫిర్యాదులు చేస్తూనే ఉంది. ఈ పథకాల విషయంలో కాంగ్రెస్, బీజేపీ ఒకే బాటలో పయనించడం విచిత్రమే. ఆం ఆద్మీ పార్టీ ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ యోజన కింద లబ్ధిదారులను ఎంపిక చేయడానికి సమాచారం సేకరించడంలో వారి వ్యక్తిగత వివరాలు కూడా సేకరిస్తున్నారని కాంగ్రెస్, బీజేపీ కూడా ఆరోపిస్తున్నాయి. ఆం ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్న పంజాబ్ నుంచి ఢిల్లీకి నగదు తరలిస్తున్నారన్న అభియోగమూ ఉంది. తాము మళ్లీ అధికారంలోకి వస్తే మహిళా సమ్మాన్ యోజన కింద అర్హులైన మహిళలకు నెలకు రూ. 2,100 ఇస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రకటించింది. ఇది సహజంగానే మహిళా ఓటర్లు ఆమ్ ఆద్మీ పార్టీకి అనుకూలంగా ఓటు వేయడానికి ఉపకరిస్తుంది. కాంగ్రెస్, బీజేపీ భయం కూడా అదే. కేజ్రీవాల్ రాజకీయాలు ఏమైనా కావచ్చు. ఇటీవల మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో లాడ్లీ బెహనా యోజన ఇలాంటి పథకమే. మరి దాని మీద దర్యాప్తు ఎందుకు జరిపించలేదో! ఇతర పార్టీలు అధికారంలోకి వస్తే మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన, ఉచిత విద్యుత్, ఉచిత విద్య లాంటివి ఆపేస్తారని కేజ్రీవాల్ అంటున్నారు. ఏమైనా ఢిల్లీలో ఎన్నికల రాజకీయం వేడెక్కింది.

టీయు చరిత్రలో కీలక మలుపు

సుకుమార్ దామ్లే

ఏఐటీయూసీ చరిత్రలో కీలకమలుపు చోటుచేసుకుంది. చెన్నయ్‌లో 2024 డిసెంబరు 19 నుంచి 21 వ తేదీవరకు జరిగిన న్యూ ట్రేడ్‌యూనియన్ ఇనీషియేటివ్ (ఎన్‌టీయూఐ) ఏఐటీయూసీ అనుబంధ యూనియన్‌గా పనిచేయాలని నిర్ణయించింది. ఎన్‌టీయూఐ 5వ జనరల్ అసెంబ్లీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ సమక్షంలోనే నిర్ణయాన్ని ప్రకటించారు. ఎన్‌టీయూఐ నిర్ణయాన్ని అమర్‌జిత్ కౌర్ ఆహ్వానించారు. ఎన్‌టీయూఐ మహాసభకు ఏఐటీయూసిని ఆహ్వానించారు. 2024 డిసెంబరు 22న ఏఐటీయూసి అనుబంధంగా ఉండేందుకు నిర్ణయాన్ని ప్రకటించారు. సభ చివరిగా అమర్‌జిత్ కౌర్ మాట్లాడుతూ, ఏఐటీయూసి రాజకీయాలు ఏనాడు సీపీఐ రాజకీయాలతో గందరగోళంగా లేవన్నారు. రాజకీయాలను అనుసరించలేదని, కార్మికవర్గం మార్గదర్శంగా ఉందని అన్నారు. స్వాతంత్ర్యానికి ముందునాటి రోజుల్లో బ్రిటిష్‌పాలన నుంచి (1921 ఏఐటీయూసీ ఝరియా మహాసభ) సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని డిమాండ్ చేస్తూ తీర్మానించింది.

ఆనాడు ప్రధాన రాజకీయపార్టీ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సీ) సంపూర్ణ స్వాతంత్ర్యంకోసం ఏఐటీయూసీ డిమాండ్ చేసిన అనంతరమే 1929లో కాంగ్రెస్ సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరింది. ఏఐటీయూసీ 1920లో స్థాపించారు. అంతకుముందే కార్మికవర్గం ముంబైలో ఆరురోజులపాటు పనిని నిలిపివేసింది. లోకమాన్య తిలక్ 1908లో ఆరు సంవత్సరాలపాటు నిర్బంధించినందుకుగాను ఆరు రోజుల సమ్మె చేశారు. 1928లో వీధుల్లో తిరుగుతూ 'సైమన్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. 1946లో నావికా తిరుగుబాటు జరిగింది. దేశ స్వాతంత్ర్యం అనంతరం రాజ్యాంగాన్ని రూపొందించాలని ఇందుకు రాజ్యాంగ అసెంబ్లీని ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ కోరింది. అనంతరం బ్యాంకులు, గనులు, బీమా కంపెనీలు, గనులు తదితరాలను జాతీయకరణ చేయాలని ఏఐటీయూసి కోరింది.

స్వాతంత్ర్యం అనంతరం ట్రేడ్‌యూనియన్ చీలిపోయింది. ట్రేడ్ యూనియన్ చరిత్రలో ఇది అత్యంత విచారకరం. ఏఐటీయూసీ నుంచి చీలిపోయిన తర్వాత ఐఎన్‌టీయూసీ ఏర్పడింది. అనేక రాజకీయపార్టీలు ఏర్పడ్డాయి. కొత్త యూనియన్‌ల స్థాపన జరిగింది. యూనియన్ సభ్యుల సంఖ్య తగ్గిపోయింది. 1947లో మొదటిసారి ఇండియాలో ట్రేడ్‌యూనియన్ ఉద్యమం చీలిపోయిన తర్వాత ఇది సరైందికాదని ఆనాడు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎస్ఎమ్ జోషి హెచ్చరించారు. ఏఐటీయూసీ నుంచి విడిపోయిన తర్వాత ఐఎన్‌టీయూసీ నేడు విచారం చెందుతోంది. 2006లో ముంబైలో ఎన్‌టీయూఐ ఏర్పడింది. కొన్ని స్వతంత్ర యూనియన్‌లు కలిపి ఎన్‌టీయూఐ ఏర్పాటైంది. తిరిగి ఏఐయూటీసీతో కలవాలని భావించింది. నాలుగు లేబర్‌కోడ్‌లను మోదీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన తర్వాత అత్యంత జాగ్రత్తగానే ఏఐటీయూసికి అనుబంధంగా ఉండాలని ఎన్‌టీయూఐ నిర్ణయించింది. ఈ యూనియన్ మహాసభకు 220 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఏఐటీయూసీతో అనుబంధంగా ఉండాలా లేదా అనే అంశంపై ముమ్మరంగా చర్చించారు. సీపీఐ నియంత్రణలో ఏఐటీయూసీ ఉందని అందువల్ల ఏం చేయాలనేది చర్చించారు. ఈ విషయమై ఓటింగ్ ప్రతిపాదన వచ్చింది. 78శాతం మంది సానుకూలంగా ఓటు చేశారు. దీనితో ఏఐటీయూసీ అనుబంధంగా ఉండేందుకు అంగీకరించారు. కార్మికవర్గం, రాజకీయ పార్టీలకు దూరంగాఉండి స్వతంత్రంగా పనిచేయాలని ట్రేడ్‌యూనియన్‌లు భావిస్తున్నాయి. అయితే పోరాటాల సమయంలో ఆయా రాజకీయ పార్టీలు తోడ్పాటు అందించవచ్చు. ఏఐటీయూసీ అనుబంధంగా ఉండాలని నిర్ణయించిన తర్వాత ట్రేడ్‌యూనియన్ ఐక్యత జిందాబాద్, కార్మికుల ఐక్యత జిందాబాద్ అంటూ ప్రతినిధులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎన్‌టీయూఐని అనుబంధంగా చేర్చుకోవాలని ఆయా రాష్ట్రాలను ఏఐటీయూసి కోరింది. ఏఐటీయూసీ ప్రధాన కార్యాలయాన్నీ ఇకపై ఎన్‌టీయూఐ కూడా వినియోగించుకుంటుంది.

ప్రమాదకరమైన ఫాసిస్టు శక్తులు

స్వేచ్ఛ, న్యాయం, లింగ సమానత్వంకోసం దేశవ్యాప్తంగా మహిళలు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు) 22వ జాతీయ సమావేశంలో పిలుపునిచ్చారు. డిసెంబరు 6,7,8 తేదీలలో ఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో దేశంలో మహిళలు ఎదుర్కొంటున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలపై ఉద్యమానికి వ్యూహాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు జాతీయ అధ్యక్షురాలు అరుణా రాయ్ మాట్లాడుతూ, బాబ్రీ మసీదు ధ్వంసమైన డిసెంబరు 6 మరచిపోలేమని, మతతత్వ రాజకీయాలు దేశంలో పాలనసాగిస్తున్నాయన్నారు. మహిళలపై దాడులు పెరిగిపోయి, ప్రజల హక్కులకు భంగం కలిగిస్తున్నాయన్నారు. మానవ హక్కులకోసం పోరాడుతున్న వారిని జైలుకు పంపుతున్న తరుణంలో ఈ సదస్సు జరుగుతోందని రాయ్ పేర్కొన్నారు. సుదీర్ఘ పోరాటాల అనంతరం మహిళా రిజర్వేషన్ బిల్లు చివరకు ఆమోదించినప్పటికీ జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన సాకుగా చూపుతూ అమలు చేయడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. 2024 లోక్‌సభలో మహిళా సభ్యుల సంఖ్య 13.6 శాతం మాత్రమేనని, ఇది గత లోక్‌సభ కంటే కూడా తక్కువగా ఉందని పేర్కొన్నారు. మహిళలు ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పాటుపడాల్సిన ఆవశ్యకతను రాయ్ నొక్కి చెప్పారు. దేశంలో నెలకొన్న ఉమ్మడి సంస్కృతి, పౌరుల హక్కులపై బీజేపీ ప్రభుత్వ దాడులను ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు నూతన అధ్యక్షురాలు సయ్యదా హమీద్ ఖండించారు. భారతదేశ చరిత్రను తుడిచిపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అసత్యాల ఆధారంగా విద్వేష రాజకీయాలు సాగుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. మహిళలు కృతనిశ్చయంతో సమయ స్ఫూర్తిగా స్పందించాలని సూచించారు. దేశంలో నెలకొన్న "హింస, విద్వేష రాజకీయాలపై" సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజల హక్కులపై బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దాడులు, కుల, మతాల వారీగా దేశాన్ని విభజించే వ్యూహం వంటి ఎత్తుగడలకు వ్యతిరేకంగా మహిళలు ఏకం కావాలని ఆమె పేర్కొన్నారు.

ఢిల్లీలో మూడు రోజులపాటు జరిగిన ఈ సదస్సుకు హెచ్‌ఎస్ఎస్ భవన్ వేదికైంది. ఈ సదస్సుకు వివిధ మహిళా సంఘాలు, మానవ హక్కుల సంఘాలు, ట్రాన్స్ జెండర్ల సంఘాలు, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు అనేది మహిళల హక్కుల కోసం భారతదేశ స్వాతంత్ర్యం తర్వాత ఏర్పాటైన మొదటి మహిళా సంస్థ. జూన్ 4, 1954న స్థాపించిన ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు మహిళల సమస్యలపై దృష్టి సారించి

ఉద్యమాల నిర్వహణలో కీలకపాత్ర పోషించింది. ఈ ఉద్యమంలో ప్రముఖ నాయకులు అరుణా అసఫ్‌అలీ, తారారెడ్డి, రేణు చక్రవర్తి, హజ్రా బేగం వంటి స్వాతంత్ర్య సమరయోధులు, సామాజిక కార్యకర్తలు ఉన్నారు. సంస్థకు మాజీ అధ్యక్షురాలిగా పనిచేసిన రేణు చక్రవర్తి, 1961లో వరకట్నానికి వ్యతిరేకంగా చట్టం కోసం చేపట్టిన పోరాటంలో కీలక పాత్ర పోషించారు. గీతా ముఖర్జీ 33 శాతం మహిళల రిజర్వేషన్ కోసం శాసనసభ లోపల, వెలుపల సుదీర్ఘ పోరాటం చేశారు. జాతీయ మహిళా సమాఖ్య నూతన జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గా ప్రణాళికా సంఘం మాజీ సభ్యురాలు, సామాజిక కార్యకర్త సయ్యదా హమీద్, నిషా సిద్ధూ ఎన్నికయ్యారు. పూర్వపు అధ్యక్షురాలు అరుణా రాయ్, మాజీ జాతీయ కార్యదర్శి అన్నీ రాజా ఈ కొత్త నియామకాలను హర్షాతిరేకాల మధ్య ప్రకటించారు. 125 మంది సభ్యులతో కూడిన జాతీయ కౌన్సిల్, 45 మంది సభ్యులతో కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. 400 మంది ప్రతినిధులలో మూడింట ఒక వంతు యువతులు కావడంతో, మరింత మంది యువతకు నాయకత్వంలో స్థానం కల్పించాలని సమావేశం సూచించింది. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాల నుంచి మహిళా ప్రతినిధులు హాజరయ్యారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) జాతీయ కార్యదర్శి అమర్జీత్ కౌర్ మాట్లాడుతూ, మహిళల హక్కులపై దాడులు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి, మానవహక్కుల కోసం ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు నిరంతర పోరాటం సాగించిందన్నారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు జాతీయ కార్యదర్శి అనీరాజా మాట్లాడుతూ, "మహిళల స్వేచ్ఛ, లింగ సమానత్వం నీరు, అడవులు, భూమిపై హక్కుల కోసం పోరాటంలో మహిళా సమాఖ్య ముందంజలో ఉందన్నారు. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం కోసం పోరాడే గొప్ప సంప్రదాయం మనదిగా పేర్కొన్నారు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం మహిళా ఉద్యమాలను నిర్వీర్యం చేయడం

సరికాదన్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా మహిళా ఉద్యమాల్ని మరింత ఉధృతం చేయాలని సూచించారు. కులం, మతం పేరుతో మహిళలపై దాడులు పెరిగిపోయాయని సంస్థ కొత్త కార్యదర్శి నిషా సిద్ధూ అన్నారు. మణిపూర్‌తో సహా వివిధ ప్రాంతాల్లో మహిళలు హింసకు గురవుతున్నారని ఆమె నిరసన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వాన్ని సవాలు చేసేందుకు మహిళల ఐక్యత తప్పనిసరని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ట్రాన్స్‌జెండర్ కార్యకర్త నూర్ షెకావత్, శ్వేత, అభిరామి, ధావలే, డాక్టర్ వందనా ప్రసాద్, కవితా శ్రీవాస్తవ, ప్రొఫెసర్ దీపా సిన్హా, అంజలి భరద్వాజ్, త్రిశ్యా జారితో పాటు నేపాల్,రష్యా నుంచి వచ్చిన ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు జాతీయ కార్యదర్శి అనీరాజా నివేదికను సమర్పించారు. సీనియర్ సభ్యురాలు రంజనా రే జెండాను ఎగురవేశారు. సదస్సుకు హాజరైన సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా ప్రసంగిస్తూ.. "ప్రస్తుతం దేశంలో నెలకొన్న ఫాసిస్టు శక్తులను ఓడించేందుకు మహిళలే ఏకైక ఆశాకిరణంగా పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో మహిళలు, ముఖ్యంగా మానవ హక్కుల కార్యకర్తలు దాడులకు గురవుతున్నారని పేర్కొన్నారు. మోదీ ఫాసిస్టు పాలన సామాన్య ప్రజల హక్కులకు భంగం కలిగిస్తోందన్నారు. ప్రస్తుతం మన దేశంలో ఎన్నికలు, ఈవీఎమ్‌ల చుట్టూ చర్చలు తిరుగుతున్నాయి, అయితే ఈడీ, ఎన్నికల కమిషన్ వంటి స్వయంప్రతిపత్తి సంస్థలు దుర్వినియోగం అవుతున్నాయి. ఈ సమస్యలపై మహిళా సంఘాలు దేశవ్యాప్త ఉద్యమం చేపట్టాలని ఆకాంక్షించారు. అఖిల భారత కిసాన్ సభ (ఏఐకెఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకయ్య మాట్లాడుతూ,మన దేశంలో ఎక్కువశాతం మహిళలు వ్యవసాయరంగంలో ఉన్నారని, అయితే వారికి పనికి తగిన వేతనం అందడం లేదు. వీరికి అప్పుల భారం ఎక్కువై వారి పేరు మీద భూమి రిజిస్టరు కావడం లేదు. ఈ ప్రభుత్వం రైతులకు అండగా లేదు. ఈ ప్రభుత్వం గతంలో మూడు వివాదాస్పద చట్టాల అమలుకు ప్రయత్నించగా రైతుల సుదీర్ఘ పోరాటం అనంతరం ఉపసంహరించారని అన్నారు. ఇప్పటికీ రైతులు రోడ్లపై బైఠాయించి నిరసన తెలుపుతున్నారు. సమావేశం చివరి రోజున మాజీ అధ్యక్షురాలు అరుణా రాయ్ మాట్లాడుతూ, "భవిష్యత్తులో మేము మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కొంటాం. దళితులు, మైనారిటీలు, పేదలు, వివిధ వర్గాల మహిళల సమస్యల కోసం మనం మరిన్ని పోరాటాలు చేయవలసిఉంది. బీజేపీ ప్రభుత్వ హయాంలో మన రాజ్యాంగ హక్కులు గణనీయమైన ప్రమాదంలో ఉన్నాయన్నారు. ఏఐవైఎఫ్ జాతీయ ఉపాధ్యక్షురాలు అమృత, ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విరాజ్, వాయనాడ్‌కు చెందిన సీజా బేబీ ఈ సదస్సుకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. సైబర్ క్రైమ్ బాధితురాలు అయిన ఐనా సదస్సుకు హాజరయ్యారు. మహిళల ఆరోగ్యం, ఉపాధి, లింగ వివక్ష, నీరు, అడవులు, భూమికి సంబంధించిన సమస్యలు విస్మరిస్తున్నారని సదస్సులో వక్తలు ఉద్ఘాటించారు. మహిళలకు న్యాయమైన వేతనాలు, ఆరోగ్యకరమైన పని వాతావరణం లభించడం లేదని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. మాతృత్వాన్ని అనుభవించే గణనీయమైన సంఖ్యలో మహిళలు శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, దళితులు జనాభాలో గణనీయమైన సంఖ్యలో ఉన్నప్పటికీ దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారని పేర్కొన్నారు.

> **మహిళా రిజర్వేషన్ బిల్లు చివరకు ఆమోదించినప్పటికీ జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన సాకుగా చూపుతూ అమలు చేయడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. 2024 లోక్‌సభలో మహిళా సభ్యుల సంఖ్య 13.6 శాతం మాత్రమేనని, ఇది గత లోక్‌సభ కంటే కూడా తక్కువగా ఉంది.**

అపరాజిత "యువత సమస్యలు, డిమాండ్లు, అంచనాలు" అనే అంశంపై ఒక పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మతతత్వం, లవ్ జిహాద్, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ, రైతుల ఉద్యమం, ఉపాధి వంటి ముఖ్యమైన అంశాలకు సంబంధించి వివిధ ప్రతిపాదనలు చేశారు. కన్వాల్‌జిత్ ధిల్లాన్ ఈ సమావేశంలో వివరణాత్మకంగా నివేదికను సమర్పించగా, అరుణా సిన్హా తమిళనాడుకు చెందిన తన సహోద్యోగి రేణుకా థామస్‌తో కలిసి ఆడిట్ నివేదికను సిద్ధం చేశారు. ఈ సదస్సు మహిళా ఉద్యమంకోసం అనేక కొత్త వ్యూహాలను రూపొందించింది. భవిష్యత్తులో మహిళలు తమ పోరాటాలలో ఐక్యంగా ఉండాలని ఉద్ఘాటించారు. మనం శాంతి కోసం పోరాడాలి, ద్వేషానికి వ్యతిరేకంగా నిలబడాలి, పితృస్వామ్యానికి, ఫాసిజానికి వ్యతిరేకంగా నిలబడాలి, మహిళల భద్రత కోసం నడుకంట్టాలి, లింగ సమానత్వాన్ని కొనసాగించాలి, మహిళల రాజకీయ, ఆర్థిక, సామాజిక సాధికారత కోసం కృషి చేయాలని 22వ ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు పిలుపునిచ్చింది.

– ఎడిట్ పేజీ డెస్క్

విప్లవ కార్యాచరణ కుట్ర అయిన వేళ

ఆర్వీ రామారావ్

దేశంలో కమ్యూనిస్టు భావజాలం త్వరితంగా విస్తరిస్తున్న సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం గజగజలాడి పోయింది. 1908 నుంచి 1933 మధ్య అనేక కుట్ర కేసులు మోపింది. నిజానికి ఈ కుట్ర కేసులు ఇరవయ్యవ శతాబ్ద ఆరంభం నుంచే కనిపిస్తాయి. 1908లో ముజఫ్ఫర్ పూర్ కుట్ర కేసు, 1912లో ఢిల్లీ కుట్ర కేసు, 1922 లో పెషావర్ కుట్ర కేసు, 1924 లో కాన్పూర్ బోల్షెవిక్ కుట్ర కేసు, 1925లో కకోరీ కుట్ర కేసు మోపారు. కమ్యూనిస్టులని అణగదొక్కడానికి వీటిలో ఎక్కువ కుట్ర కేసులు మోపినా ఇవి విచారణా క్రమంలో మార్క్సిస్టు భావజాలాన్ని ప్రచారం చేయడానికి ఉపయోగ పడ్డాయి. కోర్టు గదుల్లోనే నిందితులు మార్క్సిస్టు భావజాలాన్ని ప్రచారం చేశారు. ఈ విచారణ దేశవాసుల్లో అమితాసక్తి కలిగించింది.

ముజఫ్ఫర్ పూర్ కుట్ర కేసు(1908)

ముజఫ్ఫర్ పూర్ చీఫ్ ప్రెసిడెన్సీ మేజిస్ట్రేట్ డి.హెచ్. కింగ్స్ ఫోర్డ్ ను హత్య చేయడానికి ఖుదీరాం బోస్, ప్రఫుల్ల చంద్ర చకి ప్రయత్నించడాన్నే ముజఫ్ఫర్ పూర్ కుట్ర కేసు అంటారు. కింగ్స్ ఫోర్డ్ వాహనంపై వీరు బాంబులు విసిరారు. కానీ ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. కానీ ఈ దాడిలో ఇద్దరు బ్రిటిష్ మహిళలు మరణించారు. ఖుదీరాం బోస్‌ను అరెస్టు చేశారు. ప్రఫుల్ల చకీ ని అరెస్టు చేస్తారనగా ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. ఖుదీరాం బోస్‌ను ఉరితీశారు. అప్పటికి బ్రిటిష్ ప్రభుత్వం ఉరితీసిన వారిలో ఖుదీరాం బోస్ అందరికన్నా

మీరట్ జైలుకు వెలుపల కుట్రకేసు నిందితులు 25 మంది ఉన్న చిత్రం. వెనక వరస (ఎడమ నుంచి కుడికి): కె.ఎన్.సెహగల్, సోహాన్ సింగ్ జోష్, హెచ్.ఎల్. హచిన్సన్, షౌకత్ ఉస్మానీ, బి.ఎఫ్.బ్రాడ్లీ, ఎ. ప్రసాద్, పి.శ్రుట్, జి. అధికారి. మధ్య వరస: ఆర్.ఆర్. మిత్ర, గొపెన్ చక్రవర్తి, కిశోరీలాల్ ఘోష్, ఎల్.ఆర్. కదం, డా. రేంగ్డే, గౌర శంకర్, ఎస్. బెనర్జీ, కె.ఎన్. జోగ్లేకర్, పి.సి. జోషి, ముజఫ్ఫర్ అహమద్. ముందు వరస: ఎం.గి.దేశాయ్, డి.గోస్వామి, ఆర్.ఎస్. నింబ్కర్, ఎస్.ఎస్. మిరాజ్కర్, ఎస్.ఎ.డాంగే. ఎస్.వి. ఘాటే, గోపాల్ బసక్

చిన్నవారు.

ఢిల్లీ కుట్ర కేసు (1912)

దీన్నే ఢిల్లీ లాహోర్ కుట్ర కేసు అని కూడా అంటారు. బెంగాల్, పంజాబ్ లో అజ్ఞాతవాసం గడుపుతున్న రాస్ బిహారీ బోస్ అప్పటి భారత వైస్రాయ్ ను హత్య చేయడానికి ప్రయత్నించారు. ఈ కేసులో బసంత్ కుమార్ బిస్వాస్, అమీర్ చంద్, అవధ్ బెహారీని అరెస్టు చేశారు.

పెషావర్ కుట్ర కేసు (1922-1927)

ఈ కుట్ర కేసు ప్రధానంగా భారత్‌లో ప్రవేశించడానికి ప్రయత్నించిన ముజాహిర్ల మీద మోపింది. వీరు రష్యా నుంచి భారత్ లో ప్రవేశించాలను కున్నారు. భారత్ లో కమ్యూనిస్టు ఉద్యమం నడుపుదామనుకున్నారు. భారత్ లో కమ్యూనిస్టు భావజాలం వ్యాప్తి చెందడంతో బ్రిటిష్ ప్రభుత్వం బెంబేలెత్తిపోయింది. అందుకే వరసగా కుట్ర కేసులు మోపింది.

కాన్పూర్ బోల్షెవిక్ కుట్ర కేసు (1924)

ఈ కేసు దేశంలో ఎదుగుతున్న కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా మోపింది. ఎం.ఎన్.రాయ్, ముజఫ్ఫర్ అహమద్, ఎస్.ఎ.డాంగే, గులాం హుస్సేన్ మొదలైన వారిని అరెస్టు చేశారు. ప్రభుత్వంపై కుట్ర చేస్తున్నారన్న ఆరోపణ మోపారు. బ్రిటిష్ చక్రవర్తికి బ్రిటిష్ ఇండియా మీద ఉన్న సార్వభౌమాధికారాన్ని వమ్ము చేసి బ్రిటిష్ సామ్రాజ్యం నుంచి భారత్ ను సంపూర్ణంగా విడదీయడానికి హింసాత్మక విప్లవానికి ప్రయత్నిస్తున్నారన్నది ఈ కుట్ర కేసులో ప్రధానాంశం.

కకోరి కుట్ర కేసు (1925)

దీన్ని కకోరీ రైలు దోపిడీ కేసు అని కూడా అంటారు. భారత్ లో ఉన్న బ్రిటిష్ ప్రభుత్వాన్ని దోపిడీ చేసే ప్రయత్నం చేశారన్నది ఈ కేసులో ప్రధాన ఆరోపణ. ఈ దోపిడీకి పథకం వేసింది హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ (హెచ్.ఆర్.ఎ.) అనే విప్లవ సంస్థ. దీనికి ప్రధాన సూత్రదారి రాం ప్రసాద్ బిస్మల్. అష్ఫాకుల్లా ఖాన్, రాజేంద్ర లాహిర్తి, చంద్ర శేఖర్ ఆజాద్, సచీంద్ర బక్షి, లాల్ గుప్తా (మురాలీ లాల్ ఖన్నా), ముకుంది లాల్ (ముకుంది లాల్ గుప్తా) బన్వారీ లాల్ సహాయం అందించారు. హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ (హెచ్.ఆర్.ఎ.) ఏర్పాటు చేయడానికి బ్రిటిష్ ప్రభుత్వ నిధులను దోచుకోవాలన్నది ఈ దాడి ప్రధానోద్దేశం. అలాగే హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ మీద ప్రజల్లో సానుకూల అభిప్రాయం కలిగేట్టు చేసే సంకల్పమూ ఈ దోపిడీలో ఉంది.

మీరట్ కుట్ర కేసు (1929)

ఈ కుట్ర కేసు ప్రభావం భారత కార్మికవర్గం మీదా చాలా ఎక్కువగా చూపింది. ఒక రకంగా ఇది దేశంలో కమ్యూనిస్టు భావజాలం విస్తరించడానికి ఉపయోగపడింది. కుట్ర పన్నుతున్నారన్న ఆరోపణతో ముగ్గురు ఇంగ్లీష్ వాళ్లతో సహా 31 మంది కార్మిక నాయకులను ఈ కేసులో అరెస్టు చేశారు. వారిలో ఎస్.ఎ.డాంగే, ఎస్.వి.ఘాటే, షౌకత్ ఉస్మాని, ఫిలిప్ స్ప్రాట్ లాంటి వారు ఉన్నారు. వీరు బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి ప్రయత్నించారన్నది ప్రధాన ఆరోపణ. దేశంలో సమ్మెలు చేయించడం, పోరాట పటిమ గల ఉద్యమాల సహాయంతో బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూల్చేయాలని ప్రయత్నిస్తున్నట్టు బ్రిటిష్ ప్రభుత్వం ఆరోపించింది. ప్రభుత్వ ఏం చేసినా ఈ కేసువల్ల నిందితులకు జాతీయ వాదుల మద్దతు సమకూరింది. 20వ శతాబ్దం మొదటి, రెండు దశాబ్దాలలో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదేలు చేసింది. కానీ సోవియట్ నిలదొక్కుకోవడంతో జనం దృష్టి సోషలిస్టు, మార్క్సిస్టు భావజాలాలవేపు మళ్లింది. ఈ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఉంది. మన దేశం కూడా దీనికి అతీతం కాదు.

విశాలాంధ్ర
5
ఆదివారం
29 డిసెంబరు 2024

మంచు కురిసే వేళలో...

కశ్మీర్ అందాలను ఆస్వాదిస్తున్న సందర్శకులు

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని ఎత్తైన పర్వతప్రాంతాల్లో నిరంతరాయంగా మంచు కురుస్తోంది. రహదారులు, ఇళ్లు, భవనాలు, చెట్లు, వాహనాలు మంచుతో కప్పేయబడుతున్నాయి. కొండలపై పడుతున్న మంచు అందాలు ఆకట్టుకుంటున్నాయి.

చిన్నారులు, స్థానిక ప్రజలు, సందర్శకులు మంచు వర్షాన్ని ఆస్వాదిస్తున్నారు. మంచు గడ్డలతో ఆటలు ఆడుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. సాధారణంగా శీతాకాలంలో జమ్ముకశ్మీర్‌కు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. మంచు తెరల మాటు నుంచి కశ్మీర్ లోయలు, కొండల అందాలను వీక్షించేందుకు దేశ నలుమూలల నుంచేగాక, విదేశాల నుంచి కూడా పర్యాటకులు భారీగా తరలివస్తారు. మంచు వర్షానికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు భారీగా మంచు పడుతుండటంతో శ్రీనగర్ సహా ప్రధాన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు కనిష్టానికి చేరాయి. ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు పడిపోయాయి. దీంతో చలి తీవ్రతకు కశ్మీర్ ప్రజలు గజగజ వణుకుతున్నారు. చలిమంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు. ప్రముఖ దాల్ సరస్సు సహా పలు నదులు గట్టకట్టుకుపోయాయి.

హర్యానాలో పాఠశాలలకు 15 రోజుల సెలవులు

చండీగఢ్: ఉత్తరాది రాష్ట్రం హర్యానాను చలి వణికిస్తోంది. ఇక్కడ రోజురోజుకీ పెరుగుతున్న చలి తీవ్రత వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారు. చిన్నారులు పాఠశాలకు వెళ్లడానికి భయపడుతున్నారు. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర విద్యాశాఖ 15 రోజులపాటు పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. హర్యానాలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు జనవరి 1 నుంచి 15 వరకు శీతాకాలం సెలవులిస్తున్నట్లు ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ షైనీ ఎక్స్ వేదికగా ప్రకటించారు. అయితే సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ బోర్డు నిబంధనల ప్రకారం... 10-12 తరగతి విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షల కోసం పాఠశాలకు హాజరుకావలసి ఉంది.

అయోధ్యలో హోటళ్లన్నీ ఫుల్

అయోధ్య: కొత్త సంవత్సరం వేళ అయోధ్య నగరం పర్యటకులతో కళకళలాడనుంది. నూతన ఏడాదిలోకి అడుగుపెట్టడం, బాలరాముడు కొలువుదీరి సంవత్సరం పూర్తి కావొస్తుండటంతో భారీగా భక్తులు తరలిరానున్నారు. దాంతో ఎలాంటి నిర్వహణ లోపాలు తలెత్తకుండా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. దర్శన వేళలు పెంచుతూ రామ జన్మభూమి తీర్థక్షేత్రట్రస్ట్ నిర్ణయం తీసుకుంది. 'భక్తులకు స్వాగతం పలికేందుకు అంతా సిద్ధంగా ఉంది. జనవరి 15 వరకు హోటల్ గదులన్నీ ముందుగానే బుక్ అయ్యాయి' అని స్థానిక హోటల్ యజమాని అంకిత్ మిశ్రా వెల్లడించారు. చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే గదుల లభ్యత ఉందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదే అదనుగా కొందరు హోటళ్ల యజమానులు రోజుకు రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్లు వెల్లడించాయి. 'రాముడి ఆలయం, హనుమాన్‌గఢి, లతాచౌక్, గుప్తర్ ఘాట్, సూరజ్‌కుండ్, ఇతర ప్రఖ్యాత స్థలాల వద్ద భారీగా భద్రతా ఏర్పాటు చేశాం' అని అయోధ్య పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

తీవ్రవాదుల పిరికిపంద చర్య
మణిపూర్ సీఎం

ఇంఫాల్: మణిపూర్‌లో థమ్నపోక్పి, సనాసబి ప్రాంతాల్లో తీవ్రవాదులు కాల్పులకు తెగబడటాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. బీరెన్‌సింగ్ శనివారం తీవ్రంగా ఖండించారు. 'ఇంఫాల్ తూర్పులోని సనాసబి, థమ్నాపోక్పి ప్రాంతాల్లో కుకి తీవ్రవాదులు జరిపిన కాల్పుల వల్ల పౌరులకు, భద్రతా సిబ్బంది సహా నలుగురికి గాయాలయ్యాయి. అమాయక పౌరులపైనా దాడి చేయడం తీవ్రవాదులది పిరికిపంద చర్య. వారు పౌరులపైనే కాదు... శాంతి, సామరస్యాలపైనా దాడి చేయడమే. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను' అని ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. తీవ్రవాదులు కాల్పులకు తెగబడే ప్రాంతాలకు అదనపు భద్రతా బలగాలను తరలించామని సీఎం తెలిపారు. ఇలాంటి సవాళ్ల సమయంలోనే ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కాల్పుల్లో గాయాలైన వారికి వైద్య సహాయం అందించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. కేంద్ర బలగాలు, పోలీసుల మధ్య సరైన అవగాహన, సమన్వయం ఉండాలని ఆయన పేర్కొన్నారు.

ఆరు రోజులుగా బోరుబావిలోనే చిన్నారి

జైపూర్: పొలంలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు బోరుబావిలో పడిపోయిన మూడేళ్ల చిన్నారిని కాపాడేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బోరుబావిలో 150 అడుగుల వద్ద ఉన్న చిన్నారి చేతనను బయటకు తీసేందుకు దాదాపు ఆరురోజులుగా సహాయ సిబ్బంది శ్రమిస్తున్నారు. సోమవారం ఈ ఘటన జరగ్గా... ఇప్పటివరకు చిన్నారిని బయటకు తీయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తన కుమార్తెను రక్షించాలంటూ బాలిక తల్లి అధికార యంత్రాంగాన్ని వేడుకుంటున్నారు. రాజస్థాన్‌లోని కోత్‌పుత్లీ- బెహ్రార్ జిల్లాలో చేతన అనే చిన్నారి పొలంలో ఆడుకుంటూ 700 అడుగుల బోరుబావిలో పడిపోయింది. 150 అడుగుల లోతు వద్ద బాలిక చిక్కుకునట్లు అధికారులు గుర్తించారు. తొలుత కుటుంబసభ్యులు ఆ పాపను రక్షించేందుకు యత్నించగా... మరింత కిందకు జారుకుంది. దీంతో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, స్థానిక పోలీసు సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. పైపుతో బోరుబావిలోకి ఆక్సిజన్ పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మంగళవారం క్లిప్‌ల సాయంతో 30 అడుగులు పైకి లాగినట్లు వెల్లడించారు. మరోవైపు... చిన్నారి పడిపోయిన బోరుబావికి సమాంతరంగా సొరంగం తవ్వడంపై అధికారులు దృష్టి సారించారు. తద్వారా బాలిక వద్దకు నిపుణులు చేరుకుని బయటకు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు ర్యాట్ హోల్ మైనర్స్ సహాయం తీసుకుంటునట్లు అధికారులు తెలిపారు. ఎన్ని సవాళ్లు ఎదురైనప్పటికీ చిన్నారిని బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తామన్నారు.

ఆప్ 'మహిళా సమ్మాన్'పై విచారణ

దిల్లీ లెఫ్టినెంట్ గవర్నరు ఆదేశం

న్యూదిల్లీ : మహిళా సమ్మాన్ యోజన పేరుతో ప్రైవేట్ వ్యక్తులు మహిళల వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్నారనే ఆరోపణలపై దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా విచారణకు ఆదేశించినట్లు ఆయన కార్యాలయం శనివారం వెల్లడించింది. ఫిబ్రవరిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతో బీజేపీ తన పథకాన్ని ఆపాలని చూస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. ఎన్నికల ముందు ఇలాంటి ప్రచారం జరుగుతున్నందున దిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ విషయాన్ని ప్రధాన ఎన్నికల కార్యాలయం ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి తెలియజేయవచ్చని ఎల్జీ చెప్పారు. ఇటీవల రాజ్ నివాస్‌లో సక్సేనాను కలిసిన కాంగ్రెస్ నేత, ఆ పార్టీ న్యూదిల్లీ అసెంబ్లీ స్థానం అభ్యర్థి సందీప్ దీక్షిత్ ఫిర్యాదు మేరకు విచారణకు ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీసు కమిషనర్‌ను ఉద్దేశించి ఎల్జీ ప్రిన్సిపల్ కార్యదర్శి రాసిన లేఖలో... 'ప్రభుత్వేతర వారి వ్యక్తిగత వివరాలు, ఫారమ్‌ల సేకరణ విషయంలో డివిజనల్ కమిషనర్ ద్వారా విచారణ జరిపించాలని గౌరవ లెఫ్టినెంట్ గవర్నర్... ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు' అని పేర్కొన్నారు. 'ప్రయోజనాల' కోసం ఎవరి వ్యక్తిగత వివరాలనైనా నమోదు చేయడం ద్వారా పౌరుల గోప్యతను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్ క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించవచ్చని తెలిపింది. కాగా, కాంగ్రెస్ అభ్యర్థి దీక్షిత్ బుధవారం సక్సేనాను కలుసుకున్నారు. మహిళా సమ్మాన్ యోజన గురించి తన ఆందోళనలను వ్యక్తం చేశారు. ఈ పథకం కింద నగరంలోని 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిళకు నెలకు రూ.1,000 ఇస్తామని దిల్లీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. మళ్లీ ఎన్నికయితే ప్రభుత్వం నెలకు రూ.2,100కు పెంచుతుందని ఆప్ తెలిపింది. ఆప్ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మహిళలను కలుస్తున్నారని, కొన్ని ఫారమ్‌లపై సంతకాలు చేయిస్తున్నారని దీక్షిత్ వివరించారు. మహిళా, శిశు అభివృద్ధి శాఖ, జీఎన్‌సీటీడీ సమర్పించిన వివరణ కారణంగా, ఇది ఆప్ చేస్తున్న మోసమని స్పష్టమవుతోందని, ఈ అంశంపై ఉన్నత స్థాయి విచారణను ఏర్పాటు చేయాలని దీక్షిత్ అభ్యర్థించారని ఆ లేఖ పేర్కొంది. డబ్ల్యూసీడీ విభాగం ఈ వారం ప్రారంభంలో వార్తాపత్రికలలో పబ్లిక్ నోటీసును ప్రచురించింది. పథకం నోటిఫై చేసినప్పుడు ఫారమ్‌ల సేకరణ కోసం డిజిటల్ పోర్టల్‌ను ప్రారంభించనున్నట్లు పేర్కొంది. అనధికార వ్యక్తులు అందజేసే ఫారమ్‌లను నింపవద్దని ఆ శాఖ ప్రజలకు సూచించింది.

ఆప్ పథకాలు ఆపేందుకు కుట్ర

బీజేపీ, కాంగ్రెస్‌పై కేజ్రీవాల్ ఆగ్రహం

న్యూదిల్లీ: ఆప్ పథకాలు ఆపేందుకు బీజేపీ, కాంగ్రెస్ కలిసి పనిచేస్తున్నాయని అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ శనివారం ఆరోపించారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ప్రతిపాదించిన సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ ఫిర్యాదు చేశారు. దీనిపై లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా విచారణకు ఆదేశించారు. కేజ్రీవాల్ దీనిపై స్పందిస్తూ బీజేపీ, కాంగ్రెస్‌పై మండిపడ్డారు. దిల్లీ ఎన్నికలకు ముందు మహిళలు, వృద్ధుల కోసం ఆప్ ప్రతిపాదించిన పథకాలను ఆపడానికి రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. 'బీజేపీకి నేరుగా వ్యవహరించే ధైర్యం లేకపోవడంతో కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌తో ఫిర్యాదు చేయించింది' అని మీడియాతో అన్నారు. 'ఎన్నికల్లో పోటీ చేసి బీజేపీ ఏం చేస్తుందని అనేక సార్లు అడిగేవాళ్లం? వాళ్ల ప్రణాళిక ఏంటి? గెలిస్తే మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన, ఉచిత విద్యుత్, ఉచిత విద్య ఆపుతారని ఈరోజు తెలిసింది' అని అన్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత మహిళలకు రూ.2,100, 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచిత వైద్యం అందిస్తామని చెప్పాను. ఈ రెండు పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడడంతో లక్షలాది మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. బీజేపీ భయాందోళనకు గురైంది. చాలా చోట్ల బీజేపీ డిపాజిట్లు గల్లంతవుతాయని చాలా మంది బీజేపీ నేతలు నాతో చెప్పారు' అని కేజ్రీవాల్ అన్నారు. 'మొదట గూండాలను పంపి, ఆ తర్వాత పోలీసులను పంపి రిజిస్ట్రేషన్ క్యాంపును కూల్చివేశారు. ఈరోజు విచారణ చేస్తామంటూ బూటకపు విచారణకు ఆదేశించారు. ఏం దర్యాప్తు చేస్తారు. ఎన్నికల్లో గెలిస్తే మేము వాటిని అమలు చేస్తామని ప్రకటించాం' అని తెలిపారు. బీజేపీ తన ఎన్నికల అవకాశాలను దెబ్బతీసేందుకు ఎల్జీ కార్యాలయాన్ని ఉపయోగించుకుంటోందని ఆరోపిస్తూ, ఈ దర్యాప్తులు రాజకీయ ప్రేరేపితమని ఆప్ ఆరోపించింది. 'ఈ ఉత్తర్వు ఎల్జీ కార్యాలయం నుంచి రాలేదు. అమిత్ షా కార్యాలయం నుంచి వచ్చింది. మహిళలను గౌరవించనందున దిల్లీలో మహిళా సమ్మాన్ యోజనను నిలిపివేయాలని బీజేపీ కోరుకుంటోంది. దిల్లీ ఎన్నికలలో బీజేపీ ఓటమిని అంగీకరించింది' అని పేర్కొంది. మహిళా సమ్మాన్ యోజన కోసం ఇప్పటికే 22 లక్షల మంది మహిళలు నమోదు చేసుకున్నారని పార్టీ పేర్కొంది.

మన్మోహన్ అంత్యక్రియలపై రాజకీయాలొద్దు

మాయావతి

లక్నో: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు, స్మారకంపై రాజకీయాలు చేయడాన్ని బీఎస్పీ అధినేత్రి మాయావతి తీవ్రంగా ఖండించారు. మన్మోహన్ సింగ్ కుటుంబం, సిక్కు మతం మనోభావాలను కేంద్ర సర్కారు గౌరవించాలని ఆమె హితవు పలికారు. మన్మోహన్ సింగ్ కుటుంబం ఎక్కడైతే ఆయన స్మారకాన్ని నిర్మించాలని కోరుతున్నదో అక్కడే నిర్మించాలని సూచించారు. ఈ విషయంలో ఎవరికీ రాజకీయాలు చేసే హక్కు లేదని, కేంద్ర ప్రభుత్వం మన్మోహన్ సింగ్ కుటుంబం కోరిన చోటనే ఆయన స్మారకాన్ని నిర్మించాలని మాయావతి డిమాండ్ చేశారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు జరిగిన చోటనే ఆయన స్మారకాన్ని నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుండగా... అక్కడ కుదరదని, ఆయన స్మారకాన్ని ఎక్కడ నిర్మించాలనేది త్వరలో నిర్ణయిస్తామని కేంద్రం చెబుతోంది.

పోలీస్ అధికారి పీహెచ్‌డీ రద్దు

అత్యాచారం చేశాడంటూ మహిళ ఫిర్యాదుతో కేసు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో రీసెర్చ్ స్కాలర్‌పై అత్యాచారం కేసు విచారణ ఎదుర్కొంటున్న పోలీసు అధికారి మహ్మద్ మొహ్సిన్ ఖాన్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను ఐఐటీ కాన్పూర్ రద్దు చేసింది. ఆ రాష్ట్ర డీజీపీ కార్యాలయం సిఫార్సుల మేరకు ఈ చర్యలు చేపట్టింది. ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్ డాక్టర్ మణీంద్ర అగర్వాల్ దీనిని ధృవీకరించారు. డీజీపీ కార్యాలయం నుంచి ఆమోదం పొందిన తర్వాత మొహ్సిన్ ఖాన్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్ రద్దు చేసినట్లు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే... కాన్పూర్‌లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)గా పనిచేస్తున్న మొహమ్మద్ మొహ్సిన్ ఖాన్... ఐఐటీ కాన్పూర్‌లో సైబర్ క్రైమ్, క్రిమినాలజీలో పీహెచ్‌డీ చేస్తున్నాడు. అదే విద్యాసంస్థకు చెందిన మహిళా రీసెర్చ్ స్కాలర్‌తో సాన్నిహిత్యం పెంచుకున్నాడు. తన భార్యకు విడాకులు ఇచ్చిన తర్వాత వివాహం చేసుకుంటానని నమ్మించి ఆమెను లోబర్చుకున్నాడు. ఆ తర్వాత మాట తప్పాడు. పోలీస్ అధికారి మొహ్సిన్ ఖాన్ తనపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆ మహిళ ఫిర్యాదు చేసింది. అతడిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేయడానికి పోలీసులు సిట్ ఏర్పాటు చేశారు. ఆయనను విధుల నుంచి తప్పించి పోలీసు ప్రధాన కార్యాలయానికి అటాచ్ చేశారు. అలహాబాద్ హైకోర్టు మొహ్సిన్ అరెస్టుపై ఈ నెల 19న స్టే విధించడంతో ఆయనకు తాత్కాలిక ఉపశమనం లభించింది.

దిల్లీలో రికార్డు వర్షం

న్యూదిల్లీ: దేశ రాజధాని నగరం దిల్లీలో వర్షం సరికొత్త రికార్డు నమోదు చేసింది. ఏకంగా 101 ఏళ్ల తర్వాత దిల్లీలో డిసెంబర్ నెలలో 24 గంటల వ్యవధిలో అత్యధిక వర్షం నమోదై రికార్డు సృష్టించింది. శనివారం ఉదయం 8.30 వరకు గడిచిన 24 గంటల్లో దిల్లీలో 41.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సరిగ్గా 101 ఏళ్ల క్రితం 1923 డిసెంబర్ 3వ తేదీన 75.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇంతటివర్షం తర్వాత మళ్లీ డిసెంబర్‌లో శనివారమే అత్యధిక వర్షం పడింది. వాతావరణ శాఖ దిల్లీకి ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వర్షం ఆగకుండా కురుస్తుండడంతో దిల్లీలో ఉష్ణోగ్రతలు 13 డిగ్రీలకు పడిపోయాయి. వర్షం వల్ల రోడ్లపై నీరు నిలిచి అనేకచోట్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడ్డాయి. భారీ వర్షం కారణంగా రాజధాని నగరంలో క్షీణించిన వాయునాణ్యత ఒక్కసారిగా మెరుగుపడింది.

అన్నా వర్సిటీలో అత్యాచార ఘటన

బాధితురాలికి రూ.25 లక్షల పరిహారం

చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలోని అన్నా యూనివర్సిటీ ప్రాంగణంలో ఓ విద్యార్థిపై అత్యాచార ఘటన రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనపై విచారణకు సిట్‌ను ఏర్పాటు చేయాలని మద్రాస్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సిట్‌లోని ముగ్గురు సభ్యులు మహిళా ఐపీఎస్ అధికారులే ఉండాలని స్పష్టం చేసింది. అంతేగాక, బాధితురాలికి రూ.25 లక్షల పరిహారం అందించాలని రాష్ట్ర సర్కారుకు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ పరిణామాల కారణంగా విద్యార్థిని చదువుపై ఎలాంటి ప్రభావం పడకూడదని తెలిపింది. ఆమె నుంచి ఫీజు వసూలు చేయొద్దని యూనివర్సిటీని న్యాయస్థానం ఆదేశించింది. చెన్నై అన్నా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థిని డిసెంబరు 23న రాత్రి తన స్నేహితుడితో కలిసి వర్సిటీ ప్రాంగణంలో మాట్లాడుతుండగా అక్కడికి ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఆమె స్నేహితుడిపై దాడి చేసి అక్కడి నుంచి పంపించేశారు. అనంతరం తనపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమెను ఫొటోలు తీసి, తమపై ఫిర్యాదు చేస్తే వాటిని సామాజిక మాధ్యమాల్లో పెడతామని బెదిరించారు. దీనిపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఆధారంగా ఓ యువకుడిని అరెస్టు చేశారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన రాష్ట్రంలో రాజకీయ దుమారానికి దారితీసింది.

సిమ్లా, మనాలిలో నూతన వత్సర సందడి

పోటెత్తిన పర్యాటకులు... ట్రాఫిక్ జామ్



సిమ్లా: నూతన సంవత్సరానికి (2025) ఆహ్వానం పలికేందుకు అందరూ సిద్ధమౌవుతున్నారు. 2024 ముగింపు దశకు రావడంతో చాలా మంది వినూత్నంగా కొత్త సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు సన్నాహమౌతున్నారు. స్నేహితులు, కుటుంబీకులతో కలిసి పార్టీలు జరుపుకునేందుకు విహార యాత్రలకు తరలివెళ్తున్నారు. ఈ క్రమంలోనే హిల్ స్టేట్ హిమాచల్ ప్రదేశ్ పర్యాటకులతో కళకళలాడుతోంది. ప్రస్తుతం హిమాచల్‌లో భారీగా మంచు కురుస్తోంది. సోలాంగ్ వ్యాలీ, రోహ్‌తంగ్‌పాస్, అటల్ టన్నెల్ ప్రాంతాలు మంచుతో పర్యాటకులను ఆహ్వానిస్తున్నాయి. మంచు అందాలు పర్యాటకులను ఆహ్వానిస్తున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు కొండ ప్రాంతానికి పోటెత్తుతున్నారు. సిమ్లా, మనాలి, కసోల్ తదితర ప్రాంతాలు సందడిగా మారాయి. మరోవైపు భారీగా వాహనాలు రావడంతో మనాలి - సోలాంగ్ నాలా రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. వారం రోజుల్లో 30 వేల మందికి పైగా ప్రజలు మనాలిని సందర్శించినట్లు అధికారులు వెల్లడించారు. న్యూఇయర్ వేడుకల కోసం సుమారు 20 వేల మందికిపైగా పర్యాటకులు హిల్ స్టేషన్‌ను సందర్శిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. సోలాంగ్ వ్యాలీలో భారీగా మంచు కురుస్తుండటంతో ముందు వాహనాలు కనిపించని పరిస్థితి. సుమారు 1,000 వాహనాలు చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. ఆయా వాహనాల్లో దాదాపు ఐదువేల మంది పర్యాటకులు ఉన్నట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పర్యాటకులను కులు పోలీసులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

అందుబాటులోకి సూది లేని ఇంజెక్షన్లు

ముంబై: అనారోగ్యంతో వైద్యుడి వద్దకు వెళ్తే సూదితో పొడుస్తాడేమోననే భయం ఇక అక్కర్లేదు. సూది లేకుండా, నొప్పి తెలియకుండా ఇచ్చే పెయిన్‌లెస్ ఇంజెక్షన్లు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. ఐఐటీ బాంబేకు చెందిన పరిశోధకులు ఈ షాక్ సిరంజీలను అభివృద్ధి చేశారు. చర్మాన్ని పదునైన సూదితో పొడవాల్సిన అవసరం లేకుండా షాక్‌వేవ్ ఆధారంగా ఈ సిరంజీ పని చేస్తుంది. షాక్ వేవ్‌ల ద్వారా ఒత్తిడిని కల్పించి, వెంట్రుక కన్నా సన్నగా ఉండే మొన(నాజిల్) ద్వారా వేగంగా శరీరంలోకి ఔషధాన్ని పంపించడం ఈ సిరంజీ ప్రత్యేకత. విమానం టేకాఫ్ అయ్యే సమయంలో ప్రయాణించే వేగం కంటే రెట్టింపు వేగంతో, సులభంగా ఇది ఔషధాన్ని శరీరంలోకి చేరుస్తుంది. దీని వల్ల నొప్పి కలగదు. వాపు లాంటి సమస్యలు ఉండవు. అనస్థీషియా, యాంటీఫంగల్, ఇన్సులిన్ అందించేందుకు ఎలుకలపై ఈ సిరంజీని పరీక్షించగా సమర్థంగా పని చేసింది.

ప్రముఖ స్థానాల్లో మన్మోహన్ కుమార్తెలు

న్యూదిల్లీ: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు యావద్దేశ ప్రజలు శనివారం అంతిమ వీడ్కోలు పలికారు. మన్మోహన్ సింగ్ భార్య గుర్‌శరణ్ కౌర్, ఆయన ముగ్గురు కుమార్తెలు ఉపిందర్, దామన్, అమృత్ తదితరులు ఆయనకు తుది వీడ్కోలు పలికారు. మన్మోహన్ భార్య గుర్‌శరణ్ కౌర్ అందరికీ చిరపరిచితులే. ప్రొఫెసర్‌గా, రచయితగా, కీర్తనా సింగర్‌గా పేరు తెచ్చుకున్నారు. ముగ్గురు కుమార్తెలు వారివారి రంగాల్లో కీర్తి గడించారు. మన్మోహన్ పెద్దకుమార్తె పేరు ఉపిందర్ సింగ్. చరిత్రకారిణి (హిస్టారియన్)గా, అశోకా యూనివర్సిటీలో ఫ్యాకల్టీ డీన్‌గా ఉన్నారు. 'ఎ హిస్టరీ ఆఫ్ ఏన్షియంట్ అండ్ ఎర్లీ మెడివల్ ఇండియా', 'ది ఏన్షియంట్ ఇండియా' సహా అనేక పుస్తకాలను ఆమె రచించారు. 2009లో సోషల్ సైన్సెస్‌లో ఇన్ఫోసిస్ అవార్డు అందుకున్నారు. పురాతన గ్రీక్ ఫిలాసఫీపై విస్తృత రచనలు చేసిన ప్రముఖ రచయిత విజయ్ టంఖాను ఆమె వివాహం చేసుకున్నారు. మన్మోహన్ సింగ్ రెండవ కుమార్తె దామన్ సింగ్ రచయిత. 'స్ట్రిక్ట్‌లీ పర్సనల్, ఎ బయోగ్రఫీ ఆఫ్ హెర్ పేరెంట్స్' సహా చాలా పుస్తకాలు రాశారు. సామాజిక అంశాలపై రచనలు చేశారు. ఐపీఎస్ అధికారి, ఇండియన్ నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్ మాజీ సీఈఓ అశోక్ పట్నాయక్‌ను దామన్ వివాహం చేసుకున్నారు. మన్మోహన్ ముగ్గురు కుమార్తెల్లో చివరి ఆమె అమృత్ సింగ్. అమెరికాలో మానవ హక్కుల లాయర్‌గా మంచిపేరు తెచ్చుకున్నారు. స్టాన్‌ఫోర్ట్ లా స్కూలులో లా ప్రొఫెసర్‌గా ఉన్నారు. అంతర్జాతీయ మానవహక్కుల అంశాలపై కీలక న్యాయవాదిగా వ్యవహరిస్తున్నారు. ప్రఖ్యాత యాలే లా స్కూల్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి సహా ప్రతిష్టాత్మక సంస్థల్లో డిగ్రీలు సాధించారు.

దిల్లీలో అంత్యక్రియలు జరగని మాజీ ప్రధానులు

న్యూదిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అంత్యక్రియలు దిల్లీలోని నిగమ్ బోధ్‌లో జరిగాయి. ఆయన స్మారకం కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించాలని, కాంగ్రెస్ పార్టీ కేంద్రప్రభుత్వానికి లేఖ రాసింది. దీనిపై కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. కేంద్రం మన్మోహన్‌సింగ్ అంత్యక్రియల విషయంలో సంప్రదాయాలు పాటించడం లేదని కాంగ్రెస్ పేర్కొంది. ఇదే సమయంలో గతంలో కాంగ్రెస్ ఎలాంటి సంప్రదాయాలు పాటించిందో తెలుసుకోవాలని బీజేపీ నేతలు ఎదురుదాడికి దిగారు. ఇదే సమయంలో దిల్లీలోని రాజ్‌ఘాట్‌లో అంత్యక్రియలు జరగని మాజీ ప్రధానుల అంశం తెరపైకి వచ్చింది. దేశ రాజకీయాల్లో ఓ ప్రధాని అంత్యక్రియల విషయం వార్తల్లో నిలవడం ఇదే తొలిసారి కాదు. గతంలో ముగ్గురు ప్రధానుల అంత్యక్రియలు దేశం బయటే జరిగాయి. వారి వివరాలు... 1991 నుండి 1996 వరకు భారత ప్రధానిగా పనిచేసిన పీవీ నరసింహారావు 2004 డిసెంబర్ 23న తుదిశ్వాస విడిచారు. ఆ సమయంలో దిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ ఉన్నారు. పీవీ నరసింహారావు అంత్యక్రియలు దిల్లీలోనే నిర్వహించాలని ఆయన కుటుంబ సభ్యులు తొలుత భావించారు. కానీ, కాంగ్రెస్‌లోని కొందరు సీనియర్ నేతలు పీవీ అంతిమ సంస్కారాలు హస్తినలో కాకుండా హైదరాబాద్‌లో నిర్వహించేలా అధిష్టానంపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ అంశంపై దిల్లీలో ఎన్నో చర్చలు జరిగాయి. అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ సైతం పీవీ అంత్యక్రియలు దిల్లీలో నిర్వహించేందుకు సానుకూలంగా ఉన్నప్పటికీ పార్టీలో సీనియర్ల నుంచి వచ్చిన ఒత్తిడితో ఏమి చేయలేకపోయారని అప్పట్లో మన్మోహన్ మీడియా సలహాదారుడు సంజయ్ బారు గతంలో చెప్పారు. చివరకు పీవీ అంత్యక్రియలు హైదరాబాద్‌లో నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలో దిల్లీలో పీవీ నరసింహారావు స్మారకం నిర్మించాలనే చర్చ జరిగినప్పటికీ నిర్మాణం కాలేదు. తెలంగాణకు చెందిన పీవీ నరసింహారావు ప్రధానిగా సేవలు అందించినప్పటికీ ఆయన అంత్యక్రియలు దిల్లీలో జరగలేదు. అలాగే, 1989 నుంచి 1990 వరకు ప్రధానిగా పనిచేసిన వీపీ సింగ్ 2008లో దిల్లీలో మరణించారు. దిల్లీలో ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తారనే చర్చ జరిగింది. చివరికి ఆయనను అలహాబాద్‌కు తీసుకెళ్లారు. ఆ సమయంలో కుటుంబ సభ్యుల కోరిక మేరకు అంత్యక్రియలు ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఒడ్డున నిర్వహించారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించగా... ప్రభుత్వ ప్రతినిధిగా అప్పటి కేంద్రమంత్రి సుభోద్ కాంత్ సహాయ్ సింగ్ వీపీ సింగ్ అంత్యక్రియలకు హాజరయ్యారు. ఆ తర్వాత స్మారక చిహ్నం దిల్లీలో నిర్మించాలనే ప్రయత్నం చేసినా నిర్మాణం జరగలేదు. 1977 నుండి 1979 వరకు ప్రధానమంత్రిగా పనిచేసిన మొరార్జీ దేశాయ్ 1995లో ముంబైలోని జస్లోక్ ఆసుపత్రిలో కన్నుమూశారు. మొరార్జీ కుటుంబ సభ్యుల కోరిక మేరకు సబర్మతి ఒడ్డున ఆయన అంత్యక్రియలు జరిగాయి. మొరార్జీ అంత్యక్రియలకు అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు హాజరయ్యారు. అంత్యక్రియల అనంతరం మొరార్జీ చితాభస్మాన్ని దిల్లీకి తరలించారు. మరోవైపు, మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, చంద్రశేఖర్, చౌదరి చరణ్ సింగ్, రాజీవ్ గాంధీ, ఐకే గుజ్రాల్, అతల్ బిహారీ వాజ్‌పేయి అంత్యక్రియలు దిల్లీలోనే జరిగాయి. వీరిలో నెహ్రూ, శాస్త్రి, ఇందిరాగాంధీ, చౌదరి చరణ్, చంద్రశేఖర్, రాజీవ్ గాంధీ, అతల్ బిహారీ వాజ్‌పేయి స్మారకాలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

30న జాబ్ మేళా

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మెడిప్లస్ కంపెనీ ప్రయివేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. కంపెనీలోని 100 ఫార్మసిస్ట్ అండ్ అసిస్టెంట్ పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, డి ఫార్మసీ, డిగ్రీ, చేసిన 18 నుండి 30 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలియజేసింది. మరిన్ని వివరాలకు శైలేష్ (ఫో.నెం.9666662486)ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్లతో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో వద్ద నేరుగా డిసెంబర్ 30న హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గం పరిధి 131 -కుత్బుల్లాపూర్ డివిజన్ పల్లవి మోడల్ స్కూల్ నందు నిర్వహించిన 'ప్రథం అన్యువల్ స్పోర్ట్స్ మీట్' ను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతా యన్నారు. క్రీడల ద్వారా శరీర దారుఢ్యంతో పాటు మానసిక ధైర్యం పెంపొందు తుందని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు.అంతక ముందు ఎమ్మెల్యే విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్, జగన్, డైరెక్టర్లు విద్యాధర్, గిరిధర్, ప్రిన్సిపల్ ధనలక్ష్మి, నాయకులు కిషోర్ చారి, శ్రీకాంత్, జల్దా లక్ష్మి నాథ్, సంక్షేమ సంఘం నాయకులు దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణ పనులు పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో మేడ్చల్-మల్కాజిగిరి : మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం ఎంపీ ఈటల రాజేందర్ పాత ఆల్వాల్‌లోని కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC) నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన నిర్మాణ ప్రగతిని సమీక్షించి, ఈ సేవలు త్వరగా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ... ఈ కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆల్వాల్, పరిసర ప్రాంతాల ప్రజలకు సమీపంలో ఉన్న క్వాలిటీ ఆరోగ్య సేవలను అందిస్తుందన్నారు. పెద్ద ఆసుపత్రులపై భారం తగ్గిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ప్రాంతంలో ఆరోగ్య సేవల మౌలికసదుపాయాలు విస్తరించి, ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటున్నాం. ఈ కొత్త ఆరోగ్య కేంద్రం ప్రారంభమయ్యి, ప్రజలకు సేవలు అందించాలని మరింత వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించాను" అని అన్నారు. ఈ కార్యక్రమంలో మెదచల్ మల్కాజిగిరి జిల్లా వైద్య అండ్ ఆరోగ్య అధికారి డాక్టర్ శోభారాణి మరియు ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రవీంద్ర భారతి వార్షికోత్సవం

విశాలాంధ్ర-దుండిగల్: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడమే విద్యాసంస్థల ప్రధాన లక్ష్యమని ఎమినెంట్ సైకాలజిస్ట్ ఫౌండర్- ది నివురోన్స్ గ్రూప్ హేమంత్ కుమార్, విద్యాసంస్థల డైరెక్టర్ రేవంత్ పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గండి మైసమ్మ చౌరస్తా లో గల రవీంద్ర భారతి గ్లోబల్ స్కూల్ నందు రాప్సోడి-2024 వార్షికోత్సవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమినెంట్ సైకాలజిస్ట్ ఫౌండర్- ది నివురోన్స్ గ్రూప్‌కు చెందిన జి.హేమంత్ కుమార్, రవీంద్ర భారతి విద్యాసంస్థల డైరెక్టర్ రేవంత్ కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హేమంత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు నేటి సమాజంలో ఏ విధమైన మెలకువలతో ఉండి, పురోభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం రేవంత్ తమ అమూల్యమైన సందేశాన్ని వెల్లడించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఈ సంవత్సరంలో ఏర్పాటు చేసినటువంటి అన్ని యాక్టివిటీ బేస్ టీచింగ్, విద్యార్థుల యాక్టివిటీస్ గురించి తెలిపారు. ఈ వార్షికోత్సవంలో ప్రీ ప్రైమరీ విద్యార్థులు డిస్కో డాన్స్ ప్రదర్శన చేశారు. తెలంగాణలోని ముఖ్య పండుగ అయిన బతుకమ్మ పండుగ గురించి చేసిన నృత్యం ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన మైఖేల్ జాక్సన్ డాన్స్, గర్భ నృత్యం అలాగే కరాటేలో తమ యొక్క మెలకులను చూపిన విద్యార్థులు, మన జాతీయ సమైక్యతను చాటుతూ విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. అదేవిధంగా విద్యార్థులు ఇంకా వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నాటకలు ప్రదర్శించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్య క్రమానికి అకాడమిక్ డైరెక్టర్ రాణి, పాఠశాల ప్రిన్సిపల్ అనూష, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రూట్ మ్యాప్ సిద్ధం : కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైడ్రా ఏర్పడి దాదాపు 5 నెలలు దాటిన నేపథ్యంలో గడిచిన ఐదు నెలల అనుభవాలతో, వచ్చే ఏడాది రూట్ మ్యాప్ సిద్ధం చేశామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. శనివారం హైడ్రా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓఆర్ ఆర్ వరకు హైడ్రా పరిధి ఉందని పేర్కొన్నారు. అలాగే జీహెచ్ ఎంసీ చట్టం కింద ప్రభుత్వం ప్రత్యేక అధికారులు ఇచ్చిందని ఇప్పటి వరకు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని, 12 చెరువులు, 8 పార్కులను అన్యక్రాంతం కాకుండా హైడ్రా రక్షించిందని వివరించారు. ముఖ్యంగా హైడ్రా చర్యలతో ప్రజాలకు ఏఫ్ టీఎల్ , బఫర్ జోన్‌పై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు.1095 చెరువుల్లో వచ్చే ఏడాది ఎఫ్ టీఎల్ నిర్ధారణ చేస్తామని, వీటిని సాంకేతిక పరిజ్ఞానం, డాటాతో ఎఫ్ టీఎల్ నిర్ధారణ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎఫ్ టీఎల్ ను పారదర్శకంగా చేయడం తమ బాధ్యతగా పేర్కొన్నారు. శాటిలైట్ ఇమేజ్‌తో అత్యంత రెజల్యూషన్ ఉన్న డేటా తీసుకుంటున్నట్లు చెప్పారు. 2006 నుంచి 2023 వరకు ఏరియల్ డ్రోన్స్‌తో తీసిన ఫొటోలను ఎఫ్ టీఎల్ నిర్ధారణ కోసం తీసుకుంటున్నామని, ఇందులో ఎఫ్ టీఎల్ మారడానికి గల కారణాలు స్పష్టంగా తెలుస్తుందన్నారు. శాస్త్రీయమైన పద్ధతుల్లోనే ఎఫ్ టీఎల్ నిర్ధారణ జరుగుతుందని స్పష్టం చేశారు. నాలాలపై కిర్లోస్కర్ కంపెనీ చేసిన స్టడీని తీసుకుంటున్నామని ఇప్పటికే 5800 ఫిర్యాదులు హైడ్రాకు అందాయన్నారు. అనధికారిక నిర్మాణాలకు సంబంధించి 27 పురపాలక సంఘాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ 27 పురపాలక సంఘాలపై మాకు అధికారం ఉందన్నారు. శాటిలైట్ ఇమేజ్ ల ద్వారా ఆక్రమణలను గుర్తిస్తున్నామన్నారు. అలాగే భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌పై దృష్టి పెట్టినట్లు చెప్పారు. 2025లో జియో ఫెన్సింగ్ సర్వే చేస్తామని,12 చెరువుల పునరుద్ధరణకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. త్వరలోనే 72 డీఆర్ ఎఫ్ బృందాలు అందుబాటులోకి వస్తాయని, అందులో నాగోల్ లో ఉన్న డీఆర్ ఎఫ్ కేంద్రాన్ని బలోపేతం చేస్తామన్నారు. త్వరలోనే నగరంలో మరో డాప్లర్ వెదర్ రాడార్ రాబోతుందని, వెదర్ డాటాను విశ్లేషించేందుకు హైడ్రాలో ఒక టీంను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. హైడ్రాకు త్వరలో ఒక ఎఫ్‌ఎం ఛానల్‌కు ప్రయత్నిస్తున్నామని, హైడ్రావల్ల ప్రజల్లో భూములు, ఇల్లు క్రయవిక్రయాలపై అవగాహన పెరుగుతుందని అన్నారు. నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కఠినంగానే ఉంటుందని స్పష్టం చేశారు. జులై తర్వాత అనధికారికంగా, వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేవాటిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే ఏడాది నుంచి ప్రతి సోమవారం గ్రీవెన్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని, ఎఫ్ టీఎల్ లో ఉన్న షెడ్లపై ప్రజలెవరు అద్దెకు తీసుకోవద్దన్నారు. ప్రజల ఇచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నామన్నారు.

బీఎస్పీ కార్యాలయం ముట్టడి

- పార్టీ కార్యకర్తలను మోసం చేసిన ప్రభాకర్
- బెదిరింపులకు గురిచేస్తున్నారని బాధితుల ఆవేదన

విశాలాంధ్ర, హైదరాబాద్ : స్వచ్ఛంద సంస్థ ముసుగులో బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ పేద ప్రజలను, సొంత పార్టీ కార్యకర్తలను మోసం చేస్తున్నారని పలువురు బాధితులు ఆరోపించారు. గ్రామాలలో ఇళ్లు కట్టిస్తానని, నాబార్డు నుంచి వివిధ పథకాల సబ్సిడీ తోపాటు డైరీ, వ్యవసాయ, చేపల పెంపకం వంటి రుణాలు ఇప్పిస్తానని, మార్జిన్ మనీ, ఖర్చుల పేరుతో కోట్లాది రూపాయలను వసూలు చేసి మోసం చేసిన మంద ప్రభాకర్, మాల్యవి కరుణోదయ స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకురాలు కొండ కృష్ణమ్మలపై తగిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా డబ్బులు ఇచ్చి మోసపోయిన వందలాది బాధితులు శనివారం హైదరాబాద్ లక్డీక పుల్‌లోని బి.ఎస్.పి రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. బి.ఎస్.పి కార్యాలయం ముందు బైఠాయించి మంద ప్రభాకర్, కొండ కృష్ణమ్మలపై చర్యలు తీసుకోవాలని, తమ డబ్బులు తమకు ఇప్పించి న్యాయం చేయాలని ప్లకార్డులు చేతబూని పెద్దఎత్తున నినాదాను చేస్తూ ప్రదర్శించారు. ఈ సందర్భంగా బాధితులు పల్లేటీ రవీందర్, గుర్రాల నాగయ్య, ముడిగి భిక్షపతి, నాతూరామ్, గ్యార జంగయ్య, పూదరి నరసింహా, జిల్లా రవి, వంగ కృష్ణయ్య, అజ్జాలపురం శ్రీనివాస్ తదితరులు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఇళ్లు కట్టిస్తామని, రైతులకు డెయిరీఫామ్ చేపల చెరువుల ఏర్పాటుకు నాబార్డు నుంచి రుణాలు ఇప్పిస్తామని మాల్యవి కరుణోదయ సొసైటీ పేరుతో రైతులు, పేద ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి నుంచి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు కోట్లాది రూపాయలను మంద ప్రభాకర్, కొండ కృష్ణమ్మ కలిసి వసూలు చేశారని తెలిపారు. రుణాలు ఇప్పించాలని లేదా డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా, మంద ప్రభాకర్ ఒక స్వచ్ఛంద సంస్థతో సంబంధం పెట్టుకుని ఒక్క మునుగోడు నియోజకవర్గంలో తన ద్వారా రూ.42 లక్షలను పేద ప్రజలకు ఇల్లు కట్టిస్తామని చెప్పి తీసుకున్నారని పల్లేటీ రవీందర్ తెలిపారు. రెండేళ్లు దాటినా ఇప్పటివరకు ఎవరికీ ఇల్లు కట్టించలేదని, రుణాలు మంజూరు చేయించలేదని, డబ్బులు తిరిగి ఇవ్వలేదన్నారు. తమ డబ్బులు ఎప్పుడు ఇస్తావని గట్టిగా అడగడంతో 'ఏమనుకుంటున్నావు. నువ్వు ఒక రాష్ట్ర అధ్యక్షుడుతో మాట్లాడుతున్నావ్ జాగ్రత్త. నీకు భవిష్యత్తు లేకుండా చేస్తా. నిన్ను ఖతం చేస్తా' అని తనను బెదిరించారని రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంద ప్రభాకర్ వల్ల తనకు ప్రాణహాని ఉందని, బి.ఎస్.పి జాతీయ నాయకత్వం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి నిరుపేద బహుజనులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. మంద ప్రభాకర్ లాంటి దుర్మార్గులు బి.ఎస్.పి రాష్ట్ర అధ్యక్ష పదవిలో ఉండడం, పార్టీని నడిపించడం వల్ల పేద ప్రజలకు హాని జరుగుతుందని, వెంటనే ఆయనను పదవి నుంచి తొలగించాలని వారు కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమకు తగిన న్యాయం చేసి, డబ్బులు ఇచ్చించాలని వారు విజ్ఞప్తి చేశారు.

విద్యకు ప్రాధాన్యత: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : విద్యనే మాకు మొదటి ప్రాధాన్యత అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కళాశా లలో ఉన్న సమస్యలను కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పీజీ కళాశాల కోసం ఐదు తరగతి గదులను ఏర్పాటు కోసం డైనింగ్, వాష్ రూమ్స్, ఆర్ఓ ప్లాంట్ కోసం నివేదికలు తయారు చేయాలని ప్రిన్సిపాల్స్ కు ఆదేశాలు జారీచేశారు. విద్యార్థులు కూర్చోవ డానికి వీలుగా విద్యార్థులకు బెంచీలు అందిస్తానని హామీ ఇచ్చారు. బాలికల జూనియర్ కళాశాలలో పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కళాశాల భవనం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కళాశాలలో వాష్ రూమ్ నుంచి ఔట్ లెట్ లేదని, ఎమ్మెల్యే దృష్టికి రావడంతో వెంటనే సమస్య పరిష్కారించాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్‌కు ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే శ్రీ అనిరుద్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, బుద్దారం సుధాకర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, పద్మ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సువర్ణ అవకాశం,....

గ్రామీణ క్రీడాకారులకు సియం కప్ ఓ సువర్ణ అవకాశం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియంలో జరుగు తున్న సియంకప్ రెండో రోజు కార్యక్రమానికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సియం కప్ 2024కు మహబూబ్ నగర్ వేదిక కావడం సంతోషంగా ఉందని, 33 జిల్లాలకు చెందిన బాలికలు మరియు బాలుర జట్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని ఆయన చెప్పారు. స్పోర్ట్స్ యునివర్సిటీ ఏర్పాటు చేసి ప్రతి జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ అథారిటీ లను అనుసంధానం చేసి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను వెలికితీసి ఒలింపిక్ క్రీడలలో మన రాష్ట్ర ప్రాతినిధ్యం వహించే విధంగా మేము అడుగులు వేస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, టి పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, డివైఎస్ఓ శ్రీనివాస్, కురుమూర్తి, బుద్దారం సుధాకర్ రెడ్డి, ఏర్పుల నాగరాజు, రమేష్ ముకుందం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు పిల్లలకు త్వరలో వసతి గృహం : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : జిల్లాలో ప్రత్యేక అవసరాలు పిల్లల కోసం త్వరలో వసతి గృహం ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో దివ్యాంగుల హక్కుల చట్టము 2016 హైదరాబాద్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ , చైర్మన్ జిల్లా కమిటీ అనుదీప్ దురిశెట్టి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం హోమ్ త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. కమిటీ సమావేశంలో సభ్యులు తెలిపిన విషయాలపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కమిటీ మెంబర్ సెక్రటరీ, సహాయ సంచాలకులు, వికలాంగులు వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారిక శాఖ హైదరాబాద్ జిల్లా. రాజేందర్ జిల్లాలో వికలాంగుల కోసం చేపడుతున్న వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కమిటీ సభ్యులు పద్మశ్రీ సాయిబాబా గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో అనేక స్వచ్ఛంద సంస్థలు. వికలాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నాయని అన్నారు. ఎఫ్ఈడి ఫౌండర్ ప్రెసిడెంట్ గంగారాం మాట్లాడుతూ అందులకు బస్సులలో అన్ని విధాలుగా ప్రయాణానికి వీలుగా ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. మరొక మెంబరు నాగభూషణం మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖలలో ఉన్నటువంటి ఉద్యోగ ఖాళీలను గుర్తించి అర్హులైన వికలాంగులకు ఇచ్చే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. కమిటీ మెంబర్ కొల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహించబ డుతున్న కొన్ని థెరపీ సెంటర్లను తనిఖీ చేసి నిబంధన ప్రకారం లేనటువంటి సంస్థలను మూసివేయాలని కోరారు. అంతే కాకుండా ప్రభుత్వ కార్యాలయాలలో లిఫ్ట్‌లలో వికలాంగులకు లిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. వికలాంగుల చేత నడపడుతున్న చిన్నచిన్న దుకాణాలను జిహెచ్ఎంసి వారు తొలగించకుండా తగు సూచనలు ఇవ్వవలసిందిగా అంతేకాకుండా ప్రభుత్వ అందుల వసతి గృహాలకు స్థలాలను కేటాయించి పక్కా భవనాలు కట్టించాలని కోరడం జరిగినది. సభ్యులు శాంతి వెంకట్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఒక హెూమ్ ఏర్పాటు చేయాలన్నారు. కమిటీ సభ్యులు చెప్పినటువంటి విషయాలన్నీ విన్నటువంటి జిల్లా కలెక్టర్ అన్ని అంశాలపై వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు ఈ సమావేశంలో జిల్లా కమిటీ మెంబర్లు జిల్లా స్థాయి అధికారులు కోటాజి, జిహెచ్ఎంసి యుసిడి జాయింట్ కమిషనర్, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్‌కు ఘన నివాళి

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : పేదల దేవుడు, పేదల పెన్నిధి, ఆపదలో ఉన్నవారు పిలిస్తే పలికే దేవుడు పి.జనార్దన్‌రెడ్డి. హైదరాబాద్‌కి గొప్ప నాయకుడు ఎవరు అంటే మొదట వినిపించే మాట పీ. జనార్దన్‌రెడ్డి, శనివారం 17వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించి, వారికి ఘన నివాళులర్పించారు. వారి తనయుడు మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్ రెడ్డి దోమలగుడా, వారి ఇంట్లో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు అప్పల సురేందర్ యాదవ్, అప్పల శ్రీశైలం యాదవ్ మొదలైన వారు హాజరై పి. జనార్దన్‌రెడ్డికి ఘనంగా నివాళు లర్పించారు. అలాగే జూబ్లీహిల్స్ నియోజకవర్గం, యూసుఫ్ గూడా డివిజన్, వెంకటగిరి లోని పీజేఆర్ విగ్రహానికి అప్పల సురేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి యువకుల మృతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్‌లోని మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు మృత్యు వాత పడ్డారు. బైక్ అతివేగంగా నడపడమే ఈ ఘటనకు కారణమని పోలీసులు అను మానిస్తున్నారు. బోరబండకు చెందిన ఆకాంక్ష్, రఘుబాబు, అనే ఇద్దరు యువకులు అర్ధరాత్రి సమయంలో బోరబండ నుంచి మాదాపూర్, వెళ్లే క్రమంలో పర్వత్ నగర్ చౌరస్తా సమీపంలో వీరి బుల్లెట్ బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. బైక్ నడిపిన యువకుడు మద్యం మత్తులో ఉన్నాడని పోలీసులు అనుమా నిస్తున్నారు. మృతదేహాలను పోస్టు మార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కబేళాను కాపాడాలని ధర్నా

విశాలాంధ్ర, హైదరాబాద్ : గౌలిపురా మున్సిపల్ కబేళాను కాపాడాలని, భూకబ్జాదారులతో కుమ్మక్కైన జిహెచ్ఎంసి అధికారులను సస్పెండ్ చేయాలని కోరుతూ ఆరెకటిక సంఘం సిపిఎం ఆధ్వర్యంలో శనివారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ముందు ధర్నా నిర్వహించింది, అనంతరం ప్రతినిధి బృందం జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంభర్తిని కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు. అధికారుల నుండి వివరాలు తెప్పించుకొని వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ... గౌలిపుర మున్సిపల్ కబేలా పాత నగరంలో అత్యంత పురాతనమైనదని, గత 70 ఏళ్లకు పైగా కొనసాగుతుందన్నారు. 1955 నుండి పహాని, రెవెన్యూ రికార్డులలో 4.22 ఎకరాల స్థలంలో కబేలా ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని, గత అనేక ఏళ్లుగా కొందరు కబ్జాదారులు కబేళాను ఆక్రమించే ప్రయత్నాలు చేసి ఓడిపోయారని, 2010లో హైదరాబాద్ కలెక్టర్ నవీన్ మిట్టల్ కబ్జాదారులకు అనుకూలంగా 4.22 ఎకరాల కబేల స్థలాన్ని మ్యుటేషన్ చేశారని పేర్కొన్నారు. తదనంతరం వచ్చిన కలెక్టర్ నటరాజన్ గుల్జార్ అక్రమ మ్యుటేషన్‌ను సవాల్ చేసినప్పటికీ న్యాయవివాదాల్లో చిక్కుకుందన్నారు. పాత నగరానికి మాంసం అందించే ఈ కబేల వివాదాల కారణంగా మూతబడడంతో దీనిపై ఆధారపడి ఉపాధి పొందుతున్న వందలాది ఆరెకటిక, యాదవ, దళిత కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. మున్సిపల్ కబేలాను కబ్జాల నుండి కాపాడడానికి జిహెచ్ఎంసి వివిధ కోర్టులో ప్రయత్నించినప్పటికీ గత ఏడాది కొందరు జిహెచ్ఎంసి అధికారులు కుట్రపూరితంగా కబ్జాదారుల కనుకూలంగా హైకోర్టులో అఫిడవుట్ వేయడంతో కోర్టు కబ్జాదారులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరించిన జిహెచ్ఎంసి అధికారులను, స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్‌ను తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 1961లో జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ తీర్మానం చేసి గౌలిపుర కబేల ప్రాంతంలోనే మూడు ఎకరాల స్థలం కొనుగోలు చేశారని, ఈ మూడు ఎకరాల స్థలం ఎటుపోయిందో అధికారులు తేల్చలేకపోతు న్నారని, తక్షణమే ఈ స్థలాన్ని గుర్తించి కబేళాకు కేటాయించాలని ఆయన కోరారు. కొద్దిపాటి స్థలంలో కొనసాగుతున్న కబేలాను 8 కోట్లు ఖర్చుపెట్టి ఆధునీకరణ చేశారని, కానీ వాటర్, కరెంట్, డ్రైనేజీ సౌకర్యాలు లేకపోవడంతో నిరుపయోగంగా మారిందన్నారు. ఈ ధర్నాలో ఆరెకటిక సంఘం అధ్యక్షులు యశ్వంతరావు, ప్రధాన కార్యదర్శి రమేష్, స్లాటర్ హౌస్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివకుమార్, సిపిఎం యాకుత్ పురా జోన్ కార్యదర్శి ఎం.బాలు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర కాప్రా : నూతన సంవత్సరం,2025 సీనియర్ సిటిజన్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి నాచారం ఎస్‌విబిఎస్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకులు రాగిరి మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నాచారం సీనియర్ సిటిజన్స్ క్యాలెం డర్ ప్రచురిస్తున్నారని చెప్పారు. ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, పోగుల వెంకటరమణారెడ్డి, సీనియర్ సిటిజన్స్ సభ్యులు ఎంవి ప్రేమ్ కుమార్, అధ్యక్షుడు పడాలసాయి బాబా, ప్రధాన కార్యదర్శి వి నాగేశ్వరరావు, ఆర్ మల్లేష్, జి యాదగిరి, ఎల్ సత్యనారాయణ, పోచయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది డిమాండ్లు పరిష్కరించాలి

విశాలాంధ్ర- అమనగల్లు : అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా, అమలుకు సాధ్యం కానీ అనేక హామీలతో ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ ప్రజానీకాన్ని, ఉద్యోగస్తులను మోసం చేసిందని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నరసింహ్మా రెడ్డి అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక ఉపాధి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల నిరసన సమ్మెకు మద్దతు తెలిపి, గ్రామపంచాయతీ సిబ్బంది డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది డిమాండ్ చేస్తున్న రూ.18,500 కనీస వేతనం ఇస్తూ పర్మినెంట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సిబ్బంది ప్రతి ఒక్కరికి రూ.5,00,000 వైద్య భీమా కల్పించాలని, ప్రతినెల సరైన సమయంలో జీతాలు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ మంగళ్ పల్లి నరసింహ, బీఆర్ఎస్ యూత్ వింగ్ పట్టణ అధ్యక్షుడు కొ ప్పు కృష్ణ, వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు మాధవులు, మాజీ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు క్యామ వెంకటేష్, రాయికంటి సురేష్, సిద్ది గారి సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఫ్యాన్ల వితరణ

విశాలాంధ్ర - ఆమనగల్లు : తలకొండపల్లి మండల పరిధిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మల్టిపుల్ ఎల్సిఐఎఫ్ ఏరియా లీడర్ లయన్ సందడి నరేందర్ రెడ్డి రూ .25వేల విలువగల పది ఫ్యాన్‌లను ఉన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ కండే ఓంకారం అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు లైన్స్ క్లబ్ఆఫ్ ఆమనగల్లు ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులని విద్యార్థులకు, పాఠశాలలకు మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో లయన్స్ క్లబ్ ఆమనగల్లు ఎప్పుడు ముందంజలో ఉంటుందన్నారు. గతంలో లయన్స్ క్లబ్ సభ్యులు మోహన్ రెడ్డి ఈ పాఠశాలకు రూ .50,000 విరాళం అందజేసినట్లు ఆయన తెలిపారు. లైన్స్ క్లబ్ ఆమనగల్ వారి ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయిలో పాఠశాలకు వాటర్ ట్యాంకులు, బెంచీలు, అందజేసినట్లు జిల్లా చైర్మన్ కండె ఓంకారం తెలిపారు. ఉన్నత పాఠశాలకు 10 ఫ్యాన్స్ అందజేసినట్లు క్లబ్ పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ సభ్యులు డి. మోహన్ రెడ్డి, పండగ అంజయ్య, శ్రీనివాస్ రెడ్డి, క్లబ్ పిఆర్వో పాషా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఝాన్సీ లక్ష్మి, ఉపాధ్యాయులు క్రాంతి కుమార్, రాజేశ్వర్ రెడ్డి, కబీర్, పాండు, కృష్ణ, సుష్మ పాల్గొన్నారు.

వడ్డెరుల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : వడ్డెరుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని వడ్డెర సంఘం మేడ్చెల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు మురళి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం అఖిల భారత వడ్డెర సంఘం ప్రధాన కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ బోదస్ శ్రీనివాస్ సమక్షంలో మేడ్చెల్-మల్కాజిగిరి జిల్లా వడ్డెర యువజన అధ్యక్షుడుగా వడ్డే మురళిని నియమించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ.. తనను గుర్తించి జిల్లా అధ్యక్షుడిగా నియమించడం సువర్ణ అవకాశంలా భావిస్తున్నానని, తప్పకుండా వడ్డెర కులం యొక్క అభివృద్ధి కొరకు కృషి చేస్తానన్నారు. సంఘం ఆదేశాలతో భవిష్యత్‌లో నిర్వహించే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని ఎల్లపుడు అందుబాటులో ఉంటూ కులస్తులకు తోడుగా నిలుస్తానని హామీ యిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర కమిటీ నాయకులు వేముల తిరుమల దేవి, కుచవు రాము, గోపాల్, మంజుల, రమేష్, హనయ్య, వెంకటేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : బీజేపీ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం జెకె శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ నివాసం వద్ద, కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 126 డివిజన్ జగద్గిరి నగర్ బస్తీ అధ్యక్షుడు జగన్ యాదవ్ బీఆర్ఎస్ పార్టీనుండి, బీజేపీ పార్టీలో చేరారు. ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శి ముత్యాలు,ఉపాధ్యక్షులు యాదిగిరి రాజు, కోశాధికారి బిక్షపతి, కమిటీ సభ్యులు సుధాకర్, రవి రాజు, రమేష్,జగదీష్, శ్రీధర్ దితరులకు మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మేడ్చెల్ జిల్లా ఇంచార్జ్ అధ్యక్షులు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్ రెడ్డి, జిల్లా స్పోక్స్ పర్సన్ సురేష్ రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షులు గండి రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు టీకాలు వేయించాలి : కమిషనర్

విశాలాంధ్ర-దుండిగల్: ప్రతి వీధి కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు తప్పనిసరిగా వేయించాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రావు పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ పరిధిలోని శనివారం మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రావు బ్లూ క్రాస్ సొసైటీ సిబ్బంది సహకారంతో దుండిగల్ వార్డు నందు పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమాని నిర్వహించారు.ఈ సందర్బంగా వివిధ వార్డ్ ల పరిధిలోనీ 229 వీధి కుక్కలకు, పెంపుడు కుక్కలకు ఉచితంగా వ్యాక్సినేషన్ పంపిణీ చేశారు.అదేవిధంగా కమిషనర్ సత్యనారాయణ 28 వీధి కుక్కలను తీసుకొని స్టెరిలైజేషన్ కు పంపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్

కమిషనర్ సత్యనారాయణ రావు, మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ ప్రభాకర్, వెటర్నరీ డాక్టర్ శైలజ, సానిటరీ ఇన్స్పెక్టర్ రామచందర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

4,5 తేదీల్లో క్రీడా పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర శేరిలింగంపల్లి : గచ్చిబౌలి స్టేడియంలో జాతీయ మాస్టర్స్ అథ్లెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర మాస్టర్స్ క్రీడ పోటీలు జనవరి 4,5న నిర్వహించనున్నట్లు మాస్టర్స్ అధ్యక్షుడు మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కొండ విజయ్ కుమార్‌లు తెలిపారు. శనివారం గచ్చిబౌలిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు మాట్లాడుతూ మాస్టర్స్ అథ్లెట్ పోటీలతో సీనియర్ సిటిజన్స్ 30 సంవత్సరాలు నుండి 100 సంవత్సరాల గల వారు క్రీడల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశం వుంటుందని లక్ష్మణ్‌రెడ్డి, కొండ విజయ్‌లు తెలిపారు. క్రీడ టోర్నమెంట్ సుమారు 1000 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. రెండు రోజుల నిర్వహించే పోటీల్లో పాల్గొనేవారికి నిర్వాహకులు సదుపా యాలు ఏర్పాటు చేయనున్నారు. రన్నింగ్, త్రో, వాకింగ్, జంపింగ్స్ ఇతర క్రీడలు నిర్వహించనున్నారు. రాష్ట్ర పోటీల్లో ప్రతిభ చూపి మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారు జనవరి చివరివారం లో కేరళ

రాష్ట్రంలో నిర్వహించే జాతీయ పోటీల్లో రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పద్మ దేవేందర్ రెడ్డి, ప్రభు, రంగా రెడ్డి జిల్లా ప్రతినిధులు నూనె సురేందర్, స్వాతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై చర్చా

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఎం-బి 8వ యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో తెలంగాణ రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించి యునైటెడ్ నేషన్స్ న్యూయార్క్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్బంగా శనివారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఐఐఈసి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్‌తో మర్యాద పూర్వకంగా టాస్క్ సిఈఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ భేటీలో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనే ధ్యేయంగా కల్వకుర్తి పట్టణంలో తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోతున్న స్కిల్ సెంటర్‌కు సంబంధించిన అంశాలతోపాటు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన తదితర అంశాల గురించి చర్చించడం జరిగిందని రాఘవేందర్ రెడ్డి తెలిపారు..

కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

విశాలాంధ్ర, మేడిపల్లి: తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ పీర్జాదిగూడ మున్సిపల్ కార్మికుల సర్వ సభ్య సమావేశం శనివారం లొట్టి ఈశ్వర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి మున్సిపల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే. రవిచంద్రన్. కార్మికుల ఉద్దేశించి ప్రసంగిస్తూ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని కార్మికుల అందర్నీ తక్షణమే ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని ప్రమాదంలో చనిపోయిన కార్మిక కుటుంబానికి రూ.25 లక్షలు ఇవ్వాలని మరణించిన కార్మికులకు అంత్యక్రియల ఖర్చు రూ.30 వేలు ఇవ్వాలని మున్సిపల్ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని స్థలం ఉన్నవారికి ఐదు లక్షలు ఇల్లు నిర్మించుకోవడానికి ఇవ్వాలని కార్మికులకు పనిముట్లు, బట్టలు చెప్పులు.నూనె.కుట్టుకూలు ఇవ్వాలని.పండు గా సెలవులు .సీఎలు. తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

అనంతరం పీర్జాదిగూడమున్సిపల్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా లొట్టి ఈశ్వర్ అధ్యక్షులుగా ఆర్.ఎల్లమ్మ. కార్యనిర్వక అధ్యక్షులుగా జి పాపమ్మ. ఉపాధ్యక్షులుగా ఎస్ మమత.యు బిక్షపతి కార్యదర్శిగా ఎం మహేశ్వరి. వి లక్ష్మి. అమరేందర్ రెడ్డి ఆర్. గీత, కోశాధికారిగా బి. యాదమ్మ ఆర్గనైజింగ్ సెక్రటరీతోపాటు కే శ్రీకాంత్, కే. మాధవి ఎస్. లావణ్య ఎం. శ్రావణి. కె.కల్పన తోపాటు కార్మికులు పాల్గొన్నారు.

హైదరాబాద్ నుంచి దిల్లీకి పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-బషీర్ బాగ్: బై ది పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేక్ అప్ డెమోక్రసీ మూమెంట్ పేరిట హైదరాబాద్ నుండి ఢిల్లీ వరకు పాదయాత్ర కు సంబందించిన పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య , మాజీ లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ రెడ్డి , ఏపీ మాజీ చీఫ్ సెక్రెటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం , టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, ఫౌండేషన్ ఫౌండర్ గణేష్ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు.జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా హైదరాబాద్ నుండి పాదయాత్ర ప్రారంభం కానున్నట్లు ఫౌండర్ గణేష్ వెల్లడించారు.నాలుగు డిమాండ్ లతో ప్రజాస్వామ్యానికి అవసరమైన సంస్కరణలను పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లాలని ఈ పాదయాత్ర

ఉద్దేశ్యం అని తెలిపారు.ఒక రాజకీయ నాయకుడికి ఒక్క పెన్షన్ మాత్రమే ఉండాలని ... ఎంపీ , ఎమ్మెల్యేలకు రెండు పెన్షన్లు ఉండకూడదన్నారు. ఒక నాయకుడు మరొక పార్టీలో చేరే ముందు తన పదవికి రాజీనామా చేయాలన్నారు. ఒక అభ్యర్థి ఒక్క నియోజకవర్గం నుండి మాత్రమే ఎలక్షన్లలో పోటీ చేయాలన్నారు.ఒక పదవిలో ఉన్న రాజకీయ నాయకుడు మరొక స్థానానికి పోటీ చేయకూడదని, ఈ డిమాండ్ లపై పార్లమెంట్ వరకు పాదయాత్ర చేపడుతున్న గణేష్ సంపూర్ణ మద్దతును మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య , మాజీ లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ రెడ్డి , ఏపీ మాజీ చీఫ్ సెక్రెటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం , టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీలు ప్రకటించారు.

లక్షల మందిని ఆత్మ జ్ఞానులుగా మార్చిన పత్రీజీ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అమనగల్లు : బోధన్ షక్కర్ నగర్‌లో పుట్టిన పత్రీజీ అందరిలో ఒకడిగా, మైత్రేయ బుద్ధుడిగా, సామాన్యుడిగా ఉంటూనే లక్షల మందికి ఆత్మ జ్ఞానాన్ని బోధించారని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు కడ్తాల్ కైలాసపురిలో నిర్వహిస్తున్న పత్రీజీ ధ్యాన మహాయాగంలో ఎమ్మెల్యే హాజరై ప్రసంగించారు. యోగా, వేదపఠనం, సంగీత నాద ధ్యానం కార్యక్రమాలు ధ్యానులను విశేషంగా అలరించాయి. యోగా నిపుణులు వెంకటేశ్ యోగా ఆసనాలు, ప్రాణాయణం, ముద్రలు గురించి వివరించి ధ్యానులకు యోగా, ధ్యానంపై చక్కటి అవగాహన కల్పిస్తున్నారు. అలాగే చైతన్య, మాస్టర్ తేజాలు అద్భుతంగా వేదపఠనం చేసి ధ్యానులకు చక్కటి వేద జ్ఞానాన్ని అందిస్తున్నారు. మరోవైపు సంగీత నాద ధ్యానం కార్యక్రమం ధ్యానులను విశేషంగా అలరిస్తుంది. మనకు శరీరంతో పాటు ఆత్మ కూడా ఉందని ధ్యానం చేసి ప్రతి ఒక్కరు అనుభవపూర్వకంగా తెలుసుకోవాలని పత్రీజీ కూతురు పరిణత పత్రీ పేర్కొన్నారు. బ్రహ్మర్షి పత్రీజీ వీడియో సందేశాన్ని అందరికి అర్థమయ్యే విధంగా వివరించారు. పత్రీజీ మధ్యే మార్గం గురించి అనునిత్యం సూచించారని, ఇంట్లోనే గురుకులం ఉండాలని, తల్లిదండ్రులే జ్ఞానవంతులు, సత్యం తెలిసినవారు. అయితే ఆ ఇళ్లు గురుకులంతో సమానమని తెలియజేసారని వివరించారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ లక్ష్మణ్ రావు పాల్గొని తన సందేశాన్ని ఇచ్చారు. ఈ భూమి మీద ఇప్పటివరకు ఏ గురువు కూడా తాను గురువును కాదు అని చెప్పలేదని. ఒక

బ్రహ్మర్షి పత్రీజీ మాత్రమే చెప్పారని గుర్తుచేసారు. దైవత్వం, మానవత్వం, రాక్షసత్వం మనలో ఉన్నాయని, హింసాను వీడితే మానవత్వం, ప్రేమతత్వం వల్ల దైవత్వం వస్తుందని చెప్పారు. మనకు ఏదీ ఇస్తే అది తిరుగి వస్తుందని అది ప్రకృతి ధర్మమని తెలియజేసారు. అనంతరం పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్ ఇంత అద్భుతంగా అభివృద్ధి చెందడంలో లక్ష్మణరావుది ముఖ్య ప్రాత వుందని కొనియాడారు. అనంతరం లక్ష్మణ్ రావును ఘనంగా సన్మానించారు. పిఎస్ఎస్ఎం నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు పెంచలయ్య, నెల్లూరు జిల్లా సీనియర్ పిరమిడ్ మాస్టర్ జేజే.నారాయణ, అనంతపురం జిల్లా సీనియర్ పిరమిడ్ మాస్టర్ రవిశంకర్, పీఎంసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్, ప్రకాశం జిల్లా సీనియర్ పిరమిడ్ మాస్టర్ సునీల్ పాల్గొని తమ సందేశాలు ఇచ్చారు. అనంతరం ఈ జిల్లాల పిరమిడ్ మాస్టర్లను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ట్రూత్ ఫర్ యూత్ అనే కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో సీనియర్ పిరమిడ్ మాస్టర్లు, మోటివేషనల్ స్పీకర్లు పాల్గొని తమ సందేశాల ద్వారా యువతలో మంచి స్ఫూర్తిని కలిగిస్తున్నారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. పిఎస్ఎస్ఎం అకాడమీకి చెందిన శివరామప్ప పాల్గొని ప్రసంగించారు. బ్రహ్మర్షి పత్రీజీ చిన్న చిన్న మాటలతో అద్భుతమైన సందేశాన్ని అందించారని తెలిపారు. మనమంత దివ్యస్వరూపాలమని, ఆత్మ స్వరూపాలమని తెలియజేసారు. ఇప్పుడు మానవులకు కావాల్సింది భౌతిక సంపద కాదని ఆధ్యాత్మిక సంపద కావాలని సూచించారు. విద్యావ్యవస్థను సంస్కరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం పిఎస్ఎస్ఎం అకాడమీ ద్వారా వెలుబడిన ఆధ్యాత్మిక పుస్తకాలను పరిణిత పత్రీ, శివరామప్పలు ఆవిష్కరించారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఖైరతాబాద్ బీసీ కమిషన్ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ సభ్యులు తమ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ సభ్యులు మాట్లాడుతూ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు అన్నారు. ఆయన చేసిన ఆర్థిక సంస్కరణలు దేశ ప్రగతికి బాటలు వేశాయని, ఆర్బీఐ గవర్నర్‌గా, ఆర్థిక సలహాదారుగా ఆర్థిక మంత్రిగా దేశాన్ని ఆర్థిక స్థిరత్వంవైపు నడిపించడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. తెలంగాణ ఏర్పాటుకు మద్దతు ఇవ్వడం, ఆయన హయాంలోనే రాష్ట్రం ఏర్పడడం జరిగిందన్నారు. బీసీలకు 27శాతం రిజర్వేషన్ ఇవ్వడంలో వారి పాత్ర మరువలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, డిప్యూటీ డైరెక్టర్ యు.శ్రీనివాస్ రావు, స్పెషల్ ఆఫీసర్ జి.సతీష్ కుమార్ మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

అర్యభట గణిత ఛాలెంజ్‌లో ఆరవ్

విశాలాంధ్ర శేరిలింగంపల్లి : తెల్లాపూర్‌లోని మంథన్ స్కూల్‌కు చెందిన ఆరవ్ టెన్త్ విద్యార్థి 'అర్యభట గణిత ఛాలెంజ్ 2024'లో సత్తా చాటారు. జాతీయ స్థాయి పోటీలో మొదటి, రెండువ దశలను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రతిష్ఠాత్మక మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నారు. విజయవాడ ప్రాంతం (సీబీఎస్ఈ) నుంచి టాప్ 100 మంది విద్యార్థులలో స్థానం సంపాదించారు. ఈ ఛాలెంజ్ దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో గణిత ప్రతిభను, విమర్శనాత్మక ఆలోచనలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించినది. గత ఏడాది దేశంలోని 5,050 పాఠశాలల నుంచి 5,50,000 పైగా విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. వీరిలో 8,590 మంది రెండో దశకు అర్హత సాధించారు. సీబీఎస్ఈ 18 రీజియన్స్ నుంచి 100 మంది విద్యార్థులు ఈ ప్రతిష్ఠాత్మక మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఆర్యభట్ట గణిత ఛాలెంజ్ 2024లో ప్రతిష్ఠాత్మక మెరిట్ సర్టిఫికెట్ పొందడం ద్వారా హైదరాబాద్‌లోని మంథన్ స్కూల్‌కు చెందిన ఆరవ్ అద్భుతమైన మైలురాయిని సాధించారు. ఆరవ్ జాతీయ స్థాయిలో రెండు దశలను విజయవంతంగా పూర్తి చేశారు. ఆరవ్ మాట్లాడుతూ నా విజయంలో ప్రధాన పాత్ర పోషించిన పాఠశాలకు కృతజ్ఞతలు తెలిపారు. మా టీచర్లు, ప్రిన్సిపాల్, స్నేహితుల సపోర్ట్, గైడెన్స్ లేకుండా ఈ విజయం సాధ్యమయ్యేది కాదన్నారు. ఈ విజయం సాధించడంలో వెన్నుదన్నుగా నిలిచి, నాలో నమ్మకాన్ని కలిగించిన కపిల్ సార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. మంథన్ స్కూల్ మ్యాథ్స్ సబ్జెక్ట్ లీడ్ ప్రియాంకా సేన్ మాట్లాడుతూ ఆర్యభట గణిత ఛాలెంజ్ వంటి పోటీలు విద్యార్థుల సమస్య పరిష్కార నైపుణ్యాలు, విమర్శాత్మక ఆలోచన, గణితంపై అభిరుచిని పెంపొందించడంలో సహకరిస్తాయని తెలిపారు. ఈ విజయం విద్యార్థులకు మాత్రమే కాకుండా అధ్యాపకులకు కూడా ప్రేరణ ఇస్తుందన్నారు. మా విద్యార్థులు తాము ఎంపిక చేసిన మార్గాల్లో విజయం సాధించేందుకు ఉన్న అవకాశాలు, మార్గదర్శకత్వాన్ని అందించడంలో నిబద్ధతతో ఉన్నామన్నారు.

వైద్య ఖర్చులకు హోప్ ఫౌండేషన్ చేయూత

విశాలాంధ్ర శేరిలింగంపల్లి : హోప్ ఫౌండేషన్ సేవలను మరింత విస్తృతం చేయాలని భారతీయ స్టేట్‌బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ భాస్కర్, రీజియన్ మేనేజర్ వెంకట్ నారాయణలు తెలిపారు. చందానగర్‌హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంకు అధికారులకు ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న లక్ష్మి అనే మహిళకు హోప్ ఫౌండేషన్ ద్వారా రూ. 20 వేల చెక్కును బ్యాంకు అధికారుల చేతుల మీదుగా బాధితురాలకు అందచేశారు. ఈ సందర్భంగా హోప్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ మాట్లాడుతూ తమ హోప్ ఫౌండేషన్ ద్వారా ఆపదలో ఉన్న వారికి సహాయం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం: లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి

విశాలాంధ్ర - అమనగల్లు : మహేశ్వరా మహా పిరమిడ్ ధ్యాన వేడుకలలో సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మి నర్సింహ్మా రెడ్డి ,ప్రవాస భారతీయుడు డాక్టర్ రాకేష్ రెడ్డి లట్టుపల్లిలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందొచ్చని అన్నారు. అదేవిధంగా అమెరికాలో స్థిరపడిన డాక్టర్ రాకేష్ రెడ్డి మాట్లాడుతూ వైద్యంతో నయంకాని మానసిక రుగ్మతలు ధ్యానం వలన పరిష్కరింపబడతాయని అన్నారు. వివిధ ప్రాంతాల నుండి మహేశ్వర మహా పిరమిడ్ కి విచ్చేసిన ధ్యాన ప్రియులకు వసతుల ఏర్పాటులో చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి మరియు ట్రస్ట్ సభ్యులు చూపుతున్న చొరవ వెలకట్టలేనిదని అన్నారు.పత్రీజీ కారణజన్ముడని, శాఖాహార జగత్ కొరకు వారు తలపెట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి మధుసూదన్ రెడ్డి, రామకృష్ణ,నరసింహ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చితాభస్మ రాజకీయం

- మాజీ ప్రధాని అంత్యక్రియలపై బీజేపీ-కాంగ్రెస్ మాటల యుద్ధం
- మన్మోహన్‌ను అవమానించారు: రాహుల్
- ఇది చెత్త రాజకీయం: బీజేపీ

న్యూదిల్లీ: మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ అంత్యక్రియలపై కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. శనివారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు జరగడానికి కొన్ని గంటల ముందు, ఆయన స్మారక చిహ్నంపై వివాదం ఏర్పడింది. మన్మోహన్‌కు స్మారక చిహ్నం నిర్మించాలని ప్రధాని మోదీని కాంగ్రెస్ కోరడంపై చర్చ మొదలైంది. మరోవైపు, సింగ్ స్మారక వివాదం మధ్య కాంగ్రెస్‌పై ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ట విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ స్పందిస్తూ 'మన్మోహన్ సింగ్ దహన సంస్కారాలు, ప్రపంచ స్థాయికి తగిన స్మారక చిహ్నం కోసం భారత ప్రభుత్వం ఎందుకు స్థలాన్ని కనుగొనలేకపోయిందో మన దేశ ప్రజలు అర్థం చేసుకోలేకపోతున్నారు' అని అన్నారు. అంత్యక్రియలు నిర్వహించే ప్రదేశంలోనే మన్మోహన్‌కు స్మారక చిహ్నం నిర్మించాలని ప్రధాని మోదీని కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖడ్గే లేఖ రాశారు. ఈ సందర్భంగా లేఖలో... రాజనీతిజ్ఞులు, మాజీ ప్రధానులకు అంతిమ సంస్కారాలు జరిగిన స్థలంలోనే వారి స్మారకాలను నిర్మించిన సంప్రదాయాన్ని ఖడ్గే గుర్తు చేశారు. భారత ప్రజల హృదయాల్లో మన్మోహన్ సింగ్ అత్యంత గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించారని, ఆయన సేవలు, సాధించిన విజయాలు అపూర్వమైనవి' అంటూ ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. అయితే, ఈ లేఖపై బీజేపీ తీవ్ర విమర్శలు చేసింది. 'స్మారకాలను నిర్మించే సంప్రదాయాల గురించి మోదీకి కాంగ్రెస్ లేఖ రాయడం విడ్డూరంగా ఉంది. 2004 నుంచి 2014 వరకు పదేళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ... పీవీకి స్మారకం నిర్మించలేదు. కానీ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015లో కేవలం ప్రధాని మోదీ ఆయనకు స్మారకం నిర్మించారు. 2024లో భారతరత్న ప్రకటించి సముచిత గౌరవం ఇచ్చారు' అని మండిపడ్డారు. అయితే మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు నిగమ్ బోధ్ ఘాట్‌లో శనివారం అధికారిక లాంఛనాలతో జరిగాయి.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలను నియమించబడిన స్మారక స్థలంలో కాకుండా నిగంబోధ్ ఘాట్‌లో నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శనివారం మండిపడ్డారు. 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో గాంధీ ఇలా అన్నారు... 'భారతమాత గొప్ప కుమారుడు, సిక్కు సమాజానికి మొదటి ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ జీ నిగంబోధ్ ఘాట్‌లో అతని అంత్యక్రియలు చేయడం ద్వారా ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా అవమానించింది' అని పేర్కొన్నారు. సింగ్ వారసత్వం గురించి కూడా రాహుల్ రాశారు. ఆయన విధానాలు భారతదేశాన్ని ఆర్థిక సూపర్ పవర్‌గా ఎదగడానికి, నిరుపేదలకు కీలక మద్దతు అందించిన నాయకుడిగా అభివర్ణించారు. సంప్రదాయానికి విరుద్ధంగా ఈ అంత్యక్రియలు జరిగాయని పేర్కొంటూ, 'ఇప్పటి వరకు, మాజీ ప్రధానులందరిని గౌరవిస్తూ, వారి అంతిమ సంస్కారాలు అధీకృత శ్మశాన వాటికలో నిర్వహించారు. తద్వారా ప్రతి వ్యక్తికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చివరి దర్శనం, నివాళులర్పించారు. డా.మన్మోహన్ సింగ్ మన అత్యున్నత గౌరవం, స్మారకానికి అర్హుడు. దేశం ఈ గొప్ప కుమారుడికి, అతని గర్వించదగిన సమాజానికి ప్రభుత్వం గౌరవం చూపించి ఉండాలి' అని రాహుల్ తెలిపారు. దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా నిగంబోధ్ ఘాట్‌లో సింగ్‌ను దహనం చేయాలనే నిర్ణయంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ 'సిక్కులకు చెందిన డాక్టర్ మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు కోసం బీజేపీ ప్రభుత్వం 1,000 గజాల స్థలాన్ని కూడా ఇవ్వలేకపోయింది' అని విమర్శించారు.

నా తండ్రి మరణించినప్పుడు మీరేం చేశారు...: శర్మిష్ఠా ముఖర్జీ

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియల విషయమై మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠా ముఖర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. తన తండ్రి చనిపోతే నివాళులర్పించడానికి కనీసం సీడబ్ల్యూసీ సమావేశం కూడా ఏర్పాటు చేయలేదని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆమె 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ 2020లో కన్నుమూశారు. ఆ సమయంలో ఆయనకు నివాళులర్పించేందుకు సీడబ్ల్యూసీ సమావేశం కూడా ఏర్పాటుచేయలేదని శర్మిష్ఠా పేర్కొన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ తనను తప్పుదోవ పట్టించిందని కూడా ఆరోపించారు. రాష్ట్రపతులకు ఆ సంప్రదాయం పాటించడం లేదని కాంగ్రెస్‌లోని ఓ సీనియర్ నేత తనకు చెప్పారన్నారు. అయితే తన తండ్రి డైరీని చదివితే అది నిజం కాదని తెలిసిందన్నారు. రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్‌కు నివాళులర్పించేందుకు సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించినట్లు అందులో ఉందని వెల్లడించారు. ఈ సందర్భంగా మన్మోహన్ సింగ్ మీడియా సలహాదారు సంజయ్ బారు రాసిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' అనే పుస్తకం గురించి ఆమె ప్రస్తావించారు. అందులో 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహా రావు స్మారక చిహ్నాన్ని నిర్మించలేదన్నారు. దీంతో పాటు ఆయన అంత్యక్రియలు దిల్లీలో కాకుండా స్వస్థలమైన హైదరాబాద్‌లో జరగాలని కాంగ్రెస్ కోరిన విషయం ఆ పుస్తకంలో ఉందన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలకు స్మారక చిహ్నం నిర్మించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే డిమాండ్ చేసిన నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే, డాక్టర్ సింగ్‌కు స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలనే ఆలోచనకు శర్మిష్ఠ మద్దతు ఇచ్చారు.

అయితే సింగ్ స్మారక చిహ్నం కోసం స్థలం కేటాయించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ప్రకటించింది. దహన సంస్కారాలు జరిగిన రోజు ఉదయం స్మారక చిహ్నం కోసం అభ్యర్థన అందిందని, నిర్మాణాన్ని కొనసాగించే ముందు 'ఒక ట్రస్టుకు స్థలం కేటాయించాలి' అని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

అన్నదాత ఉసురుతీసిన అప్పులు

- దిగుబడిరాక, మద్దతు ధర లేక తనువుచాలించిన రైతు కుటుంబం
- భార్యాబిడ్డలకు ఉరేసి... తానూ ఆత్మహత్య

విశాలాంధ్ర-పులివెందుల: అప్పుల బాధ తాళలేక ఓ రైతు భార్యాబిడ్డలకు ఉరేసి తానూ బలవన్మరణానికి పాల్పడిన హృదయవిధార సంఘటన వైయస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం దిద్దెకుంట గ్రామంలో చోటుచేసుకుంది. ఓ సాధారణ రైతు కుటుంబం ఒకేసారి తనువు చాలించడం గ్రామంలో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే... దిద్దెకుంటలో నాగేంద్ర అనే రైతు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్య వాణి, భార్గవ్, గాయత్రి అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. తనకున్న ఎకరన్నర పొలంతో పాటు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని చీని సాగు చేపట్టాడు. గత కొంత కాలంగా ప్రకృతి అనుకూలించకపోవడం, పంటలకు సరైన దిగుబడి రాకపోవడం, గిట్టుబాటు ధర లేకపోవడం వంటి కారణాలు ఆ రైతును అప్పుల్లోకి నెట్టేశాయి. కాలం గడిచే కొద్దీ అప్పుల భారం అధికమైంది. ఓవైపు అప్పులిచ్చిన వారి ఒత్తిళ్లు ... మరోవైపు అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన నాగేంద్ర ఆత్మహత్యే శరణ్యమని భావించాడు. ఈ క్రమంలో శుక్రవారం భార్యాభర్తలు ముద్దనూరు వెళ్లి తాడు కొనుగోలు చేశారు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో భార్య వాణిని మోటార్ బైక్‌పై తోట వద్దకు తీసుకెళ్లి ఉరేశాడు. ఆ తరువాత కుమార్తె గాయత్రి, కుమారుడు భార్గవ్‌లను ఒకరి తరువాత ఒకరిని తీసుకెళ్లి ఉరేసి చంపేశాడు. అనంతరం తానూ ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తోట వద్దకు వెళ్లిన కుటుంబం ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో నాగేంద్ర తల్లికి అనుమానం వచ్చింది. ఈ విషయాన్ని ఇరుగుపొరుగు వారికి చెప్పడంతో తోట వద్దకు వెళ్లడాన్ని గమనించిన కొందరు అక్కడకు వెళ్లారు. కుటుంబమంతా విగతజీవులై ఉండటాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ ఘటనా స్థలానికి చేరుకొని మృతిపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి మృతికి గల కారణాలపై విచారిస్తామని డీఎస్పీ తెలిపారు.

బెంబేలెత్తిస్తున్న సైబర్ నేరాలు

2024లో క్రైం వివరాలు వెల్లడించిన డీజీపీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్‌లో ఈ సంవత్సరం సైబర్ నేరాల సంఖ్య పెరిగిందని... ప్రజలకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని డీజీపీ ద్వారకా తిరుమల రావు తెలిపారు. శనివారం డీజీపీ కార్యాలయంలో ఈ ఏడాది వార్షిక నేర నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఈ ఏడాది క్రైమ్ రేట్ ఓవరాల్‌గా 5.2 శాతం తగ్గిందని, అయితే సైబర్ క్రైమ్ రేట్ మాత్రం కొంత పెరిగిందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి ఈ ఏడాది పెద్దపీట వేశామన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది సైబర్ క్రైమ్‌కు సంబంధించి 916 కేసులు నమోదు కాగా, సుమారు రూ.1,229 కోట్ల మేర నగదును సైబర్ నేరగాళ్లు కాజేశారని వివరించారు. డిజిటల్ అరెస్టు అనేది లేదని, అలాంటి కాల్స్‌ను ప్రజలు నమ్మవద్దని అన్నారు. డిజిటల్ అరెస్టులపై ఎవరు ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. అలాంటి కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లు ఉన్నాయన్నారు. కొత్తగా ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టామని... గంజాయి రహిత ఏపీ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. 10,837 ఎకరాల్లో గంజాయికి మారు పంటలు కూడా వేయించామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఫింగర్ ప్రింట్స్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ ఏర్పాటు చేశామన్నారు. నేరం చేసిన ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని నేరస్తులకు డీజీపీ వార్నింగ్ ఇచ్చారు. ప్రాపర్టీ అఫెన్స్‌లో గత సంవత్సరం కంటే క్రైమ్ రేటు స్వల్పంగా పెరిగిందన్నారు. పోలీసులు తీసుకున్న చర్యలతో రోడ్డు ప్రమాదాలు కూడా కొంత మేర తగ్గాయని తెలిపారు.

రాజ్యాంగ రచనలో తెలుగువారి పాత్ర అమోఘం

అసెంబ్లీ కేలండర్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజ్యాంగ రచనలో తెలుగువారి పాత్ర చిరస్మరణీయమని సీఎం చంద్రబాబు కొనియాడారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆనాటి రాజ్యాంగ రచనలో భాగస్వామ్యులైన తెలుగు ప్రముఖులను స్మరించుకునేలా 2025వ సంవత్సరానికి గాను శాసనసభ అధ్వర్యంలో రూపొందించిన నూతన కేలండర్‌ను, డైరీని ముఖ్యమంత్రి శనివారం ఉండవల్లిలోని నివాసంలో ఆవిష్కరించారు. కేలండర్‌లో ప్రచురించిన ఒక్కో ప్రముఖుడి గొప్పతనాన్ని ముఖ్యమంత్రి ఈ కార్యక్రమంలో మరోసారి గుర్తుచేశారు. 'సైమన్ గో బ్యాక్' అంటూ తెల్లదొరలను ఎదిరించి స్వాతంత్ర్యోద్యమంలో తెగువ చూపిన తెలుగు ధీరుడు టంగుటూరి ప్రకాశం పంతులు రాజ్యాంగ రచనలోనూ అంతే చొరవ కనబరిచారని తెలిపారు. టంగుటూరి రాజ్యాంగంలోని ప్రధానమైన స్థానిక సంస్థలు, గవర్నర్ విచక్షణ అధికారాలు వంటి అంశాలను రూపొందించడంలో సహాయసహకారాలు అందించారని కొనియాడారు. అలాగే భోగరాజు పట్టాభి సీతారామయ్య రాజ్యాంగ సభ సంప్రదింపుల కమిటీలో సభ్యుడిగా సేవలు అందించారని, దిల్లీలో పరిపాలన, శాసనసభ వ్యవస్థపై సిఫార్సులు చేసిన కేంద్రపాలిత ప్రాంతాల కమిటీకి నేతృత్వం వహించారని చెప్పారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ జాతీయ భాష, న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యం, మానవ అక్రమ రవాణాపై చేసిన కీలక సూచనలను రాజ్యాంగ సభ ఆమోదించిందన్నారు. మోటూరి సత్యనారాయణ జాతీయ భాష గురించి విలువైన సలహాలిచ్చారని, మరో ప్రముఖుడు గోగినేని రంగనాయకులు (ఎన్జీ రంగా) రాజ్యాంగంలో అధికార వికేంద్రీకరణ, అత్యవసర అధికారాలు, రెండు సభలు, ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుపై అనేక సూచనలు చేశారని ముఖ్యమంత్రి వివరించారు. భూ సేకరణకు నష్ట పరిహారం చెల్లించేలా నిబంధన తీసుకురావడంతో పాటు పాఠశాలలు, దేవాలయాల్లో ఎక్కడా వివక్ష ఉండకూడదని మతం, జాతి, కులం, లింగం ఆధారంగా నిరాదరణ చూపించకుండా నిబంధన రూపొందించాలని వీసీ కేసవరావు రాజ్యాంగ సభలో ప్రతిపాదించారని వివరించారు. డ్రాఫ్టింగ్ కమిటీ, అడ్వైజరీ కమిటీ, ప్రాథమిక హక్కులపై సబ్ కమిటీతో సహా తొమ్మిది కమిటీలలో అల్లాడి కృష్ణస్వామి భాగస్వామిగా ఉన్నారని, పౌరసత్వం, ప్రాథమిక హక్కులు, ఎమర్జెన్సీ నిబంధనలపై రాజ్యాంగ సభలో జరిగిన చర్చల్లో చురుగ్గా పాల్గొన్నారని ముఖ్యమంత్రి చెప్పారు. రాజ్యాంగంలో మహాత్మా గాంధీ ఆలోచనలు ప్రతిబింబించేలా మొసలికంటి తిరుమలరావు కృషి చేస్తే... ఆస్తి హక్కు, జమీందారీ వ్యవస్థ రద్దు గురించిన చర్చలో కళా వెంకటరావు ప్రముఖంగా పాల్గొన్నారని తెలిపారు. అలాగే నీలం సంజీవరెడ్డి, కల్లూరు సుబ్బారావు, రాజా శ్వేతా చలపతి రామకృష్ణరంగారావు రాజ్యాంగ రూపకల్పనలో అందించిన సహకారాన్ని మరువలేమని, భారత రాజ్యాంగాన్ని రూపొందించడానికి బాధ్యత వహించిన నాయకులను, దార్శనికులను స్మరించుకోవడం సంతోషంగా ఉందని చంద్రబాబు అన్నారు.

సామాజిక మాధ్యమాల్లో శాసన వ్యవస్థ సమాచారం

ఆంధ్ర ప్రదేశ్ శాసన వ్యవస్థ కోసం తొలిసారి ప్రవేశపెట్టిన సామాజిక మాధ్యమ ఖాతాలను కూడా సీఎం ప్రారంభించారు. సభా కార్యకలాపాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని చంద్రబాబు అన్నారు. సవాళ్లను స్వీకరించి, శాసన వ్యవస్థ చేపట్టిన వినూత్న ప్రయత్నాలకు మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందిస్తున్న స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ కె.రఘు రామకృష్ణ రాజును ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

నితీశ్ రికార్డు

- ఆస్ట్రేలియా గడ్డపై శతకంతో అదరగొట్టిన తెలుగు తేజం
- అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్

మెల్బోర్న్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ (2024-25)లో ఆంధ్రా కుర్రాడు నితీశ్ కుమార్ మెల్‌బోర్న్ టెస్టులో మెరుపులు మెరిపించాడు. ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన తొలి భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. క్లిష్ట సమయాల్లో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. బాక్సింగ్ డే టెస్టులో ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి నితీశ్ (105 నాటౌట్... 176 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్) శతకం బాదేశాడు. దీంతో టీమిండియా ఫాలో ఆన్ గండం నుంచి గట్టెక్కింది. నితీశ్ కంటే ముందు విదేశీ బ్యాటర్లలో మైకేల్ వాన్ (2022-03), క్రిస్ గేల్ (2009-10) ఈ ఘనత సాధించారు. ఆస్ట్రేలియా గడ్డపై 8వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఇంతకుముందు స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే (87) పేరిట ఈ రికార్డు ఉండేది. నితీశ్‌కుమార్ రెడ్డి ఆల్‌రౌండర్‌గా జట్టులోకి వచ్చి... టెస్టు కెరీర్‌లో 171 బంతుల్లో తొలి శతకం సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లకు చెమటలు పట్టించాడు. నితీశ్ సెంచరీ పూర్తయ్యాక బ్యాడ్‌లైటింగ్ కారణంగా ఆట నిలిచింది. అప్పటికి భారత్ స్కోరు 358/9. క్రీజ్‌లో నితీశ్ 105, సిరాజ్ 2 పరుగులతో ఉన్నారు. భారత్ 116 పరుగులు వెనకబడి ఉంది. వర్షం కారణంగా ఆటను నిలిపేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో మూడో రోజు ఆట ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 474 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

ఈ సెంచరీ గుర్తుండిపోతుంది: వాషింగ్టన్ సుందర్

మెల్‌బోర్న్‌లో నితీశ్ సెంచరీ ఎప్పటికీ గుర్తుండిపోతుందని భారత స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ అన్నారు. నితీశ్‌తోపాటు సుందర్ 162 బంతుల్లో 50 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడారు. తొమ్మిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన సుందర్... నితీశ్‌తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 127 పరుగులు భాగస్వామ్యం నెలకొల్పారు.

విద్యుత్ కేంద్రాల ప్రైవేటీకరణ ఆపాలి

- కేంద్ర కార్మిక సంఘాల డిమాండ్
- ఉద్యోగులపై ఎస్మా ప్రయోగానికి ఖండన

న్యూదిల్లీ: దేశంలోని విద్యుత్ కేంద్రాలను ప్రైవేటుకు దారాదత్తం చేసేందుకు ఉత్తరప్రదేశ్‌లోని డబుల్ ఇంజిన్ సర్కార్ తొందరపడుతోందని కేంద్ర కార్మిక సంఘాలు విమర్శించాయి. ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశాయి. ఇదే డిమాండ్‌తో నిరసన బాట పట్టిన ఉద్యోగులపై ఎస్మా ప్రయోగాన్ని ఖండించాయి. వాస్తవ పరిస్థితుల నుంచి దృష్టి మళ్లించేందుకు ఎస్మాను పాలకులు వాడుకుంటున్నట్లు కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక దుయ్యబట్టింది. యూపీ, చండీగఢ్ విద్యుత్ ఉద్యోగులపై ఎస్మా ప్రయోగాన్ని, డిస్కమ్‌ల ప్రైవేటీకరణకు చర్యలను ఖండిస్తూ ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్‌ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ శనివారం సంయుక్త ప్రకటన చేశాయి. ఉత్తరప్రదేశ్, చండీగఢ్‌లో జెన్‌కోతో పాటు రాజస్థాన్‌లో తాజా చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశాయి. విద్యుత్ కేంద్రాలు, డిస్కమ్‌ల ప్రైవేటీకరణకు ఉత్తరప్రదేశ్‌తో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏకపక్ష చర్యలను ఆక్షేపించాయి. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి, విద్యుత్ ఉద్యోగులకు మధ్య 2018 ఏప్రిల్ 5, 2020 అక్టోబరు 6న జరిగిన ఒప్పందాలకు విరుద్ధంగా ఉద్యోగులతో సంప్రదింపులు జరపకుండా ప్రైవేటీకరణకు చర్యలు తీసుకోవడాన్ని కార్మిక సంఘాలు ఖండించాయి. ప్రైవేటీకరణ కోసం ఏకపక్ష నిర్ణయాల గురించి తెలిసి ఉద్యమించిన ఉద్యోగులపై ఎస్మా ప్రయోగాన్ని ఆక్షేపించాయి. ఒడిశా, జమ్మూకశ్మీర్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బీహార్ తదితర రాష్ట్రాల్లోనూ విద్యుత్ సరఫరాను ప్రైవేటుకు అప్పగించే విఫల ప్రయత్నాలు జరిగాయని, నియంత్రణ సంస్థల జోక్యంతో రాష్ట్ర సంఘాలే సరఫరా బాధ్యతలను చేపట్టాయని గుర్తుచేశాయి. రాష్ట్ర డిస్కమ్‌ల ఆస్తులను ప్రైవేటుకు దారాదత్తం చేస్తున్నారని పాలకుల తీరును విమర్శించాయి. ఏడాదికి ఒక్క రూపాయి అద్దెకు భూములివ్వడం ఏమిటని ప్రశ్నించాయి. ఉత్తరప్రదేశ్‌లో రాష్ట్ర సంస్థలు యూనిట్ విద్యుత్‌ను రూ.5.55కు కొనుగోలు చేసి ప్రైవేటు సంస్థలకు రూ.4.36కు విక్రయిస్తున్నాయని, ఆపై వినియోగదారులకు రూ.7.98కు యూనిట్ విద్యుత్ లభిస్తోందని కేంద్ర కార్మిక సంఘాలు పేర్కొన్నాయి. దీనిని ఎలా సమర్థిస్తారని పాలకులను ప్రశ్నించాయి. వాస్తవాలను కప్పిపుచ్చేందుకు ఎస్మా ప్రయోగిస్తున్నారని దుయ్యబట్టాయి. కాగా, ఈనెల 31న మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు విధులు బహిష్కరించడం ద్వారా ప్రభుత్వ విధానాలను నిరసించాలని ఉద్యోగులకు ఎన్‌సీసీఓఈఈఈ (ది నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజినీర్స్) పిలుపునిచ్చింది. ఆ రోజు చండీగఢ్, ఉత్తరప్రదేశ్ ఉద్యోగులకు సంఘీభావంగా దేశంలోని 27 లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు వీధుల్లోకి వచ్చి నిరసన తెలుపుతారు.

హేతువాదం, మానవవాదం ద్వారానే శాంతి, ఐక్యత, సమానత్వం

ఫిరా జాతీయ సమ్మేళనంలో వీరమణి

తిరుచ్చి (తమిళనాడు): హేతువాద దృక్పథం, మానవవాదం ద్వారానే ప్రజల మధ్య శాంతి, ఐక్యత, సమానత్వం సాధ్యమని పెరియార్ ఉద్యమ వారసులు, హేతువాద ఉద్యమ ప్రముఖులు కే వీరమణి స్పష్టం చేశారు. భారత నాస్తిక, హేతువాద సంఘాల సమాఖ్య (ఫిరా-13) జాతీయ సమ్మేళనం తమిళనాడులోని తిరుచిరాపల్లిలో పెరియార్ శతాబ్ది విద్యాసంస్థల ప్రాంగణంలో శనివారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీరమణి మాట్లాడుతూ... బీజేపీ పాలన... ఒకే దేశం, ఒకే మతం, ఒకే భాష పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తుందని విమర్శించారు. భారత దేశంలో

హేతువాద ఉద్యమాన్ని నడిపించిన పెరియార్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. లౌకిక రాజ్యాంగ హక్కుల్ని కాలరాస్తూ, దేశంలో ప్రధానంగా వీర శైవం, వైష్ణం అనే రెండు వర్గాల చేతుల్లో ఉందని జై శ్రీరాం జై హనుమాన్, శివాయ అంటూ స్మరించని వాళ్లు ఈ దేశంలో ఉండకూడదని, ఎవరు ఏ ఆహారం తినాలి, ఏ భాష మాట్లాడాలి, విద్యా సంస్థల్లో పురాణాలు, జ్యోతిష్యం బోధించాలని ఆర్ఎస్ఎస్ నిర్ణయిస్తుందని ధ్వజమెత్తారు. నిత్యం అంబేద్కర్ ను కాకుండా దైవాన్ని స్మరిస్తే ఏడు జన్మల పుణ్యం వస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పడం విచారకరమన్నారు. హేతువాద భావజాలం వ్యాప్తికి యువతరం ముందుకు రావాలన్నారు. ఫిరా జాతీయ అధ్యక్షుడు నరేంద్ర నాయక్, ప్రధాన కార్యదర్శి సుదేష్ గోడేరావు మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాల నిర్మూలన, శాస్త్రీయ దృక్పథం కల్పించే బాధ్యతపై రాజ్యాంగంలో ఆర్టికల్ 51ఏ (హెచ్) లో పొందుపరించడం జరిగిందని, దాన్ని కాలరాస్తూ ప్రశ్నించే గొంతుకలు, హేతువాదులు, జర్నలిస్టులపై అక్రమ నిర్బంధం హత్యలు జరగడం బాధాకరం అన్నారు. ఆరోగ్యానికి ఆవు పేడ, మూత్రం వినియోగించాలంటూ, సాంకేతిక విజ్ఞానం జనరల్ సైన్స్ ద్వారా శాటిలైట్ లు ప్రయోగిస్తూ వాటి ప్రయోగ సమయంలో పూజలు చేస్తూ సుడో సైన్స్

ను సమాజంలో ముందుకు నడిపిస్తూ అంధత్వాన్ని పెంచుతున్నారన్నారు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న నాస్తిక కేంద్రం, మహారాష్ట్ర అంధ శ్రద్ధ నిర్మూలన సమితి, హేతువాద సంఘం, నాస్తిక సమాజం, జేవీవీ వంటి సంస్థల నుంచి 700 మంది ప్రతినిధులు హాజరయ్యారు. తమిళ లోకసభ సభ్యులు షణ్ముగం, తమిళ హేతువాద సంఘం అధ్యక్షుడు, మహాసభ నిర్వహణ కన్వీనర్ ఆర్.తమిళ్ సెల్వన్ సందేశం ఇచ్చారు. వివిధ రాష్ట్రాల సంఘాల ప్రతినిధులు తమతమ ప్రాంతాల్లో జరిగే అంశాల పై ప్రసంగించారు. తొలుత సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈటీ రావు (ఫిరా) జీడీ సారయ్య (నాస్తిక సమాజం), నార్నె వెంకట సుబ్బయ్య, జే కృష్ణయ్య (హేతువాద సంఘం) బీ సాంబశివరావు (మానవ వికాస వేదిక), మోతుకూరి అరుణ కుమార్ (నాస్తిక కేంద్రం), మందగళ్ల సాయి కుమార్ (ఏఐఎస్ఎఫ్) , బీ సుధాకర్ ఈశ్వర లింగం, తమిళనాడు, ఉభయ తెలుగు రాష్ట్రాలు, కేరళ, మహారాష్ట్ర, ఒడిశా, హర్యానా, పంజాబ్, బీహార్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.